


తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

హైదరాబాద్ fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-11-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 283 పేజీలు: 10+4 వెల: 6.50

పెరిగిన అమూల్ పాల ధరలు 3

మదురైలో రూ. 50 కోట్ల బంగారం చోరీ 5



సిపి సజ్జనార్ ఆకస్మిక బదలీ

ఆయన స్థానంలో మహేష్ భగవత్

రాష్ట్రంలో భారీగా ఐపిఎస్‌ల బదలీలు

జైళ్ల శాఖ డిజిగా స్వాతి లక్రా, రోడ్డుసేఫ్టీ బ్యూరో డైరెక్టర్‌గా స్టీఫెన్ రవీంద్ర

శాంతి భద్రతల అదనపు డిజిగా అకున్ సబర్వాల్

పొగలు.. సెగలు

ఉన్నతాధికారితో విభేదాలవల్లే సజ్జనార్‌పై చర్య!

స్టీఫెన్ రవీంద్ర మార్పు వెనుక ఓ మంత్రి ఒత్తిడి!

అవినీతి ఆరోపణలున్న ఐపిఎస్‌లకు కీలక పోస్టింగ్‌లా?

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: ఐపిఎస్ అధికారుల ఆకస్మిక బదిలీల వెనుక పోలీసు వర్గాలతో పాటు ప్రభుత్వంలోనూ భిన్నంగా చర్చించుకుంటున్నారు. తాజా బదిలీలలో సిటీ కొత్వాల్ సజ్జన్నర్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్రల వ్యవహారం చర్చనీయాంశంగా మార డం గమనార్హం. ఇదే సమయంలో తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు ఐపిఎస్ అధికారులకు కీలక పోస్టింగులు లభించడం విశేషంగా చెప్పాలి. సిటీ కొత్వాల్‌గా వున్న సజ్జన్నర్ గత ఏడాది సెప్టెంబరు 30వ తేదీన బాధ్యతలు చేబట్టారు. అప్పట్లో ఆర్టీసీ ఎండిగా వున్న ఆయనను సర్కారు ఏరికోరి హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా నియమించింది. అయితే ఓ ఉన్నతాధికారితో ఆయనకు పొసగడం లేదని వార్తలు వస్తున్నాయి. సదరు ఉన్నతాధికారి మాటను సజ్జన్నర్ ఖాతరు చేయడం లేదని అనేక సందర్భాలలో స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారని, ఇవన్నీ ఆయనకు ఇబ్బందికరంగా మారాయని >>2



3 టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు

నిమ్స్, టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి

వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం

వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో సిఎం రేవంత్

వచ్చే జూన్‌కు పూర్తిస్థాయి టిమ్స్‌లు

యేడాదిలో ఉస్మానియా సేవలు ప్రజలకు అందాలి..

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు12: వచ్చే జూన్ 2వ తేదీ నాటికి అల్వాల్, ఎల్ బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి ఉస్మానియా నూతన ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలోనే 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. సనత్‌నగర్, అల్వాల్, ఎల్‌బీ నగర్ టిమ్స్‌ల్లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్ మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్‌ల పర్యవేక్షణకు గ్రూప్1 అధికారులను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపైనే దృష్టి సారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్స్ లేకపోయినా, శస్త్రచికిత్సలకు ఆలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి >>2

డీలిమిటేషన్, మహిళా బిల్లుల ఆమోదం!

మెజారిటీకంటే ఎక్కువ మద్దతే ఉందన్న అమిత్‌షా



నెలాఖరులో పార్లమెంటు ప్రత్యేక భేటీ!

న్యూఢిల్లీ, నవంబర్ 12: డీలిమిటేషన్, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసేందుకు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ బిల్లు లోక్‌సభలో 15 నుండి 18 ఓట్ల మెజారిటీతో ఆమోదం >>2

సవాళ్ల పరిష్కారానికే 'సమ్మిట్'

ప్రజాస్వామ్యం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఎఐ, వాతావరణ మార్పులపై చర్చలు

'తెలంగాణ రైజింగ్'పై ప్రత్యేక గోష్ఠులు

సదస్సు స్వాగత కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

సదస్సు ప్రారంభ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: ప్రస్తుతం ప్రపంచం అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటికి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు 'భారత్ సమ్మిట్-2026 ఒక వేదికగా నిలవనుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో వివిధ దేశాల ప్రతినిధులు,మేధావులు ఒకచోట చేరి వాటిపై చర్చించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను కనుగొనే అవకాశం కలుగుతుందన్నారు. గురువారం హెచ్‌ఐసీసీ నోవాటెల్‌లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్ - 2026'స్వాగత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబుమాట్లాడుతూ. ప్రస్తుతం ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, తరతరాలుగా ప్రపంచ శాంతిని కాపాడిన అంతర్జాతీయ సంస్థల పాత్రపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే తరాలకు ఎలాంటి ప్రపంచాన్ని నిర్మించాలి..? అందుకోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి..? అనే అంశాలపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మేధోపరమైన చర్చలకు, ఆలోచనలకు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తెలంగాణ ఎల్లప్పుడూ స్వాగతం పలుకుతుందన్నారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ఆలోచనల స్ఫూర్తితో సల్మాన్ ఖుర్షీద్ మార్గదర్శకత్వంలో రెండ్రోజుల పాటు వరుసగా రెండో ఏడాది కూడా భారత్‌సమ్మిట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. దీనికి వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ప్రజాస్వామ్యం, ఏఐ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపు, వాతావరణ మార్పులు, అంతర్జాతీయ సంస్థల సంస్కరణలు, ప్రపంచ శాంతి, మీడియా భవిష్యత్తు తదితర అంశాలపై 12 అంతర్జాతీయ ప్యానెల్ డిస్కషన్స్ ఉంటాయన్నారు. వీటితో పాటు హైటెక్స్‌లో 'తెలంగాణ రైజింగ్' పేరిట 8 ప్రత్యేక చర్చా >>2



జేబులో రాజ్యాంగం

వారి ఆస్తి అనుకోవాలా?

రాహుల్ గాంధీపై ప్రధాని మోడీ కామెంట్

డీజిల్ ధర రూ.50 పెంచాలి, కానీ రూ.7 పెంచాం

రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాం..

12యేళ్లలో రూ.16 లక్షల కోట్లు ఖర్చుచేశాం

'కిసాన్ తక్ష్' సదస్సులో ప్రధానమంత్రి వెల్లడి

7

ఎన్విడియా సిఇఒ జెన్సన్ రాజీనామా

న్యూఢిల్లీ, నవంబరు 12: ఎన్విడియా సిఇఒ జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్ హువాంగ్‌తో వివాహేతర సంబంధమున్నట్లు ఆయన ఇటీవల వెల్లడిం



చడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో సంస్థకు చెందిన మహిళతోనూ సంబంధాలున్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో జెన్సన్ పదవి నుంచి వైదొలగాలనే డిమాండ్లు మొదలయ్యాయి. తాజా >>2



అవి'నీటి' అధికారి అక్రమాస్తులు 100 కోట్లు!

హైదరాబాద్,నవంబరు 12,ప్రభాతవార్త: నీటిపారుదలశాఖ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ సత్యనారాయణ ఇంట దాదాపు వంద కోట్ల (బహిరంగమార్కెట్ విలువ) అక్రమ ఆస్తులు సంపాదించినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గం బైరామల్‌గూడ మాధవరం సెరెనిటి >>2

అభివృద్ధిని అడ్డుకొనే సమ్మిట్

రాహుల్ గాంధీ విజన్ ఏమిటి?

ఆయన వైఫల్యాలు ప్రపంచానికి చాటేందుకే సదస్సు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శ



హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'భారత్ సమ్మిట్ ఏ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారో, కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ నిధులతో పార్టీ కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారో తెలంగాణ ప్రజలకు చెప్పాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.'దేశ రాజకీయాల్లో పదే పదే వైఫల్యం చెందుతున్న రాహుల్ గాంధీని.. ఆయన విజన్‌ను ప్రపంచదేశాల ముందు పెట్టేందుకే ఈ సదస్సు అనికాంగ్రెస్ పార్టీ, సీఎం చెబుతున్నారు. అదేం విజన్? దేశంపైన విషం చిమ్మే శక్తులకు తెలంగాణ వేదిక కావడం, భారత్ సమ్మిట్ పేరుతో ఆ శక్తులన్నీ హైదరాబాద్‌లో కలవడం దురదృష్టకరం' అని పేర్కొన్నారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఇదిభారత్ వ్యతిరేక సమ్మిట్,దేశ అభివృద్ధిని అడ్డుకునే సమ్మిట్. దేశ రాజ్యాంగ బద్ధ సంస్థలను బద్నాం చేసే సమ్మిట్ అది. మోదీ పైన వ్యక్తిగతంగా తప్పుడు ఆరోపణలు చేసేందుకు పెట్టుకున్న వేదిక ఇది' అని వ్యాఖ్యానించారు.'కాంగ్రెస్‌పార్టీ అనేక సంవత్సరాలుగా..భారతదేశంలో ప్రజాబలం కోల్పోయి, ప్రజల మద్దతు లేక వరుస ఓటములను కప్పిపుచ్చుకునే సమ్మిట్,రాహుల్ గాంధీ నాయకత్వంలో, వంద ఓటములు కాంగ్రెస్ పార్టీ ఖాతాలో చేరాయి. భారత రాజ్యాంగ బద్ధ సంస్థలను తక్కువ చేసి చూపించే సమ్మిట్ ఇది' అని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ సమ్మిట్ లో రాహుల్ విజన్.. ప్రపంచానికి పరిచయం చేస్తారట అని ప్రశ్నించారు. దేశంలో.. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలనే తేడా లేకుండా.. అన్ని రాష్ట్రాలు పోటీలు పడి అభివృద్ధిలో పరుగులు పెడుతున్నాయి. మోదీ నాయకత్వం కారణంగా.. దేశవ్యాప్తంగా పోటీవాతావరణం పెరిగింది. పెట్టుబడులకోసం పోటీ తత్వం పెరిగింది. దీన్ని తక్కువచేసి చూపించే ప్రయత్నం, వీటిని అడ్డుకునే ప్రయత్నం భారత్ సమ్మిట్ ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోంది' అని ధ్వజమెత్తారు. అసలు రాహుల్ విజన్ ఏంటి? అని ప్రశ్నించారు. ఈ దేశంలో ఉగ్రవాదం ఆగిపోయింది, అవినీతి లేదు, కుల రాజకీయాలు, మత రాజకీయాలు తగ్గాయి, కుటుంబ రాజకీయాలకు చోటు లేకుండా పోయింది. ఏనాడైనా వీటిని >>2



మీనాక్షి తర్వాత..

డిసెంబరులోగా రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కొత్తనేత

ఎంపిక కసరత్తులో ఖర్గే, రాహుల్

ముకుల్ వాస్నిక్, డాక్టర్ చెల్ల కుమార్, దిగ్విజయ్‌సింగ్, అశోక్ గెహ్లోట్ పేర్ల పరిశీలన

స్థానిక నాయకత్వం అభిప్రాయాల సేకరణ

హైదరాబాద్, నవంబరు12, ప్రభాతవార్త: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాలను పర్యవేక్షణకు మీనాక్షి నటరాజన్ స్థానంలో మరో కొత్తవారిని డిసెంబరు మొదటివారం వరకు నియమించేందుకు ఎంపిక ప్రక్రియ షురూ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్ళు కాబోతున్నా పాలనపై పట్టుసాధించపోగా క్రమశిక్షణ రాహిత్యం నాయకుల్లో పెరిగి పార్టీ సంస్థాగతంగా నానాటికి బలహీనపడుతోన్నది. కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ చర్యలు కేవలం బిసి ఎస్సీలకు మాత్రమే పరితం చేయడం అగ్రవర్ణకులాలకు చెందిన నాయకులు ఎంతగా పార్టీ పరువును బజారుకీడ్చినా దండించడానికి మాత్రం టిపిసిసి క్రమశిక్షణ కమిటీకి చేతులు రావడంలేదు. టిపిసిసి చీఫ్ పరిధి కూడా దాటి ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఎఐసిసి వర్కింగ్ కమిటీ శాశ్వత సభ్యుడైనా సంజాయిషీ కోరుతూ >>2



ఉమ్మడి ఎపి మాజీ మంత్రి శత్రుచర్ల ఇకలేరు

7

పుతిన్‌తో ట్రంప్ దూతల భేటీ

5



ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక మలుపు

ఖైదీల మార్పిడిపై కుదిరిన ఒప్పందం

యుద్ధ విరమణపై ప్రతిష్టంభన



కేరళ వాయనాడ్‌లోని కమ్మనాలో సంప్రదాయ విత్తన సంరక్షణకర్త చెరువాయల్ రామన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా

అక్రమాస్తులు 100 కోట్లు!

>> గేటెడ్‌ కమ్యూనిటి లో ఉన్న ఆయన నివాసంతోపాటు పలు ప్రాంతాల్లో ఎకకాలంలో పది ఎసిబి బృందాలు తనిఖీచేశాయి. ఈ సోదాలో రూ.7కోట్ల విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఎసిబి డిఎస్‌పి చలపతి వెల్లడించారు. 25ఎకాల భూమిపత్రాలు, 50 తులాల బంగారు ఆభరాణాలు,నాలుగు ఇళ్ళు ఉన్నాయి. ప్రభుత్వలెక్కల ప్రకారం ఏడుకోట్లు కాగా బహిరంగ మార్కెట్‌లో వందకోట్లకుపైగానే వీటివిలువ ఉండవచ్చని నీటిపారుదలశాఖ ఉద్యోగులు చర్చించుకొంటున్నారు. రాత్రి తొమ్మిదిగంటల వరకు సోదాలు తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు జరుపుతున్నారు. పూర్తి వివరాలు సోదాల అనంతరం వెల్లడిస్తామని ఎసిబి అధికారులు తెలిపారు.ఆర్ సత్యనారాయణ నాగర్‌కర్నూల్ ఐఅండ్‌కాడ్‌లో పనిచేస్తున్నారు.

సిఇఒ జెన్సన్ రాజీనామా

>> పరిణామాలు జాతీయ భద్రతపై ఆందోళనలు రేకెత్తించడంతో రాజీనామా చేస్తున్నట్లు జెన్సన్ ప్రకటించారు. జెన్సన్ రాజీనామా నేపథ్యంలో తాత్కాలిక సిఇఒగా కొలెట్ క్రెస్‌కు బాధ్యతలు అప్పగించినట్లు ఎన్విడియా ప్రకటించింది.

ప్రస్తుతం ఆమె సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా ఉన్నట్లు తెలిపింది. తాజా పరిణామాలతో ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థల్లో ఒకటైన ఎన్విడియా షేర్లు ప్రీ మార్కెట్ ట్రేడింగ్‌లో 10 శాతం పతనం కావడం గమనార్హం.

పార్లమెంటు ప్రత్యేక భేటీ!

>> పొందుతుందని ప్రభుత్వ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గురువారం మధ్యాహ్నం మీడియా మిత్రులతో చిట్‌చాట్‌లో వెల్లడించారు. త్వరలో మూడు రోజులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని, బిల్లులను 15-18 ఓట్ల తేడాతో ఆమోదింపజేస్తామని అన్నారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని, అయితే, ఈ ప్రత్యేక సమావేశం ఎప్పుడు జరగాలి, ఎంతకాలం కొనసాగాలి అనేది త్వరలో తెలుస్తుందని పేర్కొన్నారు.

అమిత్ షా చేసిన ప్రకటన, ఆయన 'డీలిమిటేషన్ నాటకాన్ని పునరుద్ధరిస్తోందని కాంగ్రెస్ గురువారం ఆరోపించింది. ఆయనను 'కపట మాటలు, ఆర్భాటాల మాంత్రికుడ్ను అని అభివర్ణించింది. గతంలోనూ డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేయడానికి షా ప్రయత్నించారని, కానీ లోక్‌సభలో ఘోర పరాజయం చవిచూశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. షా 'బుల్డోజర్ గతంలోనూ పనిచేయలేదని, ఇకపైనా పనిచేయదని ఆయన స్పష్టం చేశారు. "ఏడు నెలల క్రితం కూడా ఆయన ఇదే మాట చెప్పారు, కానీ ఏప్రిల్ 17న లోక్‌సభలో 50కి పైగా ఓట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూశార్ను అని రమేష్ 'ఎక్స్ లో రాశారు. "ఆయన బడాయి మాటలు, ఆర్భాటాలలో ఆరితేరినవారు. ఆయన బుల్డోజర్ అప్పుడు పనిచేయలేదు, ఇకపై కూడా పనిచేయదు," అని ఆ కాంగ్రెస్ నాయకుడు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం. అంటే కనీసం 361 ఓట్లు కావాలి. ప్రస్తుతం లోక్‌సభలో మొత్తం 543 స్థానాలు ఉండగా, అందులో మూడు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ ప్రతిపాదిత చట్టంలో ప్రధానాంశం ఏమిటంటే, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుండి గరిష్టంగా 850కి పెంచడం. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా ఈ విస్తరణను చేపట్టనున్నారు.

నెలాఖరులో ప్రత్యేక సమావేశాలు?

పార్లమెంటు శీతాకాల సమావేశాలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఉన్నత స్థాయి ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుల కోసం శీతాకాల సమావేశాలకు ముందే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. అంతేకాకుండా, సభలో ఈ బిల్లుల ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల (2/3) మెజారిటీని సాధించగలమని ప్రభుత్వం నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. నెలల తరబడి చర్చలు, లోక్‌సభలో ఓటింగ్ విఫలమైన నేపథ్యంలో, వివాదాస్పద డీలిమిటేషన్ బిల్లును ప్రభుత్వం మళ్లీ పార్లమెంటు ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకుంది. ఈ బిల్లును ప్రవేశపెట్టినప్పటి నుండి కేంద్రం తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. రాష్ట్రాల జనాభా ప్రాతిపదికన సీట్లను పునర్వి భజించే విధానంపై ప్రతిపక్షాలు నిరంతరం అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

కొత్తగా వచ్చిన గ్రీన్ ఎస్ఎమ్ క్యాబ్ సర్వీసులపై ప్రవీణ్ కుమార్ ఫైర్

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో కొత్తగా కార్యకలాపాలు ప్రారంభించిన గ్రీన్ ఎస్ఎమ్ ఎలక్ట్రిక్ క్యాబ్ సంస్థ తీరుపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఒక కంపెనీ తన వ్యాపార విస్తరణ కోసం స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తోందని ఆరోపించారు. గ్రీన్ ఎస్ఎమ్ వ్యాపార వ్యూహాన్ని గతంలో టెలికాం రంగంలో జియో ప్రవేశంతో ఆయన పోల్చారు. "2016లో జియో అనే కంపెనీ ఫ్రీ డేటా, ఫ్రీ కాల్స్ అనే ఆఫర్‌తో ప్రజల ముందుకొచ్చింది. ఫ్రీ ఆఫర్‌తో జియో రాగానే ఎయిర్‌సెల్, టాటా డొకోమో, రిలయన్స్ టెలికమ్యూనికేషన్స్ వంటి కంపెనీలు కనుమరుగయ్యాయి. వొడాఫోన్, ఐడియా కలిసిపోయాయి. పోటీదారులంతా లేకుండా పోయాక లక్షల మంది కస్టమర్లు వచ్చాక జియో రేట్లు పెంచడం మొదలుపెట్టింది. ఇప్పుడు గ్రీన్ ఎస్ఎమ్ అనే కంపెనీ కూడా సరిగ్గా అదే చేయబోతోంది" అని పేర్కొన్నారు.ప్రస్తుతం కిలోమీటరుకు రూ.8 అంటూ తక్కువ ధరలతో కస్టమర్లను ఆకర్షిస్తున్నారని ఆయన చెప్పారు. "ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లంతా మీ ఆటోలు, క్యాబ్‌లు బంద్ చేసుకోండి.. మీ ర్యాపిడోలు ఆపేసి మా దగ్గరకు వచ్చి జీతానికి డ్రైవర్లుగా చేరండి అని గ్రీన్ ఎస్ఎమ్ పరోక్షంగా చెబుతోంది" అని విమర్శించారు. ఈ పరిణామాల వల్ల రాష్ట్రంలోని సుమారు 6 లక్షల మంది డ్రైవర్ల జీవనోపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు.

పూర్తిస్థాయి టిమ్స్‌లు

>> సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం పూర్తయ్యే వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నమరో 79 డయాలసిస్ సెంటర్ల పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. టిమ్స్‌తో పాటు బోధన కళాశాలలు, నర్సింగ్ కళాశాలల పనులు, పరికరాల కొనుగోలు ప్రక్రియ ఏకకాలంలో పూర్తవ్వాలని, అందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుప్రతుల్లో వైద్యులు, సిబ్బంది హాజరైన సమయం, విధుల నుంచి వెళ్లే సమయాన్ని నమోదు చేయాలని, హాజరు విషయంలో బయోమెట్రిక్ విధానం అమలయ్యేలా చూడాలని, ఏఐతో పర్యవేక్షణ చేయాలని సీఎం శాఖాధికారులను ఆదేశించారు. మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల (ఒపి) సంఖ్య 7 కోట్ల నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్ పేషెంట్ల (ఐపి) సంఖ్య 23 లక్షల నుంచి 24.30 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి గతంలో సగటున 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా సగటున 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిపి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్తూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముష్రఫ్ అలీ ఫరూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబరితి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వారం - వర్జ్యం

13-11-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
కార్తీక మాసం, దక్షిణాయణం,
శరదృతువు, శుక్లపక్షం, విశాఖ కార్తె,
తి.చవితి రా.8.43, న.మూల సా.5.18
వ. మ.3.30 - సా.5.18, 2.తె.4.08-తె.5.57
దు.ఉ.8.26 - ఉ.9.12,2.మ.12.14-మ.1.00
రాహు ఉ.10.30-12.00 వరకు
శుభ స. లేదు.

వార్తాఫలం

మేషం : రుణాలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. ఉచిత సలహాలు ఇవ్వద్దు.

వృషభం : ప్రయత్నం మీద శుభకార్యాలు సానుకూల పరుచుకోగలుగుతారు. వ్యాపారస్తులకు కృషికి తగిన ఫలితాలు లభిస్తాయి.

మిథునం : ఉద్యోగస్తులకు ఉన్నతమైనటువంటి స్థితి పొందుతారు. నూతన గృహం కొనుగోలు చేయాలనే మీ ఆశయం నెరవేరుతుంది.

కర్కాటకం : ఆరోగ్యం, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు పెట్టుబడుల విషయంలో చాలా జాగ్రత్త అవసరం.

సింహం : కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. భూముల క్రయ విక్రయాల విషయంలో ప్రోత్సాహం లభిస్తుంది.

కన్య : ప్రభుత్వపరంగా రావలసిన ప్రయోజనాలు దక్కుతాయి. శుభకార్యాలు ఘనంగా నిర్వహిస్తారు.

తుల : గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

వృశ్చికం : ఇంతకాలం మిమ్మల్ని అపార్థం చేసుకున్న ఒక వర్గం తిరిగి మళ్ళీ చేరువవుతారు. ఇంటా బయట అనుకూలంగా ఉంటుంది.

ధనుస్సు : కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడతారు.

మకరం : సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం. సన్నిహితులనుండి కీలక సమాచారం అందుకుంటారు.

కుంభం : తండ్రి తరపునుండి ధనలాభం పొందుతారు. పరిశ్రమలు ఏర్పాటులో ఆటంకాలు తొలగుతాయి.

మీనం : కష్టానికి తగిన ఫలితం దక్కుతుంది. పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

అభివృద్ధిని అడ్డుకొనే సమ్మిట్

>> ప్రశంసించాడా? సొంత ప్రభుత్వం చేసిన ఆర్డినెన్స్‌ను 'కంప్లీట్ నాన్సెన్స్' అని చించేసి.. నాటి ప్రధాని మన్మోహన్‌ను అవమానించిన చరిత్ర రాహుల్ గాంధీది. ఈ విజన్‌నే ప్రపంచానికి పరిచయం చేస్తారా? అని ప్రశ్నించారు. దేశంలో హింస, అవినీతి, ఉగ్రవాదం, కుల రాజకీయాలు తగ్గుముఖం పట్టాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భారత్‌లో పెట్టుబడులు రాకుండా కాంగ్రెస్ విషం చిమ్మే ప్రయత్నం చేస్తోందని అన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధిని రాహుల్ ఏనాడైనా ప్రశంసించారా?, అసలు రాహుల్ గాంధీకి దేశాభివృద్ధిపై ఉన్న విజన్ ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ గౌరవించడం లేదని, సిఆర్‌పిఎఫ్ జవాన్లను నక్సలైట్లు హత్య చేస్తే.. కనీసం రాహుల్ గాంధీ ఖండించలేదని అన్నారు. మహాలక్ష్మి ్మ పథకం నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం ఇస్తామన్నారు ఇవ్వలేదు. ఒక్కో ఆడబిడ్డకు కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తంగా రూ.85వేల బకాయి పడింది. వితంతువులు, దివ్యాంగులకు ఇవ్వాల్సిన పింఛన్లు ఇవ్వలేదు. రూ.2వేల పింఛను రూ.4వేలు చేస్తామన్నారు. రూ.లక్షా 2వేల రూపాయలు ఒక్కొక్కరికి రాష్ట్రప్రభుత్వం బకాయి పడింది. నిరుద్యోగ యువతకు రూ. 4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఒక్కొక్కరికి రూ.1.36 లక్షల బకాయి పడింది. యువతకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఉద్యోగాల హామీ ఏమైంది? ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, పీఆర్సీ, మెడికల్ ఇన్సూరెన్స్ హామీల పరిస్థితి ఏమిటి? విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు,విద్యారంగ సమస్యలకు పరిష్కారం ఎక్క? ఎస్సీ, ఎస్టీలకు కుటుంబానికి రూ.12 లక్షలు, గ్రామపంచాయతీలకు రూ.25 లక్షలు ఇస్తామన్నారు. ఇందులో ఏ ఒక్కటీ అమలుకాలేదు. సమ్మిట్‌లో.. తాముఏం చేశాం, ఒక్కొక్కరికి ఎంత బకాయిలున్నారు. ఎంతమందికి వెన్నుపోటు పొడిచారో చెప్పాలని కోరుతున్నాను. తెలంగాణలో అన్నివర్గాలు కాంగ్రెస్ పార్టీ మోసానికి బలయ్యాయి.అందుకే వీటన్నింటిపైనా రాహుల్ గాంధీ.. భారత్ సమ్మిట్ లో ప్రకటిస్తే బాగుంటుందన్నారు..పాక్ అనుకూల శక్తులు, భారతదేశ వ్యతిరేక శక్తులన్నీ హైదరాబాద్ వేదికగా.. ఏకమవుతున్నాయి. ఇది తెలంగాణ ప్రజల సొమ్ముతో చేపడుతున్న కార్యక్రమం. ప్రభుత్వం ఎలా ఈ కార్యక్రమంలో భాగస్వామి అవుతోంది? పార్టీకి, ప్రభుత్వానికి మధ్య ఒక లక్ష్మణ రేఖ ఉంటుంది. దీన్ని గౌరవించాలి అని చెప్పారు.

సిపి సజ్జనార్ ఆకస్మిక బదలీ

ఆయన స్థానంలో మహేష్ భగవత్.. రాష్ట్రంలో భారీగా ఐపిఎస్‌ల బదలీలు

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: రాష్ట్రంలో 21 మంది ఐపిఎస్ అధికారులను బదిలీ చేస్తూ సర్కారు గురువారం ఆదేశాలు జారీ చేసి ంది. సిటీ పోలీసు కమిషనర్‌గా వున్న సజ్జన్నర్‌ను ఆకస్మికంగా బదిలీ చేయగా ఆయన స్థానంలో శాంతి భద్రతల డిజిగా వున్న మహేష్ భగవ త్‌ను నియమించారు. జైళ్ల శాఖ డిజిగా వున్న సౌమ్యా మిశ్రాను మహిళా భద్రత విభాగానికి బదిలీ చేయగా ఆమె స్థానంలో హోంగార్డుల విభా గం డిజి స్వాతి లక్రాను నియమించారు. పౌర సరఫరాల కమిషనర్‌గా వున్న స్టీపెన్ రవీంద్రను కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ బ్యూరో డైరక్టర్‌గా నియమించారు.

పేరు	ప్రస్తుత పోస్టింగ్	కొత్త పోస్టింగ్
1). సౌమ్యా మిశ్రా	జైళ్ల శాఖ డిజి	మహిళా భద్రత విభాగం, ఆర్గనైషన్స్, లీగల్ సెల్ విభాగం డిజి
2) స్వాతి లక్రా	హోంగార్డులు, ఎస్‌పిఎఫ్ డిజి	జైళ్లశాఖ డిజి, హోంగార్డుల విభాగం అదనపు బాధ్యతలు
3) మహేష్ భగవత్	శాంతి భద్రతల డిజి	హైదరాబాద్ పోలీసు కమిషనర్
4) చారు సిన్హా	మహిళా భద్రత విభాగం డిజి సిఐడి, ఎసిబి విభాగాల అదనపు బాధ్యతలు	ఎసిబి డిజి. సిఐడి అదనపు బాధ్యతలు
5) అనిల్ కుమార్	గ్రే హౌండ్స్, ఆక్టోపస్ డిజి	ఆర్టీసీ ఎండి
6) విసి సజ్జన్నర్	హైదరాబాద్ పోలీసు కమిషనర్	ఫైర్ సర్వీస్ డిజి, సివిల్ డిఫెన్స్ అదనపు బాధ్యతలు
7) నాగిరెడ్డి	ఆర్టీసీ ఎండి	పౌర సరఫరాల కమిషనర్
8) సంజయ్ కుమార్ జైన్	స్పెషల్ పోలీసు అదనపు డిజి	పోలీసు శిక్షణా విభాగం అదనపు డిజి
9) విక్రం సింగ్ మాన్	ఫైర్ సర్వీస్ డిజి	గ్రే హౌండ్స్, ఆక్టోపస్ అదనపు డిజి
10) స్టీపెన్ రవీంద్ర	పౌర సరఫరాల కమిషనర్	కొత్తగా ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ బ్యూరో డైరక్టర్
11) అకున్ సబర్వాల్	వైటింగ్	శాంతి భద్రతల అదనపు డిజి
12) చంద్రశేఖర్ రెడ్డి	మల్టీ జోన్ 1 ఐజి	ఎసిబి డైరక్టర్
13) కార్తికేయ	ఇంటెలిజెన్స్ ఐజి	మల్టీ జోన్ 1 ఐజి
14) రమేష్ నాయుడు	రోడ్ సేఫ్టీ, రైల్వేస్ ఐజి	రోడ్ సేఫ్టీ బ్యూరో ఐజి
15) జోయల్ దేవిస్	సిటీ ట్రాఫిక్ జాయింట్ సిపి	రోడ్ సేఫ్టీ బ్యూరో జాయింట్ డైరక్టర్, సిటీ ట్రాఫిక్ జాయింట్ సిపిగా అదనపు బాధ్యతలు
16) చందనా దీప్తి	ఫ్యూచర్ సిటీ జాయింట్ కమిషనర్	జోన్ 7 డిఐజి
17) భాస్కరన్	సిఐ సెల్ డిఐజి	డిఐజి ఇంటెలిజెన్స్
18) నారాయణ నాయక్	ఎస్‌సిఆర్‌బి డిఐజి	సిఐడి డిఐజి, బాసర డిఐజిగా అదనపు బాధ్యతలు
19) ఎల్ఎస్ చౌహాన్	కో ఆర్డినేషన్ డిఐజి	చార్మినార్ జోన్ డిఐజి
20) శ్రీబాల	ఎస్‌పి వైటింగ్	రోడ్ సేఫ్టీ బ్యూరో ఎస్‌పి
21) అరవింద బాబు	ఎస్‌పి వైటింగ్	ఐటి విభాగం ఎస్‌పి



కర్ణాటకలోని చామరాజనగర్‌లో గురువారం 'గోరే హబ్బా' ఆవు పేడ పండుగ వేడుకలో పాల్గొన్న ప్రజలు

మీనాక్షి తర్వాత..

>> నోటీలు జారీచేయడం పలు విమర్శలకు దారి తీసింది. ఏఐసిసి పరిశీలకులు తెలంగాణకు మీనాక్షి నటరాజన్ తరువాత ఎవరిని నియమించకపోవడంతో సంస్థాగతంగా పార్టీ గాడితప్పిపోతుండటంతో ఆ బాధ్యతలను ఎవరికి అప్పగించాలన్న దానిపై అధిష్టానం వివిధ కోణాల్లో పరిశీలిస్తోంది. కొత్త ఇంచార్జీ నియామకంపై రాష్ట్ర నేతలతోపాటు గతంలో తెలంగాణలో పనిచేసిన ఏఐసిసి నాయకులు, స్థానికంగా కాంగ్రెస్ పార్టీ అదిష్టానంకు విశ్వసనీయ సమాచారం ఇచ్చే నాయకత్వం అభిప్రాయం తీసుకొని కొత్త నియామకం చేయాలని కాంగ్రెస్ అదిష్టానం అడుగులు వేస్తోన్నది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఇటీవల టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ కలిసినప్పుడు రాష్ట్ర పరిస్థితులపై ఆరా తీయడంతోపాటు కొత్త ఇంచార్జీ ఎవరిని నియమిస్తే పార్టీకి లాభం కలిగే అవకాశం ఉంటుందో కూడా చర్చించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ పై అవగాహన కలిగిన పూర్వపు రాష్ట్ర వ్యవహారాల పర్యవేక్షకులు రోహిత్చౌదరి, విశ్వనాథన్, విష్ణునాథ్, మన్సూర్ అలీఖాన్ వంటి నేతలను రాహుల్ పిలిపించుకొని ఆరా తీశారని అంతేకాదుఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కూడా ఈ అంశంపై రాహుల్‌గాంధీ సమాచార సేకరణ చేయిస్తున్నట్లు తెలిసింది. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, నాయకుల మధ్య సమీకరణాలు, పార్టీ సంస్థాగత బలాబలాలు, ప్రభుత్వంతో సమన్వయం వంటి అంశాలపై సమాచారం సేకరిస్తుండటంతో డిసెంబరు మొదటి వారంలో గా నియమించబోయే కొత్త ఇన్చార్జ్ నియామకంలో గత అనుభవాలు కీలక భూమిక పోషించనున్నాయి. దీపాదాస్ మున్షీ తెలంగాణ ఏఐసిసి ఇంచార్జ్‌గా ఉన్న సమయంలో వివాదస్పదం కావడం, పార్టీ సీనియర్లను సంప్రదించకుండానే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారంటూ అధిష్టానానికి స్థానిక నేతలు ఆరోపణలు చేయడంతో ఆమెను పక్కనబెట్టారు. పార్లమెంట్ ఎన్నికలు,ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక విషయంలోనూ ఏఐసిసిని స్థానిక నాయకత్వంతో కలిసి తప్పుదారి పట్టించారని స్వంత పార్టీ నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. మీనాక్షి నటరాజనుకు బాధ్యతలు అప్పగించగా ఆమెవిధానాలు, వ్యవహారశైలి రాష్ట్రంలోని కొందరు నాయకులకు కంటగింపుగా మారాయి.పార్టీ నేతలందరినీ కలుపుకొని వెళ్లడం, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాల్లో విఫలమయ్యారన్న చర్చ జరిగింది. సెంట్రల్ యూనివర్సిటీ భూముల వ్యవవహారంలో ఆమె సెక్రటేరియట్‌లో కూర్చొని సమీక్ష చేయడం, మాజీ మంత్రి కొండా సురేఖ విషయంతో సహా పలు అనేక అంశాలలో ఆమె కొంత మంది తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు కంటిలో నలుసుగా మారింది. ఆమె పార్టీ వ్యవహారాలను క్రమశిక్షణతో నడిపించేందుకు ప్రాధాన్యం ఇవ్వగా రాజ్యసభకు వేసిననామినేషన్ తిరస్కరణకు గురయ్యేలా తెలంగాణ కేంద్రంగా కుట్రను విజయవంతంచేసి అమెకు దేశం దాటి వెళ్ళేలా చేశారు. ప్రస్తుతం మీనాక్షి నటరాజన్ ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లనున్న నేపథ్యంలో కొత్త ఇన్చార్జ్ నియామకం అనివార్యమైంది. ఆమె స్థానంలో ఎవరిని నియమించాలన్న దానిపై రెండున్నర నెలలుగా పార్టీ మల్లాగుల్లాలు పడుతోన్నది.తెలంగాణలో నానాటికి పెరిగిపోతున్న క్రమశిక్షణ రాహిత్యంకు ముకుతాడు వేయడానికి హేమాహేమిలను ఇంచార్జ్‌లుగా పంపాలనే నిర్ణయం రావడంతో ముకుల్ వాస్నిక్, డాక్టర్ చెల్లా కుమార్, పివిమోహన్, దిగ్విజయ్‌సింగ్, భూపేశ్ బఘేల్, అశోక్ గెహ్లోట్ పేర్లు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణలో పార్టీ సంస్థాగతంగా బలహీనపడటానికి కెసి వేణుగోపాల్‌కూడా ఒక కారణమని ముందుగా ఆయనను తెలంగాణ రాజకీయాల నుంచి దూరం చేస్తే బాధ్యత తీసుకొంటానని ఉమ్మడి రాష్ట్రంలో కీలక సమయంలో రాష్ట్ర ఇంచార్జ్ బాధ్యత నిర్వర్తించిన వ్యక్తి రాహుల్‌తో రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఖరాఖండిగా చెప్పినట్లు పార్టీ వర్గాలు చర్చించుకొంటున్నాయి. రాష్ట్ర రాజకీయాలపై అవగాహన ఉండటంతోపాటు, ఢిల్లీ నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు కలిగిన నేతకు బాధ్యతలు అప్పగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని హైకమాండ్ భావించి ఆ వ్యక్తిని బాధ్యతలు తీసుకోమని కోరగా ఆయన మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ, ఢిల్లీలో ఓ కీలక వ్యక్తి తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై ఉన్నపట్టు వంటి అనేక అంశాలను చర్చించి నట్లు తెలిసింది . రాష్ట్రంలో పాత, కొత్తతోపాటు సీనియర్ నాయకుల మధ్య సమన్వయం సాధించగలిగే నేత కోసం అధిష్టానం అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర పార్టీలో మంత్రుల మధ్య, మంత్రులు ఎంపిల మధ్య, దక్షిణ తెలంగాణలో నిధుల కోసం సొంత పార్టీ ఎమ్మెల్యేలు విమర్శలు చేయడం, మరికొంత మంది మంత్రి పదవిఆశించి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ పార్టీ అంతర్గత విభేదాలు సృష్టిస్తుండటం, నాయకుల మధ్య ఆధిపత్య పోరు, పదవుల పంపకాలు వంటి అంశాలు పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టుతున్నాయి. ఇప్పటికే కొండా సురేఖను మంత్రి మండలి నుంచి బహిష్కరించారు. మరో మంత్రి ఢిల్లీలో వీరాంగం సృష్టించారని క్రమశిక్షణ చర్యలు చేపట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. వీరంతా బడుగుబలహీన వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఆయా వర్గాల ప్రజలు కూడా ఆసక్తిగా కాంగ్రెస్ తీరును గమనిస్తున్నారు. బడుగు బలహీనవర్గాల ప్రజలలో నానాటికి ఇలాంటి విన్యాసాలతో పార్టీ దూరం కావడం, మంత్రులు, ఎమ్మె ల్యేలు, ఇతర ముఖ్య నేతల మధ్య సమన్వయం కుదర్చడం కూడా కొత్తగా నియమించబడే ఏఐసిసి ఇంచార్జీ ముం దున్న ప్రధాన బాధ్యత కానుంది. రాహుల్‌గాంధీ సోమవారం నుంచి అమెరికాలో పర్యటించి తిరిగొచ్చాక తెలంగాణ ఇంచార్జీ పేరు ఖరారు చేసే అవకాశం ఉందని పార్టీవర్గాల్లోచర్చజరుగుతోంది. తెలంగాణకు వచ్చినప్పుడు కూడా ఆయన స్థానిక నాయకత్వం అభిప్రాయం స్వీకరించి దానికి అనుగుణంగా ఇంచార్జీని నియమించే అవకాశం ఉంది.ఉత్తరప్రదేశ్ ఎన్నికల దృష్ట్యా ప్రస్తుతం తెలంగాణ ఇంచార్జీనియామకంలో ఆచితూచి ఏఐసిసి అడుగు వేస్తోన్నది.

పొగలు.. సెగలు

>> కొందరు చెబుతున్నారు. దీంతో పాటు ఇటీవల నగరంలో కల్తీ సరుకును అరికట్టే విషయంలో సిటీ పో లీసు విభాగం వరుస దాడులు చేసి, అనేక మంది వ్యాపారులను అరెస్టు చేయడం, వీరి ఫోటోలను మీడియాకు విడుదల చేయడం వ్యాపార వర్గాల్లో అసంతృప్తికి దారితీసింది. ఇవన్నీ ఎలావున్నా ఇటీవల ముగిసిన గణేష్ ఉత్సవాల సమయంలో సజ్జన్నర్‌ను అనేక మంది పొగడం గ మనార్హం. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో సమర్థుడైన ఆయనను 13 నెలలు గడవక ముందే సర్కారు ఉన్న పళంగా బదిలీ చేసి అప్రధానమైన ఫైర్ సర్వీస్ విభాగంలో నియమించిందని అంటున్నారు.

సజ్జన్నర్ విషయం ఇలా వుంటే పౌర సరఫరాల విభాగం కమిషనర్ స్టీపెన్ రవీంద్ర బదిలీ వెనుక ఏకంగా ఒక మంత్రి హస్తం వుందని ప్రచారం జరుగుతోంది. ఇటీవల అక్రమాలకు పాల్పడ్డ రైస్ మిల్లర్లపై పౌర సరఫరాల శాఖ వరుసగా దాడులు చేస్తుండడం తెలిసిందే. ముఖ్యంగా ఎంతో పలుకుబడి వున్న రాజకీయ నాయకులకు దగ్గరి వారి రైస్ మిల్లర్లపై జరిగిన వరుస దాడులు పలువురి అరెస్టు రాష్ట్రంలో రాజకీయంగా ప్రకంపనలు రేపాయి. దీంతో సదరు మంత్రి ఈ విషయమై స్టీపెన్ రవీంద్రపై ఎంతో ఒత్తిడి చేసినట్లు తెలిసింది. రైస్ మిల్లర్లపై దాడులు ఆపేందుకు, అరెస్టులను నివారించే విషయంలో మంత్రి మాటలను ఆయన బేఖాతరు చేసిన ట్లు సమాచారం. పౌర సరఫరాల విభాగంలో చట్టాలను బలంగా అమలు చేసిన అధికారిగా స్టీపెన్ రవీంద్ర అక్రమార్కులను హడలెత్తించారు. దీంతో ఈ విషయంలో సదరు మంత్రి స్టీపెన్ రవీంద్రపై కక్షగట్టి ఏకంగా సిఎం వద్ద పంచాయితీ పెట్టినట్లు తెలిసింది. ఒక దశలో స్టీపెన్ రవీ ంద్రను బదిలీ చేస్తే తప్ప తాను కార్యాలయానికి రానని లేకుంటే తనను వేరే శాఖకు మార్చుమని ఆ మంత్రి మొండికేసినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనూ ఆయనను 13 నెలలు వ్యవధిలోనే బదిలీ అయ్యారు. పౌర సరఫరాల కమిషనర్‌గా ఆర్టీసి ఎండి నాగిరెడ్డిని నియమించారు. పౌ ర సరఫరాల విభాగం కమిషనర్లుగా గతంలో ఐఎఎస్ అధికారులు వుండే వారు. బారస హయాంలో సిఎం కెసిఆర్ దీనిని కాదని అప్పట్లో సివి ఆనంద్‌ను తొలిసారిగా ఈ విభాగం కమిషనర్‌గా నియమించారు.

ఈ విభాగాన్ని పూర్తిగా మార్చివేసి అవినీతికి అడ్డుకట్ట వేసిన అధికారిగా ఆ యన పేరు గడించారు. ఆయన తరువాత నియమితులైన చౌహాన్, స్టీపెన్ రవీంద్రలు ఈ విభాగాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లారు. ఈ స్థాయిని నాగిరెడ్డి ఎంతమేర అందుకోగలరనేది చూడాల్సి వుంది. ఐపిఎస్ అధికారుల బదిలీల్లో వీరిద్దరి బదిలీపై పెద్ద చర్చకు దారితీసింది. దీని తరువాత తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొని ఇటీవలే బదిలీ అయిన ఓ డిఐజికి హఠాత్తుగా కీలక విభాగంలో మళ్లీ పోస్టింగ్ లభిం చడంపైనా ఉన్నతాధికారుల్లో చర్చకు దారితీసింది. ఇంతకు ముందు ఆయన పనిచేసిన చోట ఎస్ఐలు, సిఐల నుంచి లక్షలాది రూపాయలు వ సూలు చేసిన ఆరోపణలపై ఉన్నతాధికారులు బదిలీ వేటు వేసి వెయిటింగ్‌లో వుంచగా ఇది జరిగి మూడు నెలలు కూడా కాకముందే ఆయనకు అంతకన్నా మంచి స్థానంలో పోస్టింగ్ ఇచ్చారు. కాగా మరో ఇద్దరు ఐపిఎస్‌లు ఎస్‌పిలుగా గతంలో పనిచేసిన చోట అక్రమాలకు పాల్పడిన ఉదంతం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. దీంతో వీరిద్దరిని లూప్‌లైన్ పోస్టింగుల్లో నియమించగా తాజాబదిలీలలో వీరికికీలక పోస్టింగులు లభించాయి.

సవాళ్ల పరిష్కారానికే 'సమ్మిట్'

>> కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటిలో తెలంగాణ డెవలప్‌మెంట్ మోడల్, రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలపై ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకుంటారన్నారు. 'ఇండియా అండ్ ది వరల్డ్' పేరుతో ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు హాజరవుతారని, అదే రోజు 'అవర్ వరల్డ్ ఇన్‌స్టిట్యూట్‌'ను కూడా ప్రారంభించనున్నట్టుగా మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. హైదరాబాద్ ఎప్పటినుంచో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల కలయికకు వేదికగా నిలుస్తోందన్నారు. రాబోయే రెండు రోజులు ప్రపంచ దేశాల ఆలోచనలు, అభిప్రాయాల కలయికకూ వేదిక కానుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7 నుంచి 9 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0'లో పాల్గొనాలని విదేశీ ప్రతినిధులను ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సల్మాన్ ఖుర్షీద్, శశిథరూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులపై దాడిచేస్తే కఠిన చర్యలు

భౌతిక దాడులకు పాల్పడితే తీవ్రంగా స్పందిస్తాం

రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: ఆర్టీసీ ఉద్యోగులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. భౌతికంగా దాడులకు పాల్పడితే రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందిస్తుందని, అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆత్మహత్య చేసుకున్న నర్సంపేటకు చెందిన ఆర్టీసీ కండక్టర్ శంకర్‌గౌడ్ కుమారుడు హేమంత్‌గౌడ్‌కు ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డితో కలసి సంస్థలో రికార్డ్ ట్రెజర్‌గా ఉద్యోగ నియామక పత్రం అందచేశారు. ప్రయాణికులకు సౌక ర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అని, అదే సమయంలో ఉద్యోగులను కాపాడుకోవడం కూడా ప్రజల బాధ్యతేనని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆర్టీసీలో ఎక్కడైనా పొరపాటు జరిగితే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అంతే తప్ప సిబ్బందిపై దాడులకు పాల్పడవద్దని హితవు పలికారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా అదనపు బస్సుల ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణీకుల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఏ గ్రామానికైనా బస్సు సౌకర్యం అవసరమైతే స్థానిక అధికారులను సంప్రదించాలన్నారు. రూట్ వెరిఫికేషన్, సాధ్యాసాధ్యాల పరిశీలన అనంతరం ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.



సచివాలయంలో గురువారం ఆర్టీసీ కండక్టర్ శంకర్‌గౌడ్ కుమారుడు హేమంత్‌గౌడ్‌కు ఆర్టీసీ ఎండి వై.నాగిరెడ్డితో కలిసి సంస్థలో రికార్డ్ ట్రెజర్‌గా ఉద్యోగ నియామకపత్రం అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

2047కు ముందే వికసిత్ భారత్

'దీపావళి మిలన్ సమారోహ్'లో ప్రధాని మోడీ

ప్రెస్ రిలీజ్‌లు పోయాయ్.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్

దేశ విజయాలను ప్రపంచానికి చాటిచెప్పాలి: ప్రధాని

న్యూఢిల్లీ, నవంబరు 12: 'వికసిత భారత్' లక్ష్యం మనకు పూర్తిగా అందుబాటులోనే ఉందని, ఇటీవలి సంవత్సరాలలో దేశం సాధించిన విజయాలే దీనికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోడీ ధీమా వ్యక్తం చేశారు. 2047వ సంవత్సరాన్ని మనం వేచి చూడాల్సిన డెడ్‌లైన్‌గా కాకుండా, ఆ లక్ష్యం దిశగా నిరంతరం పురోగతి సాధించాల్సిన మార్గంగా చూడాలని ఆయన స్పష్టం చేశారు. గురువారం బిజెపి కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'దీపావళి మిలన్ సమారోహ్' కార్యక్రమంలో ప్రధాని మోడీ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితర సీనియర్ నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ "భారత్ నేడు సాధిస్తున్న విజయాల దృష్ట్యా, వికసిత భారత్ లక్ష్యం మనకు అందనంత దూరంలో లేదు" అని అన్నారు. సాంకేతిక, మౌలిక సదుపాయాల రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని ఆయన ఉదహరించారు. 'ఒకప్పుడు ఊహించడానికే కష్టంగా ఉన్న మైలురాళ్లను భారత్ ఇప్పుడు అందుకుంటోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్‌ను దింపి భారత్ చరిత్ర సృష్టిస్తుందని, ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా ఎదుగుతుందని ఎవరైనా ఊహించారా? గత 12 యేళ్లలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను నిర్మించుకున్నాం. మన యుపిఐ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా నిలిచింది. ఇవన్నీ సాధించగలిగినప్పుడు, వికసిత భారత్ కలను కూడా మనం కచ్చితంగా సాకారం చేసుకోగలం. చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే ఆర్చ్ బ్రిడ్జి నిర్మిస్తారని ఎవరు భావించారు?' అని ప్రధాని పేర్కొన్నారు. గత 12 మేళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వచ్చిన మార్పును ఆయన ఉదహరించారు. 'మిత్రులారా.. 12 యేళ్ల క్రితం నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పెద్ద విజయంగా భావించేవారని గుర్తుంచుకోండి. నేను ముఖ్యమంత్రిగా ఉన్న తొలి రోజుల్లో గ్రామాలకు వెళితే, కరవు పనుల్లో భాగంగా మా ఊరికి కనీసం ఒక రోడ్డు వేయించండి సారూ అని వినతిపత్రాలు ఇచ్చేవార్లు' అని ఆయన గుర్తు చేసుకున్నారు. వికసిత భారత్ లక్ష్యంపై మాట్లాడుతూ, ప్రధాని స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఉదాహరణగా చూపారు. 'సంపూర్ణ స్వాతంత్రం అనేది ఒకటి రెండు రోజుల్లో సాధ్యపడలేదు. క్రమంగా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. అదే విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో కనిపిస్తోందని, అదే మనల్ని వికసిత భారత్ లక్ష్యం వైపు నడిపిస్తుంది' అని పేర్కొన్నారు. భారతదేశ విజయగాథలను ప్రపంచానికి తెలియ జేయడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. '21వ శతాబ్దంలో కమ్యూనికేషన్ అనేది అతిపెద్ద బలం. మనకు యువ జనాభా, ప్రతిభ, టెక్నాలజీ, చౌకైన డేటా ఉన్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రపంచానికి చెప్పడానికి మన దగ్గర ఒక అద్భుతమైన కథ 'ఇండియా స్టోరీ' ఉంది. నా 'మన్ కీ బాత్' కార్యక్రమం ద్వారా దేశ ప్రజల విజయాలకు నేను నిరంతరం ఒక వేదిక కల్పిస్తున్నాను. భారత మీడియా కూడా దేశ విజయాలను చాటిచెప్పే కథనాలపై పనిచేసి, వాటిని ముందుకు తీసుకెళ్లాలి. ఇది దేశానికి చేసే గొప్ప సేవ అవుతుంది' అని ప్రధాని కోరారు.

పెరిగిన అమూల్ పాల ధరలు

రూ.2 నుండి రూ.4కు పెంపు

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: డెయిరీ సంస్థలు ఒక్కొక్కటీ తమ పాలు, ఇతర ఉత్పత్తుల ధరలను పెంచుతున్నాయి. ఇప్పటికే మదర్ డెయిరీ పాల ధరలను పెంచి 24 గంటలు కాకముందే ప్రముఖ పాడి పరిశ్రమ సంస్థ గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జిసిఎమ్ఎమ్ఎఫ్) తన అమూల్ బ్రాండ్ ఉత్పత్తుల ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అన్ని ప్రధాన రకాల పాల ధరలను లీటరుకు రూ.2 నుండి రూ.4 మేర పెంచింది. ఈ సవరించిన ధరలు గురువారం అర్థరాత్రి నుండి అమల్లోకి రానున్నాయి. ఈ యేడాది మే నెలలో చివరి సారిగా పాల ధరలను సవరించింది. తాజాగా ఇప్పుడు మళ్లీ పెంచింది. ఈ మేరకు ఒక ప్రకటనలో తెలంగాణతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రధాన రకాల పాల ధరలను 4 నుండి 5 శాతం మేర పెంచినట్లు ప్రకటించింది. 3 శాతం కొవ్వు కలిగిన అమూల్ తాజా టోన్డ్ మిల్క ధర లీటరుకు రూ.2 పెరిగింది. ఇది 3.3 శాతం పెరుగుదల. అలాగే 6 శాతం కొవ్వు కలిగిన అమూల్ గోల్డ్ మిల్క్ ధర లీటరుకు 5.5 శాతం పెరుగుదలతో రూ.4 పెంచింది. పాల ఉత్పత్తి, ప్రాసెసింగ్ ఖర్చులు విపరీతంగా పెరగడమే ఈ పెరుగుదలకు కారణమని అమూల్ యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ యేడాది కాలంలో పచ్చి, ఎండు మేత, నూనె పిండి, మొక్కజొన్న, బెల్లం వంటి పశువుల దాణా పదార్థాలు, పాలప్యాకేజింగ్ ఫిల్మ్, విద్యుత్ ధరలు గణనీయంగా పెరిగాయని పేర్కొంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా అస్తవ్యస్థమైన వర్షపాతం, వాతావరణ పరిస్థితుల కారణంగా పాల వినియోగదారుల ధరను పెంచక తప్పడం లేదని అమూల్ బ్రాండ్ యాజమాన్యం వెల్లడించింది.


ఏపిలో మోగిన పంచాయతి నగారా

3 విడతల్లో ఎన్నికలు

26, 29, డిసెంబరు 2న పోలింగ్

మొదటి విడతకు 15 నుంచి, రెండో విడతకు 18 నుంచి మూడో విడతకు 21 నుంచి నామినేషన్ల స్వీకరణ

విజయవాడ, నవంబరు 12,ప్రభాత వార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో పంచా యతీ ఎన్నికల నగారా మోగింది. మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించ నున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. గురువారం ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి విడుదల చేశారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, నామినేషన్లు, పోలింగ్, ఫలితాల వివరాలను వెల్లడించారాయన.



రెండవ విడత పంచాయతీ ఎన్నికలు..

రెండవ విడుత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నవంబరు 16వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ. ఈ నెల 20వ తేదీ నామినేషన్ల స్వీకరణ చివరి తేదీ.ఈ నెల 21వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.22, 23 తేదీల్లో నామినేషన్ల తిరస్కరణ, సంబంధిత అంశాలపై అప్పీళ్లకు అవకాశం ఉంటుంది.ఈ నెల 24వ తేదీ నామినేషన్ల ఉపసంహారణకు చివరి గడువు. ఈ నెల 24వ తేదీన పోటీలో నిలిచిన అభ్యర్థుల ప్రకటన వెలువడుతుంది.ఈ నెల 29వ తేదీన పోలింగ్ జరుగుతుంది. ఈ నెల 29వ తేదీన ఫలితాల వెల్లడి చేసారు.ఈ నెల 30వ తేదీన రీపోలింగ్ (ఎక్కడైనా పోలింగ్ రద్దయిన.. వాయిదా పడిన చోట)

మూడవ విడత పంచాయతీ ఎన్నికలు..

మూడవ విడుత పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ గమనిస్తే నవంబరు 19వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల ఈ నెల 21వ తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ జరుగుతుంది. ఈ నెల 23వ తేదీ నామినేషన్ల స్వీకరణ చివరి తేదీ జరుగుతుంది. ఈ నెల 24వ తేదీన నామినేషన్ల పరిశీలన ఈ నెల 25, 26 తేదీల్లో నామినేషన్ల తిరస్కరణ, సంబంధిత అంశాలపై అప్పీళ్లకు అవకాశం అవుతుంది.ఈ నెల 27వ తేదీ నామినేషన్ల ఉపసంహారణకు చివరి గడువు ఉంది. ఈ నెల27న పోటీలో నిలిచిన అభ్యర్థుల ప్రకటన విడుదల చేస్తారు.డిసెంబర్ 2వ తేదీన పోలింగ్. డిసెంబర్ 2వ తేదీన ఫలితాల వెల్లడి చేస్తారు.డిసెంబర్ 3వ తేదీన రీపోలింగ్ (ఎక్కడైనా పోలింగ్ రద్దైన.. వాయిదా పడిన చోట) .

19 మునిసిపాలిటీలు, 4 కార్పొరేషన్లకు

26న పోలింగ్

విజయవాడ,నవంబరు 12,ప్రభాతవార్తప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో కోర్టు కేసుల కారణంగా వాయిదా పడిన 23 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నవంబరు 12న షెడ్యూల్‌ను ప్రకటించారు. రాష్ట్రంలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, ఇప్ప టికే 100 చోట్ల ఎన్నికలు పూర్తయ్యాయి. మిగిలిన 23 చోట్ల ఇప్పుడు ఎన్నికలు జరగనున్నాయి.సమీప గ్రామాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లు, వార్డుల డీలిమిటేషన్ వివాదాలు కోర్టుల్లో పెండింగ్‌లో ఉండటంతో అక్టోబరు 14న జారీ చేసిన నోటిఫికే షన్‌లో ఈ 23 సంస్థలు లేవు. కోర్టు కేసుల పరిష్కారం తర్వాత ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చారు.ఎన్నికలు జరిగే 23 సంస్థల్లో 4 మున్సిపల్ కార్పొరేషన్లు శ్రీకాకుళం, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి– తాడేపల్లి, 19 మున్సిపాలిటీలు/నగర పంచాయతీలు ఆమదాల వలస, రాజాం, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, చింతలపూడి, గుడివాడ, తాడిగడప, పొన్నూరు, నరసరావుపేట, కందుకూరు, పొదిలి, కావలి, గూడూరు, అల్లూరు, శ్రీకాళహస్తి, బి.కొత్తకోట, బాపట్ల ఉన్నాయి.

ఎన్నికల షెడ్యూల్

ఎన్నికల షెడ్యూల్‌ను గమనిస్తే నామినేషన్లు నవంబరు 14, 15, 16 స్వీకరిస్తారు. పరిశీలన నవంబరు 17న చేస్తారు. ఉపసంహరణ నవంబరు 18న గడువుగా నిర్ణయించారు. పోలింగ్ నవంబరు 26 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది.ఒక రీపోలింగ్ ఉంటే నవంబరు 27న నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు నవంబరు 30 ఉదయం 8 గంటల నుంచి ప్రారంభిస్తారు.మొత్తం 1,009 వార్డులు 4 కార్పొరేషన్లలో 260 డివిజన్లు, మిగిలిన 19 సంస్థల్లో 749 వార్డులు. మొత్తం ఓటర్లు 24,98,152 మంది. ఈ ఎన్నికలు 15 జిల్లాల్లో జరగనున్నాయి.మేయర్ రిజర్వేషన్లు గమనిస్తే శ్రీకాకుళం కార్పొరేషన్ జనరల్ మహిళ కేటాయించారు.మొత్తం నగర పాలక సంస్థలో 60 వార్డులుఉన్నాయి. రాజమహేంద్రవరం ఎస్సీ జనరల్‌కు కేటాయించారు.ఈ నగర పాలక సంస్థలో 72 వార్డులుఉన్నాయి, కాకినాడ బిసి మహిళకు కేటాయించారు. మొత్తం 66 వార్డులు ఉన్నాయి,మంగళగిరి– తాడేపల్లి ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. మొత్తం 62 వార్డులు. కార్పొరేషన్లలో మేయర్ + వార్డు సభ్యులకు, మున్సిపాలిటీల్లో ఛైర్‌పర్సన్ + వార్డు సభ్యులకు ఎన్నికలు జరుగుతాయి.

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల ప్రజాప్రతినిధుల కోర్టుకు గురు వారం హాజరయ్యారు.ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఆయనపై మూడు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదవడం తెలిసిందే. నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్, బేగంబజార్ పోలీస్ స్టేషన్, మెదక్ జిల్లాలోని కొడిపల్లి పోలీస్ స్టేషన్లలో ఈ కేసులు నమోదవడం విదితమే. ఈ కేసుల విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు. రేవంత్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ కేసులు నమోదు చేసిందని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ తిరుపతి వర్మ కోర్టుకు తెలిపారు. అనంతరం తదుపరి విచారణ ను న్యాయమూర్తి వచ్చే నెల 23వ తేదీకి వాయిదా వేశారు.

అమితాబ్‌బచ్చన్ ఇంటికి బెదిరింపు మెయిల్

ముంబయిలో హైఅలర్ట్

ముంబై, నవంబరు 12: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో బాంబు బెదిరింపులు మరోసారి తీవ్ర కలకలం రేపాయి. నగరంలోని పలు అత్యంత కీలక ప్రాంతాలు, ప్రముఖుల నివాసాలను పేల్చివేస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన బెదిరింపు ఈమెయిల్‌తో యంత్రాంగం ఉలిక్కిపడింది. గురువారం ఉదయం అందిన ఈమెయిల్‌తో ముంబై పోలీసులు, భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ఈ బెదిరింపు మెయిల్ లో నగరంలోని పలు ముఖ్యమైన ప్రదేశాలను టార్గెట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముంబై మేయర్ కార్యాలయంతో పాటు ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమా నాశ్రయం(ఎయిర్‌పోర్ట్), ఓ కోర్టు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) శాఖల్లో పేలుళ్లు జరుపుతామని హెచ్చరించారు. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ నివాసమైన జుహులోని బంగ్లాను కూడా పేల్చివేస్తామని మెయి ల్‌లో పేర్కొనడం సంచలనంగా మారింది. నవంబర్ 27న మహాలక్ష్మి రేస్‌కోర్స్ వేదికగా జరగ నున్న ప్రముఖ సింగర్ దిల్జిత్ దోసాంజ్ సంగీత కచేరీ (ప్రోగ్రామ్)పై కూడా దాడి చేస్తామని బెదరించారు. ఉదయం 10:52 గంటల సమయంలో అందిన ఈ మెయిల్‌ను తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు తక్షణమే అప్రమత్త మయ్యారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ప్రత్యేక భద్రతా బలగాలు రంగంలోకి దిగి అమితాబ్‌బచ్చన్ నివాసం, ఎయిర్ పోర్ట్, మేయర్ కార్యాలయం సహా మెయిల్లో పేర్కొన్న అన్ని ప్రాంతాల్లో అణు వణువూ విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. ప్రాథమిక తనిఖీల్లో ఇప్పటివరకూ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభిం చనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా ఆయా ప్రాం తాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మరోవైపు, ఈ బెదిరింపు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది? దీని వెనుక ఉన్నదెవరు? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

మహిళా కమిషన్ ఎదుట విచారణకు వైస్‌ఛాన్స్‌లర్ జానయ్య హాజరు

లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణ

హైదరాబాద్ (బేగంపేట), నవంబరు 12, ప్రభాతవార్త: తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ జానయ్యపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై గురువారం మహిళా కమిషన్ విచారణ జరిగింది.వైస్ ఛాన్స్‌లర్ జానయ్యపై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో తెలంగాణా రాష్ట్ర మహిళా కమిషన్ చేపట్టిన విచారణకు గురువారం వైస్ ఛాన్స్‌లర్ జానయ్యతోపాటు ఫిర్యాదుదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ ఇరువురిని విడివిడిగా విచారించి ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెల్సుకుంది.ఈ కేసుకు సంబంధించి తమ వాదనలకు మద్దతుగా ఉన్న తగిన ధారాలు,సాక్ష్యాధారాలు మరియు సంబంధిత పత్రాలను మహిళా కమీషన్ ఎదుట సమర్పించాలని ఇరువురికి ఆదేశాలు జారీచేసింది. సంబంధిత ఆధారాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి విచారణ చేపట్టేందుకు మహిళా కమీషన్ నిర్ణయించింది. ఈ మేరకు తదుపరి విచారణకు హాజరుకావాలని, కమిషన్ ఆదేశాల ప్రకారం అవసరమైన ఆధారాలను సమర్పించాలని ఇరువురికి సూచించింది.

కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కారుకు ప్రమాదం

క్షేమంగా బయటపడిన శేఖర్ ప్రభృతులు

శంషాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారు శంషాబాద్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. చిరంజీవి సినిమా కాకా షూటింగ్ ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా గురువారం ఉదయం 5 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది.వెనుక నుంచి వేగంగా పండ్ల లోడ్‌తో వచ్చిన బొలెరో వాహనం ఆయన ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టడంతో పక్కకు దూసుకెళ్లింది. దీంతో వెనుక భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్‌తో పాటు కారులోని మిగిలిన డ్రైవర్ మతంశెట్టి శ్రీనివాసరావు (56), కారు యజమాని కోట మధుసూదన్, ఆయన కుమారుడు శ్రీకర్ బాబు వారంతా క్షేమంగా బయటపడ్డడంతో పెనుప్రమాదం తప్పింది.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంపై స్పందించిన శేఖర్ మాస్టర్..

ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైన ఘటనపై ఆయన స్పందించారు. ఈ ప్రమాదంలో తాను, తనతో పాటు కారులో ఉన్నవారంతా క్షేమంగా ఉన్నట్లు వీడియో ద్వారా వెల్లడించారు. రాత్రి పాట చిత్రీకరణ పూర్తి చేసుకుని తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా తమ కారు ప్రమాదానికి గురైందని తెలిపారు. కారు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ అయ్యప్పస్వామి దయ వల్ల ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదన్నారు. అదేరోజు రాత్రి తిరిగి షూటింగ్ కు వెళ్లనున్నట్లు శేఖర్ మాస్టర్ పేర్కొన్నారు.



ప్రమాదానికి గురైన శేఖర్ మాస్టర్ కారు

ప్రధాని మోడీపై శామ్‌పిట్రోడా ప్రశంసలు

'దయగల, కష్టపడే వ్యక్తి' అంటూ కీలక వ్యాఖ్యలు

శామ్ భాయ్ అంటూ మోడీ సంబోధన

దీపావళి శుభాకాంక్షలు చెబుతూ ప్రధాని ట్వీట్



న్యూఢిల్లీ, నవంబరు 12: భారత విదేశీ కాంగ్రెస్ చీఫ్ శామ్ పిట్రోడా ప్రధాని నరేంద్ర మోడీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాజకీయంగా, సిద్ధాంతపరంగా తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, వ్యక్తిగతంగా ప్రధాని మోడీపై తనకు ఎలాంటి సమస్యలు లేవని ఆయన స్పష్టం చేశారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సామ్ పిట్రోడా ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ మంచి వక్త అని, వ్యక్తిగతంగా ఆయన ఎంతో ఆప్యాయంగా, దయతో వ్యవహరిస్తారని పిట్రోడా పేర్కొన్నారు.ప్రధాని మోడీపై తన అభిప్రాయం ఏమిటని ప్రశ్నించగా, శ్యామ్ పిట్రోడా మాట్లాడుతూ తాను మోడీని వ్యక్తిగా గౌరవిస్తానని తెలిపారు. 'ఆయన నా గుజరాతీ స్నేహితుడు. నేను మోడీని వ్యక్తిగా గౌరవిస్తాను. నేను, నా భార్య ఇద్దరం ప్రధానిని కలిశాం. వ్యక్తిగతంగా మోడీ మాతో ఎంతో ఆప్యాయంగా, దయతో, ప్రేమగా, శ్రద్ధగా వ్యవహరించారు. మోడీ మంచి వక్త, కష్టపడి పనిచేసే వ్యక్తి. మేము మంచి సంబంధాలతోనే ఉంటాం' అని పిట్రోడా అన్నారు. 'నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు. గుజరాతీ నాయకుడిగా, స్నేహితుడిగా, శ్రేయోభిలాషిగా మోడీపై నాకు ఎలాంటి వ్యతిరేకత లేదు. ఆయన నాతో ఎంతో ఆప్యాయంగా ఉంటారు. ఆ విషయాన్ని నేను అభినందిస్తాను' అని తెలిపారు. 'నేను మోడీతో రాజకీయంగా విభేదించవచ్చు. అదే సమయంలో ఆయనతో కలిసి భోజనం చేసి నవ్వుతూ మాట్లాడగలను. నాకు వ్యక్తిగతంగా ఎలాంటి సమస్యలు లేవు' అని వ్యాఖ్యానించారు. ప్రధాని మోడీపై వ్యక్తిగతంగా తనకు గౌరవం ఉందని, అయితే రాజకీయ, సిద్ధాంతపరమైన అంశాల్లో మాత్రం తమ అభిప్రాయాలు భిన్నంగా ఉంటాయని పిట్రోడా స్పష్టం చేశారు.

శామ్ భాయ్ అంటూ మోడీ సంబోధన

రాజకీయ విభేదాలు, తీవ్ర విమర్శలు, తరచూ జరిగే ఘర్షణలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నాయకుడు సామ్ పిట్రోడాలను అరుదుగా ఒకే తాటిపైకి తెచ్చాయి. కానీ దీపావళి ఒక అనూహ్యమైన స్నేహపూర్వక క్షణాన్ని తీసుకువచ్చింది. ప్రధానమంత్రి తన చిరకాల విమర్శకుడిని 'శామ్ భాయ్' అని సంబోధిస్తూ పండుగ శుభాకాంక్షలు తెలిపారు .ప్రధానమంత్రి గురువారం దీపావళి, గుజరాతీ నూతన సంవత్సరం సందర్భంగా భారత ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు శామ్ పిట్రోడాకు శుభాకాంక్షలు తెలిపారు.

ధూమపాన ప్రియులకు షాక్

మరోసారి సిగరెట్ల ధరల బాదుడు

న్యూఢిల్లీ, నవంబరు12: సిగరెట్ తయారీ సంస్థ ఐటిసి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ బ్రాండ్ గోల్డ్‌ఫ్లేక్ ప్రీమియం సిగరెట్ల ధరలను మరోసారి పెంచింది. ఒక్కో ప్యాకెట్‌పై రూ.10 పెంచడంతో గురువారం స్టాక్ మార్కెట్‌లో సిగరెట్ కంపెనీల షేర్లు జోరందుకున్నాయి. ఐటిసి, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా షేర్లు ఇంట్రాడే ట్రేడింగ్‌లో 4 శాతం వరకు లాభపడ్డాయి. పెరుగుతున్న పన్నుల భారం, చట్టబద్ధమైన సిగరెట్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో ఈ ధరల పెంపు చేయాల్సి వచ్చింది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం 60 నుంచి 70 మి.మీ. పొడవు ఉండే గోల్డ్ ఫ్లేక్ ప్రీమియం రెగ్యులర్ సైజ్ ఫిల్టర్ టిప్డ్ సిగరెట్ల 10 ప్యాకెట్‌ధరను ఐటిసి రూ. 125 నుంచి రూ.135కు పెంచింది. అంటే సుమారు 8 శాతం ధర పెరిగింది. కొత్త ధరలతో కూడిన స్టాక్‌లు నవంబర్ నాలుగో వారం నాటికి గోదాములకు చేరుకోనున్నాయి. 2026లో గోల్డ్ ఫ్లేక్ ప్రీమియం బ్రాండ్‌పై ఐటిసి ధరలు పెంచడం ఇది రెండోసారి. అంతకుముందు జూన్‌లో ఒక్కో ప్యాకెట్ ధరను రూ. 115 నుంచి రూ.125కు పెంచింది. తాజాగా మరో రూ.10 పెంచడంతో ఈ యేడాది ప్రారంభ ధరతో పోలిస్తే మొత్తం పెరుగుదల సుమారు 17.4 శాతానికి చేరింది. ధరల పెంపుతో గురువారం ట్రేడింగ్‌లో ఐటిసి షేరు గరిష్టంగా 1.61 శాతం పెరిగి రూ.289.10కి చేరుకుంది. మరోవైపు గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా షేరు 3.52 శాతం లాభంతో రూ.1,889 స్థాయిని తాకింది. సిగరెట్లపై పన్నులు గణనీయంగా పెరగడంతో ఐటిసి తన ధరల విధానాన్ని సమీక్షిస్తోంది. సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల సందర్భంగా కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం చట్టబద్ధంగా విక్రయించే సిగరెట్ల ధరలకు, అక్రమంగా విక్రయించే సిగరెట్ల ధరలకు మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. దీంతో చట్టబద్ధమైన మార్కెట్‌లో అమ్మకాల పరిమాణంపై ఒత్తిడి కొనసాగుతోంది. వినియోగదారులు తక్కువ ధరకు లభించే అక్రమ సిగరెట్లవైపు మళ్లకుండా ఉండేందుకు, అదే సమయంలో వ్యాపార లాభదాయకతను కాపాడుకునేందుకు ఆచితూచి ధరలను సవరిస్తున్నట్లు ఐటిసి తెలిపింది. ఈ ప్రభావం కంపెనీ ఆర్థిక ఫలితాల్లోనూ కనిపించింది. ఐటిసి సిగరెట్ వ్యాపారంలో గోల్డ్‌ఫ్లేక్ ప్రీమియం రెగ్యులర్ సైజ్‌విభాగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కంపెనీ సిగరెట్ ఆదాయంలో ఈ విభాగం వాటా సుమారు 50 శాతం వరకు ఉంటుంది. ఐటిసి మొత్తం లాభదా యకతలోను సిగరెట్ వ్యాపారం కీలక పాత్ర పోషిస్తోంది.



15 నుంచి నల్గొండలో 'అఖిల భారత కిసాన్ సభ'

జాతీయ కార్యదర్శి డా. విజూకృష్ణన్

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: ఈ నెల 15 నుండి 18 వరకు నల్గొండలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐకేఎస్ జాతీయ కార్యదర్శి డా.విజూ కృష్ణన్ కోరారు. దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొం టున్న సమస్యలను ప్రభుత్వాలకు తెలియజేసేలా మహా సభలలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సభకు సంబందించిన కరపత్రాలను సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైపు ఎల్‌నినో ప్రభావంతో వేసిన పంటలు నష్ట పోగా మరోవైపు ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫల మవుతున్న తీరును కళ్లకు కట్టినట్లుగా సాంస్కృతిక కార్యక్రమాల ద్వార వివరించ నున్నామని తెలిపారు. సభకు ముఖ్యఅతిథులుగా జాతీయ నేతలు బృందా కారత్, అశోక్ ధావలేలు హాజారు కానున్నట్లు తెలిపారు.

ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కరువు బారిన పడి పంటలు నష్టపోయిన రైతులకు ఆహార పంటలకు రూ. 30వేలు, వ్యాపార పంటలకు రూ60 వేల నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు మహా సభలకు వస్తున్న అతిథులకు స్థానిక రైతులతో కలిసి 5 వేల మంది వాలం టీర్లతో స్వాగత కార్యక్రమం నిర్వహించి, మర్రిగూడెం బైపాస్ నుండి ఎర్రకవాతు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో అఖిల భారత కిసాన్ సభ సభ్యులు తీగల సాగర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి హౌజింగ్ బోర్డులో చదరపు గజానికి గరిష్టంగా రూ.2.18లక్షలు

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: కూకట్‌పల్లిలోని హౌసింగ్ బోర్డులో ఓపెన్ ప్లాట్‌కు భారీ ధర పలికింది. తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వేలంలో కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లోని ఎల్ఐజీ 103 ప్లాట్‌కు చదరపు గజానికి గరిష్టంగా రూ.2.18 లక్షల ధర పలికింది.

ఈ ప్లాట్‌కు హౌసింగ్ బోర్డు రూ.1.60 లక్షల ధర నిర్ణయించగా, రికార్డు ధర పలకడం విశేషం.మొత్తం 11 ప్లాట్లకు వేలం నిర్వహించగా హౌసింగ్ బోర్డుకు రూ.33 కోట్ల ఆదాయం వచ్చింది. మరో 11 ప్లాట్లకు స్పందన రాకపోవడంతో వేలం నిర్వహించలేదు. స్థానికులు, ప్రతిపక్ష నేతల ఆందోళనల మధ్య భారీ పోలీస్ బందోబస్తుతో వేలం నిర్వహించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లోని 10 ఎల్ఐజీ, 9 ఎంఐజీ, 2 హెచ్ఐజీ ప్లాట్లతో పాటు ఓపెన్ ల్యాండ్ పార్శిల్స్ ను విక్రయానికి పెట్టారు. స్థానికుల అభ్యంతరాల నేపథ్యంలో ఫేజ్3లోని ఫిష్ మార్కెట్ సమీపంలోని 2,696 చదరపు గజాల స్థలం వేలంపై హైకోర్టు స్టే విధించింది. ఆ ఒక్క స్థలాన్ని మినహాయించి మిగిలిన ప్లాట్లకు వేలం నిర్వహించారు.

తెలంగాణ ప్రభుత్వం
పాఠశాల విద్యా శాఖ
షార్ట్ టెండర్ పత్రిక ప్రకటన
జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, మహబూబ్‌నగర్
Rc.No. 3012/PM POSHAN/MDM/2024, తేది: 10.11.2026
మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం అమలు కోసం 236 పాఠశాలలకు కిచెన్ పరికరాల సేకరణ కొరకు వంట పాత్రలు (Utensils), వడ్డించే పాత్రలు (Containers), మరియు గ్యాస్ స్టవ్‌లు కొనుగోలు మరియు సరఫరా చేయడానికి నమోదిత సంస్థల నుండి సీల్డ్ టెండర్లు రూ.33,30,800/- (అక్షరాల ముప్పై మూడు లక్షల ముప్పై వేల ఎనిమిది వందలు రూపాయలు మాత్రమే కోరబడుచున్నవి.
టెండర్ ఐటెమ్ : 1. కిచెన్ కంటైనర్లు & వంట పాత్రలు (బొగాన్లు, బేసిన్లు, బకెట్స్, స్పూన్స్ & కటీర్లు)
టెండర్ దరఖాస్తు ఫారం ధర :: రూ.6,000/-. బయానా డిపాజిట్ :: రూ.2,00,000/-. టెండర్ డాకుమెంట్స్ విక్రయం తేదీ (దరఖాస్తు) :: 10.11.2026 నుండి 19.11.2026. టెండర్లు దాఖలుకు చివరి తేదీ :: 19.11.2026 సా.5.00 గం. వరకు. సీల్డ్ టెండర్లు తెరచు తేదీ :: 20.11.2026 IDOC Meeting Hall, మహబూబ్‌నగర్. టెండర్ అప్లికేషన్ ధర & టెండర్ ధర కొరకు "Dist. Educational Officer, మహబూబ్‌నగర్" పేరున DD తీయాలి. టెండర్ ఫారాలు మరియు ఇతర సమాచారం కొరకు O/o DEO, మహబూబ్ నగర్ నుండి పైన తెలిపిన తేదీలలో పొందవచ్చును.
ఏ సమాచారం తెలపకుండా రద్దు చేయుటకు, తేదీలను మార్పు చేయుటకు & పొడిగించుటకు జిల్లా విద్యాశాఖాధికారి, మహబూబ్‌నగర్ గారికి పూర్తి హక్కులు గలవు.
గమనిక :: నమోదిత సంస్థలు GST & TIN నంబరు మరియు IT క్లియరెన్స్ కలిగి ఉండాలి.
సం/- జిల్లా విద్యా శాఖాధికారి, మహబూబ్ నగర్
DIPR.No.13598-PP/CL/Advt/1/2026-27, తేది: 12.11.2026

మంచి పనులు చేసి అహంకారం పెంచుకున్న వాడికంటే పాపం చేసి పశ్చాత్తాపపడ్డ వాడు ముందుగా తరిస్తాడు.

- సిసిరో

శాఖల సమన్వయంతోనే సైబర్ నేరాల కట్టడి

సైబర్ నేరాల నియంత్రణకు కేవలం పోలీసులే బాధ్యత వహించలేరు. బ్యాంకులు, టెలికాం సంస్థలు, డిజిటల్ చెల్లింపు సంస్థలు, సోషల్ మీడియా వేదికలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. అనుమానాస్పద ఖాతాలను వేగంగా గుర్తించడం, నకిలీ సిమ్‌ల వినియోగాన్ని నియంత్రించడం, మోసపూరిత ప్రకటనలను తొలగించడం, బాధితుల ఫిర్యాదులకు తక్షణ స్పందన ఇవ్వాలి. ప్రతిఇంటి రక్షణ కవచం సైబర్ నేరాలపై అవగాహనను పాఠశాల స్థాయి నుంచే ప్రారంభించాలి. గ్రామాల్లో గ్రామపంచాయతీలు, పోస్టాఫీసులు, మహిళాసంఘాలు, రైతు వేదికలు, కళాశాలల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలి. అభివృద్ధి అంటే కేవలం డిజిటల్ లావాదేవీల పెరుగుదల కాదు. ఆ లావాదేవీలు సురక్షితంగా జరగడం కూడా అభివృద్ధిలో భాగమే. సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేయాలి కానీ సంపాదనను దోచుకునే మార్గంగా మారకూడదు.



కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

తెలంగాణ అంటే ఐటీ రంగంలో దేశానికి దిక్సూచి. హైదరాబాద్ అంటే ప్రపంచ సాంకేతిక సంస్థలకు గమ్యస్థానం. డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ లావాదేవీలు, సాంకేతిక ఆవిష్కరణల్లో రాష్ట్రం సాధిస్తున్న పురోగతి గర్వకారణం. కానీ ఇదే డిజిటల్ ప్రపంచం సామాన్యుడి జేబును ఖాళీ చేసే సైబర్ నేరగాళ్లకు కూడా అడ్డాగా మారుతోందా? ప్రజల చేతిలో స్మార్ట్ ఫోన్ ఒక సౌకర్యంగా ఉండాల్సింది పోయి మోసగాళ్ల చేతిలో ఆయుధంగా మారుతోందా? జాతీయ నేర గణాంకాలసంస్థ (ఎన్‌సీఆర్‌బీ) 2024 నివేదిక ఈ ప్రశ్నలను తీవ్రంగా ముందుకు తెస్తోంది. దేశవ్యాప్తంగా 2024లో 1,01,928 సైబర్ నేర కేసులు నమోదయ్యాయి. వీటిలో తెలంగాణలోనే 27,230 కేసులు నమోదయ్యాయి. కర్ణాటకలో 21,993 కేసులు నమోదయ్యాయి. తెలంగాణ దేశంలో అత్యధిక కేసులు నమోదైన రాష్ట్రంగా నిలిచింది. 2023లో రాష్ట్రంలో 18,236 కేసులుఉండగా, 2024లో అవి 27,230కు చేరాయి. అంటే ఒక్క ఏడాదిలోనే సుమారు 49 శాతం పెరుగుదల. లక్ష జనాభాకు తెలంగాణలో 71.1 కేసుల రేటు నమోదైందని నివేదిక వెల్లడించింది. ఇది కేవలం గణాంకాల పెరుగుదల కాదు. ప్రజల డిజిటల్ భద్రతపై మోగుతున్న ప్రమాద ఘంటిక. సైబర్ నేరం అంటే ఎవరో ఒకరి బ్యాంకు ఖాతా నుంచి డబ్బు మాయం కావడం మాత్రమే కాదు. ఒక కుటుంబం జీవితకాల పొదుపు ఆవిరైపోవడం, ఒక వృద్ధుడి పెన్షన్ దోచుకోవడం, ఉద్యోగం కోసం వెతుకుతున్న యువకుడిని మోసం చేయడం, మహిళల వ్యక్తిగత గోప్యతను భంగం కలిగించడం, పిల్లలను ఆన్‌లైన్ వేధింపులకు గురిచేయడం ఇవన్నీ సైబర్ నేరాలే. తెలంగాణలో కేసులు అధికంగా నమోదవడానికి ఒక్క కారణాన్ని మాత్రమే చూపడంసరైంది కాదు. రాష్ట్రంలో డిజిటల్ వినియోగం విస్తృతంగా ఉండటం, నగరాల్లో ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలు ఎక్కువగా జరగడం, సైబర్ నేరాలపై అవగాహన పెరగడం, ఫిర్యాదులు నమోదు చేసే వ్యవస్థలు అందుబాటులో ఉండటం వంటి అంశాలు కూడా కేసుల సంఖ్యను ప్రభావితం చేయవచ్చు. అయితే, ఈ కారణాలు నేరాల పెరుగుదలను పూర్తిగా సమర్థించలేవు. ముఖ్యంగా ఒక్క ఏడాదిలో 49శాతం పెరుగుదల నమోదైనప్పుడు నేరగాళ్ల వ్యూహాలు ఎలా మారాయి? పోలీసుల దర్యాప్తు సామర్థ్యం ఎంత పెరిగింది? బాధితుల సొమ్ము ఎంత తిరిగి అందుతోంది? నేరగాళ్లకు శిక్షలు పడుతున్నాయా? అనే ప్రశ్నలకు సమాధానాలు అవసరం. దేశవ్యాప్తంగా 2024లో నమోదైన సైబర్ నేరాల్లో సుమారు 72.6 శాతం మోసం (ఫ్రాడ్) ఉద్దేశంతో జరిగినవేనని నివేదిక ఆధారిత విశ్లేషణలు సూచిస్తున్నాయి. అంటే సైబర్ నేరాల ప్రధాన లక్ష్యం ప్రజల ఆర్థిక వనరులే. సైబర్ నేరగాళ్లు ఇప్పుడుకేవలం నకిలీ లింకులు పంపే స్థాయిలోలేరు. కాలానుగుణంగా తమ పద్ధతులను మార్చుకుంటున్నారు. పోలీసులమని, సీబీఐ లేదా ఇతర దర్యాప్తు సంస్థల అధికారులమని నమ్మించి వీడియో కాల్ ద్వారా భయపెట్టి డిజిటల్ అరెస్ట్ చేస్తామని డబ్బు వసూలు చేయడం, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పి నకిలీ పెట్టుబడి యాప్‌లు, వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రజలను ఆకర్షించడం ద్వారా మోసాలు చేస్తున్నారు. ఇంటి నుంచే పని, అధిక జీతం, విదేశీ ఉద్యోగం అంటూ ముందస్తు రుసుములు వసూలు చేయడం, బ్యాంకు సిబ్బందిగా నటిస్తూ ఖాతా వివరాలు, ఓటీపీ, కార్డు సమాచారం తెలుసుకోవడం, బ్యాంకు ఖాతా లేదా సిమ్ నిలిపివేస్తామని చెప్పి నకిలీ




లింకులు పంపడం ద్వారా ప్రజల డబ్బులను కొల్లగొడుతున్నారు. సోషల్ మీడియా ద్వారా నకిలీ ఖాతాలు సృష్టించి స్నేహితులు,బంధువుల పేరుతో డబ్బుఅడగడం,ఏఐ ద్వారా స్వరాన్ని అనుకరించడం, నకిలీ వీడియోలు సృష్టించడం ద్వారా పరిచయస్తుల్లా నటించి డబ్బులు పొందుతున్నారు. ఈ మోసాలన్నింటిలోనూ ఒక సామాన్య లక్షణం ఉంది. నేరగాళ్లు సాంకేతిక లోపాన్ని మాత్రమే కాదు మనిషి భయం, ఆశ, అత్యవసరం, నమ్మకం వంటి భావోద్వేగాలను కూడా దోపిడీ చేస్తున్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న కొద్దీ వాటిని ఛేదించడం కూడా సంక్లిష్టమవుతోంది. నేరగాళ్లు ఒక రాష్ట్రంలో ఉండి మరొక రాష్ట్రంలోని బాధితుడిని మోసం చేయవచ్చు. డబ్బును అనేక బ్యాంకు ఖాతాల ద్వారా మళ్లించవచ్చు. నకిలీ సిమ్‌లు, మ్యూల్ ఖాతాలు, విదేశీ సర్వర్లు, నకిలీ గుర్తింపులతో దర్యాప్తును తప్పుదారి పట్టించవచ్చు. తెలంగాణలో 2024 ప్రారంభానికి 15,738 సైబర్ నేర కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ఎన్‌సీఆర్‌బీ గణాంకాలపై వచ్చిన వార్తా విశ్లేషణలు పేర్కొన్నాయి. ఆ ఏడాది పోలీసులు 16,084 కేసుల్లో తుది నివేదికలు సమర్పించగా, 3,177 కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయి. 2,171 మందిని అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ సంఖ్యలు దర్యాప్తు వ్యవస్థపై ఉన్న భారాన్ని చూపుతున్నాయి. బాధితుడి డబ్బు పోయిన తర్వాత ఫిర్యాదు నమోదు చేయడం మాత్రమే సరిపోతుందా? నేరగాడిని గుర్తించడం, నిధులను నిలిపివేయడం, బాధితుడికి సొమ్ము తిరిగి అందించడం, న్యాయస్థానంలో కేసు నిలబడేలా దర్యాప్తు చేయడం ఈమొత్తం ప్రక్రియ ఎంత వేగంగా జరుగుతోంది? కేంద్ర హోంశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం,2021నుంచి 2025 వరకు జాతీయ సైబర్ నేర ఫిర్యాదుల పోర్టల్‌లో 65.89 లక్షలకు పైగా ఆర్థిక మోసాల ఫిర్యాదులు నమోదయ్యాయి.నివేదించిన మొత్తం మోసపువిలువ రూ.55,050 కోట్లకు పైగా ఉంది. అదేవ్యవస్థ ద్వారా 2026 జూన్ 30 నాటికి రూ.11,158 కోట్లకు పైగా మోసపోయే సొమ్మును నిలువరించగలిగినట్లు కేంద్రం తెలిపింది. ఇది సాంకేతిక వ్యవస్థల ప్రయోజనాన్ని చూపుతున్నప్పటికీ, నష్టపోయిన మొత్తం, నిలిపిన మొత్తం మధ్య ఉన్న అంతరం ఆందోళన కలిగిస్తోంది. ఇక్కడ బాధితుల పరిస్థితిని కూడా గుర్తించాలి. చాలామంది సైబర్ మోసానికి గురైన తర్వాత అవమాన భావంతో ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారు. మరి కొందరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, బ్యాంకు అధికారులను సంప్రదించడం, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడం వంటి ప్రక్రియలపై అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారు. కొందరు నేరగాళ్లే డబ్బు తిరిగి ఇప్పిస్తాం' అంటూ రెండోసారి మోసం చేస్తున్నారు. బాధితుడిని నిందించడం కాదు అతడికి సహాయం చేయడం వ్యవస్థ మొదటి బాధ్యత కావాలి. ఫిర్యాదు స్వీకరణ నుంచి నిధుల నిలుపుదల, దర్యాప్తు, తిరిగిచెల్లింపు వరకు బాధితుడికి స్పష్టమైన సమాచారం అందాలి. కేంద్ర ప్రభుత్వం ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ), జాతీయ సైబర్ నేర ఫిర్యాదుల పోర్టల్, ఆర్థిక సైబర్ మోసాల నివారణ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. 1930 హెల్ప్‌లైన్ ద్వారా ఆర్థిక సైబర్ మోసాలపై తక్షణ ఫిర్యాదుచేయవచ్చు. తెలంగాణలో సైబర్ సెక్యూరిటీబ్యూరో, ప్రత్యేక దర్యాప్తు విభాగాలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు ఉన్నప్పటికీ.. కేసుల పెరుగుదల ఈ చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. సైబర్ నేరాల నియంత్రణకు కేవలం పోలీసులే బాధ్యత వహించలేరు. బ్యాంకులు, టెలికాం సంస్థలు,డిజిటల్ చెల్లింపు సంస్థలు, సోషల్ మీడియా వేదికలు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. అనుమానాస్పద ఖాతాలను వేగంగా గుర్తించడం, నకిలీ సిమ్‌ల వినియోగాన్ని నియంత్రించడం, మోసపూరిత ప్రకటనలను తొలగించడం,బాధితుల ఫిర్యాదులకు తక్షణస్పందనఇవ్వాలి. ప్రతిఇంటి రక్షణ కవచం సైబర్ నేరాలపై అవగాహనను పాఠశాల స్థాయినుంచే ప్రారంభించాలి. గ్రామాల్లో గ్రామపంచాయతీలు, పోస్టాఫీసులు, మహిళాసంఘాలు, రైతు వేదికలు, కళాశాలలద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలి.అభివృద్ధి అంటే కేవలం డిజిటల్ లావాదేవీల పెరుగుదల కాదు. ఆ లావాదేవీలు సురక్షితంగా జరగడం కూడా అభివృద్ధిలో భాగమే. సాంకేతికత మనిషిజీవితాన్ని సులభతరం చేయాలి కానీ సంపాదనను దోచుకునే మార్గంగా మారకూడదు. ●

కాలుష్య కోరల్లో ప్రజారోగ్యం


కాలుష్యం నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణయోగ్యం కాని విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజురోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. అన్నిటికంటే ముఖ్యంగా పాలకులు కాలుష్యనివారణకు రూపొందిస్తున్న నిబంధనలను, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయలేకపోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఈ కాలుష్యం కారణంగా అనేక వ్యాధులకు లోనవుతున్నారు. మరెందరో దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికే పరిమితమై కృంగికృశించి ప్రాణాలు వదులుతున్నారు. అంతకంతకు కాలుష్య మేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా దేశంలోని అధిక శాతం నగరాల్లో పరిస్థితి రోజురోజుకు దారుణంగా తయారవుతున్నది. దేశ రాజధాని ఢిల్లీలో పరిస్థితి గత వారం పది రోజులుగా పరాకాష్టకు చేరిందని చెప్పొచ్చు. ఈసమస్య ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చింది కాదు. ఏనాటి నుంచో ఉన్నా రోజురోజుకు పెరిగిపోతున్నది. ముఖ్యంగా శీతాకాలం వస్తే పరిస్థితి అదుపు తప్పుతున్నదని వాతావరణ శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళి సందర్భంగా విధించిన నిబంధనలు కొందరు పాటించకపోవడం ఇష్టానుసారంగా టాపాసులు కాల్చడంతో పరిస్థితి అదుపు తప్పుతుందనేది అందరికి తెలిసింది. కొందరు ఈ కాలుష్యాన్ని భరించలేక మూడు,నాలుగు నెలలపాటు ఇతర ప్రదేశాలకు కుటుంబంతోసహా తరలిపోతున్నారు. ఇటీవల ఇలా తరలిపోయేవారి సంఖ్య రానురాను పెరిగిపోతున్నది. ఒక్క ఢిల్లీలోనే కాదు దేశంలోని అనేక నగరాల్లో కాలుష్య పరిస్థితి ప్రమాదకర స్థాయికి చేరుకుంటుందని వార్తలు వెలువడుతున్నాయి. ఈసారి తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగరం ఢిల్లీతో పోటీపడే స్థాయిలో కాలుష్యాన్ని పెంచి పోషిస్తున్నదనేది వెలుగు చూసింది. ముంబాయి, కోల్‌కతా, దక్షిణాదిన బెంగళూరు, చెన్నైలతోపాటు హైదరాబాద్ పరిస్థితి కూడా రానురాను విషతుల్యంగా మారుతున్నది. దేశంలో ఆరు మెట్రోనగరాలు బెంగళూరు, ముంబాయి, కోల్‌కతా, హైదరాబాద్, ఢిల్లీ, చెన్నైలలో జరిపిన సర్వేలో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. పర్యావరణం, నీటి, గాలి నాణ్యత,వాతావరణంలో మార్పులు, అటవీ విస్తీర్ణం, చెత్తనిర్వహణ తదితర అంశాలపై జరిపిన ఆ సర్వేలో వాయుకాలుష్యం నగర జీవి ఊపిరితిత్తులకు తూట్లు పొడుస్తుందనే విషయం వెలుగు చూసింది. దేశంలో అనేక నగరాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉన్నట్లు వెల్లడయింది. మరికొన్ని నగరాల్లో పారిశ్రామిక కాలుష్యం కూడా వాతావరణానికి చేటు తెస్తున్నది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయుకాలుష్యంతోపాటు నిర్మాణరంగం వల్ల పీల్చే గాలి, ధూళికణాలు అధికంగా ఉన్నట్లు బయటపడింది. ఇటీవల కాలంలో గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోతుండడం ఒక క్రమపద్ధతి, ప్రణాళిక లేకుండా కాలనీలు వెలుస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకుంటున్నా మరోకపక్క ఈ వలసలతో అవి ఎక్కడికక్కడ పెరిగిపోతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. 2019లో భారత్‌లో ఎంపిక చేసిన 102 నగరాల్లో ధూళికణాల ముప్పును తగ్గించేందుకు జాతీయ వాయుశుద్ధి కార్యక్రమం ఆరంభించారు. ఆ తర్వాత క్రమేపీ ముప్ఫైనగరాలకు విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మకణాలను నలభైశాతం దాకా నియంత్రించాలంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాదాపు వేలకోట్ల రూపాయలకుపైగా వెచ్చించినా పరిస్థితుల్లో పెద్ద మార్పు రావడం లేదు. పంజాబ్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, యుపి, తదితర రాష్ట్రాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా ముఖ్యంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వాయుకాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.కాలుష్యాలకు మూలమైన దాదాపు ఐదువందలకుపైగా కార్ల మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న చర్యలు కొంతమేరకు సత్ఫలితాలను ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణానికి దాదాపు ఫుల్‌స్టాప్ పెట్టించి అడవుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల కూడా పర్యావరణానికి మేలు జరుగుతున్నది. మనదేశంలో ఆ పరిస్థితి కన్పించడం లేదు. పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూ మోతాదుకు మించిన పొగను వదులుతున్న వాహనాల సంఖ్య కోట్లల్లోనే ఉండొచ్చు.వాటిని నియంత్రించేందుకు ఎన్నో చట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. కానీ అవేమీ ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. పెట్రోలు, డీజిల్లో జరుగుతున్న కల్తీ కూడా ఈ కాలుష్యాన్ని మరింత పెంచుతున్నది. కల్తీని నిరోధించేందుకు అధికార గణం త్రికరణశుద్ధిగా కృషి చేయడం లేదని చెప్పొచ్చు. మొత్తం మీద తీవ్రస్థాయిలో వెలువడుతున్న వాయుకాలుష్యం వల్ల పర్యావరణం విషతుల్యమై ప్రజలు అనేక వ్యాధులకు లోనవుతున్నారు. భారత్‌లో ధూళికణాలు ఉండాల్సిన స్థాయి కన్నా అధికంగా ఉంది. శ్వాసకోశ సమస్యల నుంచి కేన్సర్ దాకా అనేక వ్యాధులకు కారణాలవుతున్నాయని డాక్టర్లే అభిప్రాయపడుతున్నారు. వాయుకాలుష్యం మంచి కొలెస్ట్రాల్‌ను చెడు కొలెస్ట్రాల్‌గా మారుస్తూ గుండెజబ్బులకు కూడా మూలమవుతుందనే విషయం పరిశోధనల్లో బయటపడింది. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలు ప్రకటించడమే కాదు అమలుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా పర్యావరణం పట్ల సాధారణ ప్రజల్లో సైతం అవగాహన పెంచేందుకు ప్రయత్నం జరగాలి.

దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.



హెచ్. లాంగ్‌ఫెలో

ప్రతిభ అనేది ఒక్క శాతం ప్రేరణ, తొంభైతొమ్మిది శాతం అవిరళకృషి.



టి. ఎడిసన్

ప్రజావాక్కు

ఆడబిడ్డలకు భద్రతే సమాజానికి గౌరవం

అనంతపురం జిల్లా రాప్తాడులో పదో తరగతి విద్యార్థినిపై తరగతి గదిలోనే జరిగినఅమానుష దాడి సభ్య సమాజాన్ని తీవ్రంగా కలచివేసింది.విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన పాఠశాలలోనే బాలిక ప్రాణాలకు ముప్పు ఏర్పడటం మహిళల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది. మరో విద్యార్థిని కూడా గాయపడటం ఈఘటన తీవ్రతను తెలియజేస్తోంది.మహిళల రక్షణకుచట్టాలు, భద్రతా ఏర్పాట్లు ఎంత అవసరమో, సమాజంలో నైతిక విలువలను పెంపొందించడం అంతకంటే ముఖ్యం. ప్రేమ పేరుతో వేధించడం, తిరస్కారాన్ని అవమానంగా భావించడం, మహిళల స్వేచ్ఛను హరించడం వంటి వికృత ధోరణులను మొగ్గలోనే తుంచేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

ఆర్థిక వ్యవస్థకు పునాది

పర్యాటక రంగంకేవలం వినోదసాధనం మాత్రమే కాదు, అది ఆర్థికవ్యవస్థకు ఊపిరిపోసే శక్తివంతమైన యంత్రం. భారతదేశం పర్వతాలు,అరణ్యాలు,తీరప్రాంతాలు, చారిత్రక కట్టడాలవంటి అపారమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ, మౌలికసదుపాయాల లోపం,కనెక్టివిటీ సమస్యల వల్ల పర్యాటకరంగం తన పూర్తిసామర్థ్యాన్ని అందుకోలేకపోతోంది.కేవలం హోటళ్లు నిర్మించడమే కాకుండా, మెరుగైన రవాణా, పారిశుద్ధం, భద్రత డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలను కల్పించినప్పుడే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించగలం. ముఖ్యంగా పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో స్థిరమైన టూరిజం నమూనాలను అనుసరించడం అనివార్యం. అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీస్తే అది దీర్ఘకాలిక నష్టానికి దారితీస్తుంది.

- కె.రామారావు, నల్గొండజిల్లా

పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలో సాంకేతికత జీవితం సులభతరం చేస్తున్నకొద్దీ,అదేసాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడే శక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమమేధ ఆధారితనకిలీ రూపకల్పన మోసాలుముఖ్యమైనవిగానిలుస్తున్నాయి.మనిషి ముఖం, స్వరం,మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు,ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేర గాళ్లకు సులభమైంది.

-జి.అశోక్, హైదరాబాద్

వైద్య సౌకర్యాలు కల్పించాలి

రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు ప్రత్యేకంగా నగదు రహిత ఆరోగ్య బీమాపథకం ప్రవేశపెట్టడం చాలా సంతోషకరమైన విషయం.దీనివలన దాదాపు 8లక్షల మందికి లబ్ధి జరుగుతుందని తెలుస్తున్నది. ఇదే రీతిలో సింగరేణి డిటైర్డ్ ఉద్యోగులకు కూడా ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించా లని కోరుతూనేఉన్నాం. ప్రస్తుతం 40వేల రూపాయల చెల్లింపుతో జీవితాంతం భార్యాభర్తలు ఇరువురికి కలిపి 8 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నారు. అయితే కొన్ని దీర్ఘకాల వ్యాధులకు ఉచితంగానే వైద్య సౌకర్యాలు కల్పిస్తు న్నారు. సింగరేణి దవాఖానాలలో ఉచితంగా అవుట్ పేషంట్ వైద్యసౌకర్యాలు అందిస్తున్నారు.దినదినం పెరుగుతున్న వైద్య ఖర్చులతో కొత్తగా పుట్టుక వస్తున్నరోగాలకు ఈ ఎనిమిది లక్షలు సరిపోవడం లేదు ఫలితంగా సరియైన వైద్యంకోసం అల్లాడిపోతున్నాం.

- డి. రాంచందర్ రావు, హైదరాబాదు

ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలోఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతోమంది ఎదురు చూస్తున్నారు. ఏటాలక్షల మంది దేశవ్యాప్తంగా ఇంజినీర్లు పుట్టుకు వస్తున్నారు. వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు. పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. తక్కువ జీతంలో కొత్త వారిని తీసుకుంటున్నారు. దాదాపు మధ్యవయసునకు చేరిన వీరికి మరల ఉద్యోగాలు దొరకడం బహు దుర్లభం.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

బిసిలపై దృష్టి సారించాలి

బిసి కుటుంబాలు చాలావరకు దిగువస్థాయి ఆదాయం లోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగాతగ్గినది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పథకాలుపెడుతున్న కూడాబిసిలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏమాత్రం రిజర్వేషన్ఇచ్చినా అది సమంజసమే. పోటీ పరీక్షలఎంపికలో వీరికి పరీక్ష ఫీజురాయితీ, హాజరు అయ్యేందుకు ఉచిత ట్రైన్ రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైన కోరిక. ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న కోచింగ్ కేంద్రాలలో కూడా నామమాత్రపు ఫీజు ఉంటేఎంతో మంది పోటీలో తప్పకనెగ్గుతారు.

- బి. మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

ఉద్యోగ హామీలు అమలవుతున్నాయా?

డాక్టర్ మోటె చిరంజీవి

దేశంలో నిరుద్యోగ సమస్య నేడు కోట్లాది మంది యువతను ఆందోళనకు గురిచేస్తోంది. ఉన్నత విద్యను అభ్యసించినా ఉద్యోగం దొరకని పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో యువతే దేశభవిష్యత్తు అంటూ ఉపన్యాసాలు ఇచ్చే రాజకీయపార్టీలు,అధికారంలోకి వచ్చినతర్వాత ఉపాధి కల్పనకు ఎంత ప్రాధాన్యమిస్తున్నాయన్నది కీలక ప్రశ్న. ముఖ్యంగా 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగహామీలు,సాధించిన నియామకాలు, ఉపాధి గణాంకాలను పరిశీలిస్తే అనేక అంశాలు చర్చకు వస్తాయి. 2014ఎన్నికల సందర్భంగా బిజెపి తన ఎన్నికల ప్రణాళికలో ఉద్యోగ కల్పనను ఆర్థిక అభివృద్ధిలో కీలక అంశంగా పేర్కొంది. తయారీ రంగానికి ప్రాధాన్యమిస్తూ ఉపాధి అవకాశాలు పెంచుతామని, యువతలో నైపుణ్యాలను అభివృద్ధిచేస్తామని హామీ ఇచ్చింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన అనే హామీకూడా అప్పటి ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా వినిపించింది. అయితే ఈ రెండు కోట్ల సంఖ్య 2014 బీజేపీ ఎన్నికల ప్రణాళికలో నిర్దిష్ట హామీగా లేదనే విషయాన్ని కూడా గమనించాలి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకిసంబంధించిన గణాంకాలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. 2022లో పార్లమెంటుకు కేంద్రప్రభుత్వం సమర్పించిన వివరాల ప్రకారం, 2014-15 నుంచి 2021-22 వరకు కేంద్రప్రభుత్వ ఉద్యోగాల కోసం22.05 కోట్ల దరఖాస్తులు రాగా,కేవలం 7,22,311 మందినిమాత్రమే వివిధ నియామకసంస్థలు ఉద్యోగాలకు సిఫారసు చేశాయి. అంటే కోట్లాదిమంది పోటీపడుతున్నా ప్రభుత్వఉద్యోగాల సంఖ్య పరిమితంగానే ఉందన్న విషయం. 2018-19లో 5.09 కోట్ల దరఖాస్తులు రాగా, 38,100 మందికే నియామకాలు జరిగాయి.మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాలభర్తీ కోసం 2022 అక్టోబర్‌లో రోజ్‌గార్ మేళాను ప్రారంభించి పదిలక్షల ఉద్యోగాల భర్తీలక్ష్యాన్ని ప్రకటించింది. 2026 జూలైలో కేంద్రప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించిన వివరాల ప్రకారం, 19 రోజ్‌గార్ మేళాల ద్వారా 12 లక్షలకు పైగా నియామక పత్రాలు అందించినట్లు తెలిపింది. ఇది ప్రభుత్వ నియామకాల పరంగాఒక ముందడుగే అయినప్పటికీ,దేశవ్యాప్తంగా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి మరింత విస్తృతమైన కార్యాచరణ అవసరం. అయితే ఉద్యోగాల విషయంలో మరో కోణాన్ని కూడా విస్మరించలేం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం,ఆర్‌బీఐ కెఎల్ఇఎమ్ఎస్‌డేటాబేస్‌లో దేశవ్యాప్తంగా మొత్తంఉపాధి 2014-15లో47.15 కోట్లనుంచి 2023-24 నాటికి 64.33 కోట్లకు పెరిగింది. అంటే సుమారు17.18కోట్ల పెరుగుదల నమోదైంది.ఇందులో వ్యవసాయం, స్వయంఉపాధి, ప్రైవేటు రంగం, ఇతర రంగాల ఉపాధికూడా ఉన్నాయి.కాబట్టి ఈసంఖ్యమొత్తాన్ని కొత్త ప్రభుత్వ ఉద్యోగాలుగా పరిగణించడం సరికాదు. అదే సమయంలో పిఎల్ఎఫ్ఎస్ గణాంకాల ప్రకారం నిరుద్యోగిత రేటు 2017-18లో 6 శాతం ఉండగా,2022-23లో 3.2శాతానికి తగ్గింది. ఈ గణాంకాలు ఉపాధి పరిస్థితిలో వచ్చిన మార్పును సూచిస్తున్నప్పటికీ, నాణ్యమైన, స్థిరమైన ఉద్యోగాల లభ్యతపై మరింత విశ్లేషణ అవసరం. ●

ప్రపంచ వ్యాప్తంగా ప్రమాదంలో పాత్రికేయం



సి.హెచ్ నరేంద్ర

ముందెన్నడూ లేనంతగా పాత్రికేయుల గొంతు నొక్కే ప్రయత్నం బ్రెజిల్,ఇజ్రాయెల్, సెర్బియా, అమెరికాలలో జరిగిన నాలుగు కీలకమైన ఎన్నికలలోఓటర్లు తమ గళాన్ని వినిపించడంతో, ప్రజాక్షేత్రంలో నిరంకుశ ఎజెండాల శక్తి ఎలా పనిచేస్తుందో మనం చూశాం. ఇది కొత్త విషయమేమీ కానప్పటికీ, బలహీనపడిన ప్రజాస్వామ్య సంస్థల నేపథ్యంలో, తద్వారా చట్టబద్ధమైన పాలన దెబ్బతినడంతో,పాత్రికేయుల గొంతు నొక్కడం,ప్రజాప్రయోజన సమాచారాన్ని బలహీనపరచడం వంటివి జరగడం మునుపెన్నడూ లేనంత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాస్వామ్య విలువలను పణంగాపెట్టి కేవలం తమ ఎజెండాలను బలోపేతం చేసుకోవాలనుకునే వారిలో శిక్షనుండి తప్పించుకునే ధోరణి సర్వత్రా వ్యాపించిఉంది. ఈ తిరోగమనానికి మూల కారణం పాత్రికేయులు, స్వతంత్ర మీడియాపై జరుగుతున్న బెదిరింపులు, భయపెట్టే ప్రచారమే. వారి గొంతులను అణచివేయడం అధికారం కోసం చూసేవారికి నియంత్రణను కట్టిపడేస్తుంది. అవినీతి, పన్నుల మోసాలను బట్టబయలు చేసిన పరిశోధనాత్మక పాత్రికేయుడు జాన్ కుసియాక్, 2018లో స్లోవేకియాలో తన కాబోయే భార్యతో పాటు హత్యకు గురైనప్పుడు, దేశవ్యాప్తంగా తీవ్రనిరసనలు వెల్లువెత్తాయి. 65,000 మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. ఫలితంగా స్లోవేకియా ప్రధానమంత్రిని పదవి నుంచి తొలగించారు. కుసియాక్ కేసులో న్యాయ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. కానీ 2026 ఫిబ్రవరిలో, అతని హత్య జరిగి ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా వెయ్యి మందికి పైగాప్రజలు ర్యాలీ నిర్వహించారు. పాత్రికేయులు హత్యకు గురైన చాలా ఏళ్ల తర్వాత కూడా, న్యాయం కోసం ప్రజలు ఇలాంటి డిమాండ్లు చేయడం ప్రపంచవ్యాప్తంగా ఒక ఆనవాయితీగా మారింది. ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్న నిరంకుశత్వం, అవినీతి, అసమానతలు, సంఘర్షణలను ఎదుర్కోవాలంటే, పాత్రికేయులు,ఇతర ప్రజా హక్కుల కార్యకర్తలపై జరిగే దాడులకు శిక్ష పడకపోవడాన్ని పరిష్కరించడమే మొదటి అడుగు కాగలదు. శక్తివంతమైన ప్రభుత్వ, ప్రభుత్వేతర శక్తులు, సంఘర్షణ ప్రాంతాలలో, వెలుపల కూడా, ఎటువంటి పరిణామాలూ లేకుండా పాత్రికేయులను లక్ష్యంగా చేసుకుని హత్య చేస్తున్నాయి. గత రెండు దశాబ్దాలలోతమ పని చేస్తున్న క్రమంలో 1,600 మందికి పైగా పాత్రికేయులు హత్యకు గురయ్యారని యునెస్కో నివేదించింది. ఈ హత్యలలో ఏడింటిలో ఆరు కేసులలో ఎవరినీ జవాబుదారీగా నిలబెట్టలేదు. హత్యలకు అతీతంగా, ప్రపంచవ్యాప్తంగా పాత్రికేయులు, మీడియా కార్యకర్తలు పెరుగుతున్న వేధింపులు, అరెస్టులు,చట్టవిరుద్ధమైన నిఘా,హింసను ఎదుర్కొంటున్నారు. తరచుగా వీరికి ఎటువంటి పరిష్కారం దొరకడం లేదు.ఇటీవలి ఎన్నికల సమయంలో పాత్రికేయులపై జరిగిన దాడులు, మీడియా స్వేచ్ఛను పరిరక్షించడంలో, నేరస్థులను, ప్రేరేపకులను జవాబుదారీగా నిలబెట్టడంలో ఉన్న విస్తృత వైఫల్యాన్ని ఎలా చూపిస్తున్నాయో ఆర్టికల్ 19 సంస్థ విశ్లేషిస్తుంది. ఈ దాడులకు శిక్ష పడనప్పుడు, పాత్రికేయులు నిస్సహాయులుగా మిగిలిపోతారు. సమాచారాన్ని పొందే ప్రజల హక్కు దెబ్బతింటుంది.పాత్రికేయులపై జరిగే నేరాలకు శిక్షపడనప్పుడు, ఆ ప్రమాదం కేవలం మీడియాకే పరిమితం కాకుండా యావత్ సమాజానికి విస్తరిస్తుంది.పరిశోధనలు చూపిస్తున్నట్లుగా, పత్రికలపై దాడులు, దాని ఫలితంగా పత్రికా స్వేచ్ఛ క్షీణించడం అనేవి, చట్టబద్ధమైన పాలన విచ్ఛిన్నం కావడానికి, అధికార దుర్వినియోగంనుండి పౌరులను రక్షించే కీలకమైన జవాబుదారీ వ్యవస్థలు బలహీనపడటానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఈ విచ్ఛిన్నం శక్తివంతులను మరిన్ని దుర్వినియోగాలకు పాల్పడేలా ప్రోత్సహిస్తుంది. తద్వారా అవినీతి,అసమానతలపెరుగుదల, కార్పొరేట్ దోపిడీ, పర్యావరణ విధ్వంసం, హింస వంటి ఒక పెను దుర్విషచక్రాన్ని సృష్టిస్తుంది. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన లేదా వారి పనికి ప్రతీకారంగా హత్యకు గురైన పాత్రికేయులకు న్యాయం అందించడం అనేది పాత్రికేయుల పరిరక్షణ కమిటీ (సిపిజే)కి ఎప్పటినుంచో ఒక ప్రాధాన్యతాంశం. 1992లో సిపిజే రికార్డు చేయడం ప్రారంభించినప్పటి నుండి 1,050 మందికి పైగా పాత్రికేయులు హత్యకు గురయ్యారు. శిక్ష నుండి తప్పించుకునే తీరు ఒకే విధంగా ఉంది. స్థానిక అధికారులు దర్యాప్తు చేయడానికి, సాక్ష్యాలను సేకరించడానికి తీసుకునే ప్రాథమిక చర్యలను విస్మరిస్తుంటారు. స్థానిక అధికారుల వల్ల కేసులు పూర్తిగా విఫలం కావడం, లేదా కొంత పురోగతి సాధించినప్పటికీ సూత్రధారులు జవాబుదారీతనం నుండి తప్పించుకోవడం వంటి ఉదాహరణలు కోకొల్లలు. తరచుగా, ఇటువంటి కేసులు నేరాన్ని ప్లాన్ చేసిన లేదా నిధులు సమకూర్చిన వారిని కాకుండా, కేవలం నేరాన్ని అమలు చేసిన వారిని పట్టుకోవడానికే పరిమితమవుతున్నాయి. హంతకుల నుండి సూత్రధారుల వరకు, దోషులందరిపై విజయవంతంగా విచారణ జరిపి పూర్తి న్యాయం అందించడం కేవలం 50 కేసులలో మాత్రమే సాధ్యమైంది.డొనాల్డ్ ట్రంప్ రెండవ అధ్యక్ష పదవీకాలంలో, ఆయన ప్రభుత్వం ప్రజాస్వామ్య సంస్థలను, చట్టబద్ధమైన పాలనను కాపాడే అధికారాల సమతుల్యతను ధ్వంసం చేసింది. 'ట్రంప్ పాత్రికేయులపై మాటలతో దాడి చేస్తారు. ముఖ్యంగా నల్లజాతి మహిళలను తీవ్రంగా కించపరుస్తారు. ప్రభుత్వ మీడియాకు నిధులను భారీగా తగ్గించడానికి ప్రయత్నించారు. తాను విభేదించే మీడియాకు పత్రికా ప్రాప్యతను పరిమితం చేస్తారు.సెర్బియాలో మాదిరిగానే, మాటల దాడులతో పాటు తరచుగా శారీరక దాడులు కూడా జరుగుతాయి. వాటిని సాధారణీకరించడానికి ఉపయోగిస్తారు. గత మూడేళ్లలో కలిపి జరిగిన దాడుల సంఖ్యకు దాదాపు సమానంగా 2025లో అమెరికా పత్రికా విలేకరులు దాడులకు గురయ్యారు. ఆయన ప్రభుత్వం పాత్రికేయుల రిపోర్టింగ్ పై విచారణ జరిపేందుకు ఫెడరల్ చట్ట అమలు సంస్థలను ఒకఆయుధంగా వాడుకుంటోంది'అంటూ సిపిజే ఆరోపించింది. ఫెడరల్ ఏజెన్సీలపై పర్యవేక్షణను తక్షణమే బలోపేతం చేయడం ద్వారా, కొత్తగా ఎన్నికైన అమెరికా కాంగ్రెస్ స్వదేశంలో, విదేశాలలో పత్రికా స్వేచ్ఛ పరిరక్షణను పునరుద్ధరించాలని సిపిజె పేర్కొంది. 'అమెరికాలో పత్రికా స్వేచ్ఛ వేగంగా క్షీణించడాన్ని తిప్పికొట్టడానికి, జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన అధికారులను జవాబుదారీగా చేయడానికి, కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్‌కు ఒక చారిత్రాత్మక అవకాశం ఉంది,'అని సిపిజె సిఇఒ జోడీ గిన్స్‌బర్గ్ పేర్కొన్నారు. 'చట్టసభ సభ్యులు అమెరికన్ ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన మొదటి సవరణను పరిరక్షించాలి. యు.ఎస్. విదేశాంగ విధానంలో పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు ప్రాధాన్యత ఉండేలా చూడాలి' అని కోరారు. అందువల్ల, అవినీతి, అసమానత, దోపిడీ, హింస, ఇతర అధికార దుర్వినియోగాలను ఎదుర్కోవడానికి కట్టుబడి ఉన్న విధానకర్తలు, ప్రభుత్వ సంస్థలు, చట్టబద్ధమైన పాలనపై విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి పునాదిగా, పాత్రికేయులు, ఇతర ప్రజా పర్యవేక్షకులపై జరిగే నేరాలకు శిక్ష నుండి మినహాయింపును ఎదుర్కోవడాన్ని ప్రాధాన్యతగా పరిగణించాలి. సమాజంలో అధికారంపై అనివార్యమైన నియంత్రణగా పని చేసే వారిపై జరిగే నేరాలకు శిక్ష నుండి మినహాయింపును పరిష్కరించడానికి ప్రభుత్వాలు, వ్యక్తిగతంగా, సమిష్టిగా చర్యలు తీసుకోకపోతే, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, పునరుద్ధరించడానికి చేసే ప్రయత్నాలు విఫలమవుతాయి. తమ గొంతులను అణచివేయడం అధికారం కోసం చూసేవారికి పట్టును ఇస్తుంది. ●



పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి

డిఎస్పీ, ఎస్ఐసహా 10 మంది పోలీసుల మృతి

ఇస్లామాబాద్, నవంబరు 12: పాకిస్థాన్‌లోని ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, సబ్‌ఇన్‌స్పెక్టర్ సహా కనీసం 10 మంది పోలీసు సిబ్బంది మృతి చెందారు. బుధవారం జరిగిన ఈ ఘటనలో అక్రమ బంగారం తవ్వకాలపై చర్యలు తీసుకునేందుకు వెళ్తున్న పోలీసు బృందంపై ఉగ్రవాదులు మాటువేసి దాడిచేశారు. కోహాట్, కరక్ జిల్లాల మధ్య ఉన్న దర్బోకచ్ జలంధర్ బండా ప్రాంతంలో ఈ దాడి జరిగింది. పోలీసు ప్రతినిధి మహమ్మద్ నౌమాన్ జెబ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీసు బృందం కోహాట్ జిల్లాలోని గుంబాట్ ప్రాంతానికి వెళ్తుండగా దుండగులు అకస్మాత్తుగా కాల్పులు ప్రారంభించారు. దాడి చేసిన వారు కొండ ప్రాంతాల్లోని ఎత్తయిన ప్రదేశాల నుంచి పోలీసులపై కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో పలువురు పోలీసులు ప్రాణాలు కోల్పోగా.. పోలీసు వాహనాలు ధ్వంసమయ్యాయని తెలిపారు. మృతుల్లో డిఎస్పీ గంబాట్ హైదర్ జమాన్, ఎస్ఐ ముఖ్తియార్‌తోపాటు ఇతర పోలీసు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. దాడి సమయంలో ఉగ్రవాదులు ఐదు పోలీసు మొబైల్ వాహనాలకు నిప్పు పెట్టారు. తర్వాత పోలీసు బృందంపై కాల్పులు కొనసాగించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర కాల్పులు జరిగినట్లు పోలీసు ప్రతినిధి తెలిపారు. దాడి సమాచారం అందిన వెంటనే అదనపు పోలీసు వాహనాలు, భారీ సంఖ్యలో భద్రతా బలగాలను ఘటనా స్థలానికి తరలించారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు, వారిపై చర్యలు తీసుకునేందుకు భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేశారు. ఖైబర్ పఖ్తుంఖ్వా గవర్నర్ ఫైసల్ కరీం కుండీ ఈ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ దాడి నేరస్థులు, ఉగ్రవాదుల మధ్య ఉన్న సంబంధాన్ని ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు. మృతి చెందిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అధికారుల సేవలను ఆయన కొనియాడారు.

ఇదిలా ఉండగా, పాకిస్థాన్‌లో జరిగిన ఈ దాడి జరిగిన రోజే జమ్మూ కాశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా సిబ్బందిపై మరో దాడి జరిగింది. మిర్‌బజార్ సమీపంలోని అఖ్రాన్ ప్రాంతంలో ఉన్న సిఆర్‌పిఎఫ్ చెక్‌పాయింట్‌పై మోటార్‌సైకిళ్లపై వచ్చిన దుండగులు కాల్పులు జరిపారు. బుధవారం మధ్యాహ్నం 2-15 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో ముగ్గురు సిఆర్‌పిఎఫ్ సిబ్బంద గాయపడ్డారు. గాయపడిన వారిని అనంత్‌నాగ్‌లోని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దాడి తర్వాత భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, దుండగులను పట్టుకునేందుకు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి.

యుపి రాజకీయాల్లో సంచలనం

కూటమిని ప్రకటించిన ఒవైసీ, చంద్రశేఖర్ ఆజాద్

లక్నో, నవంబర్ 12: ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త సమీకరణాలు తెరపైకి వచ్చాయి. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎఐఎంఐఎం, చంద్రశేఖర్ ఆజాద్ నేతృత్వంలోని ఆజాద్ సమాజ్ పార్టీ కలిసి కొత్త పొత్తును ప్రకటించాయి. ఈ కూటమికి 'సామాజిక పరివర్తన మోర్చా' అని పేరు పెట్టారు. ఇది కేవలం మూడో కూటమి కాదని, సమాజంలో మార్పు తెచ్చే బలమైన వేదిక అని చంద్రశేఖర్‌ఆజాద్ స్పష్టం చేశారు. ఈ కూటమి తరపున ముఖ్యమంత్రి అభ్యర్థి చంద్రశేఖర్ ఆజాద్ అని ఒవైసీ ప్రకటించడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముస్లిం ఓట్లను దండుకుంటున్న ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో బిజెపిని ఓడించడం సాధ్యం కాదని ఒవైసీ విమర్శించారు. చంద్రశేఖర్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటించడం ఎస్పీ నాయకులకు కాళ్ల కింద భూమి దద్దరిల్లుతోందని ఎద్దేవా చేశారు. తనకు భద్రత తీసేసినా తన గళాన్ని ఆపలేరన్నారు. యుపిలోని మొత్తం 403 అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీలు సత్తా చాటుతాయని చంద్రశేఖర్ తేల్చిచెప్పారు. బిజెపిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ఒవైసీ ఆ పార్టీని కేవలం పండుగల పార్టీగా అభివర్ణించారు. కిష్టవార్ ఉగ్రదాడిలో ఇద్దరు జవాన్లు చనిపోతే బిజెపి ఏం సమాధానం చెబుతుందని నిలదీశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూనే కోలుకున్నాక రాజకీయంగా తనతో పోటీకి రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో బిజెపిని మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఇద్దరు నేతలు స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో దళితులు, వెనుకబడిన తరగతులు, ముస్లింలపై జరుగుతున్న అణచివేతపై చంద్రశేఖర్ ఆజాద్ మండిపడ్డారు. బహుజన సమాజం ఇప్పుడు ఎవరికో చేయి చాచేలా కాకుండా, సమాజానికి ఇచ్చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తుడిచిపెట్టాలని చూస్తున్నాయని, తాము దాన్ని ఎట్టి పరిస్థితుల్లోను జరగనివ్వమని హెచ్చరించారు.

శాంతియుత నిరసనల అణచివేతకు క్రిమినల్ కేసులు

- ప్రజాస్వామ్యానికి చీకటి రోజే
- బాంబే హైకోర్టు

ముంబై, నవంబరు 12: శాంతియుత నిరసనల్లో పాల్గొనే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఉద్యమాలను అణచివేయాలని చూస్తే అది ప్రజాస్వామ్యానికి చీకటి రోజేనని బాంబే హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. నిరసన తెలిపే రాజ్యాంగ హక్కుకు, క్రిమినల్ కేసుల పేరుతో వేధింపులకు మధ్య ఉన్న గీత చెరిగిపోకూడదని స్పష్టం చేసింది. రోడ్ల దుస్థితిని నిరసిస్తూ చేపట్టిన ఆందోళనలో పాల్గొన్న వ్యక్తిపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు కొట్టివేసింది. రోడ్ల దుస్థితిపై నిరసిస్తూ ఆందోళనలో పాల్గొన్న ఓ వ్యక్తిపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదుచేశారు. దీనిని సవాల్ చేస్తూ బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం. డబ్ల్యూ. చాంద్వానీ కీలక వ్యాఖ్యలు చేశారు. వెలువరించిన ఉత్తర్వుల్లో న్యాయమూర్తి స్పందిస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే పౌరులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తే ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా మారుతుందన్నారు.

పుతిన్‌తో ట్రంప్ దూతల భేటీ

ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక మలుపు
ఖైదీల మార్పిడిపై కుదిరిన ఒప్పందం
యుద్ధ విరమణపై ప్రతిష్టంభన



మాస్కో, నవంబరు 12: రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా తన దౌత్య ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక దూతలు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ గురువారం రష్యా రాజధాని మాస్కోలోని క్రెమ్లిన్‌కు చేరుకున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో వీరు కీలక చర్చలు జరపనున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) రాజధాని అబుదాబిలో అమెరికా మధ్యవర్తిత్వంతో రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య 2 రోజులపాటు సాగిన చర్చల అనంతరం ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ యేడాది శాంతి ప్రయత్నాలు నిలిచిపోయిన నేపథ్యంలో, 9 నెలల విరామం తర్వాత రష్యా, ఉక్రెయిన్ అధికారులు అబుదాబిలో తొలిసారి ముఖాముఖి చర్చలుజరిపారు. బుధవారం ముగిసిన ఈ చర్చల్లో భారీ ఎత్తున యుద్ధ ఖైదీల మార్పిడికి ఇరుపక్షాలు అంగీకరించాయి. ఎంతమందిని మార్చుకోవాలనే సంఖ్యపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 2014లో తూర్పు ఉక్రెయిన్‌లో మొదలైన ఘర్షణలు, 2022 ఫిబ్రవరి 24న పూర్తిస్థాయి యుద్ధంగా మారి దాదాపు ఐదేళ్లు కావస్తున్నాయి. సుదీర్ఘ యుద్ధాన్ని ఆపడంలో అబుదాబి చర్చలు తక్షణ పురోగతిని సాధించలేకపోయాయి. అయినప్పటికీ, దౌత్య ప్రక్రియలో వేగం తగ్గకూడదనే ఉద్దేశంతో కుష్నర్, విట్కాఫ్ నేరుగా క్రెమ్లిన్‌కు పయనమయ్యారు.

చర్చల్లో ఐరోపా భాగస్వామ్యంపై అమెరికా పట్టు

ఐరోపా ఖండం విస్తృత భద్రతా ఏర్పాట్లపై జరుగుతున్న ఈ చర్చల్లో ఐరోపా దేశాల ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని అమెరికా భావిస్తోంది. ఇందుకు పుతిన్ ఆమోదం పొందడమే తమ పర్యటన ప్రధాన లక్ష్యాలలో ఒకటని కుష్నర్ స్పష్టం చేశారు. మాస్కోతో చర్చలు జరిపేందుకు ఐరోపా దేశాలన్నీ కలిసి ఒకే ప్రతినిధిని నియమించాలని అమెరికాతో పాటు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరుకుంటున్నారు. అయితే, నేరుగా జరిగే చర్చల్లో ఐరోపా దేశాలను చేర్చుకోవడానికి రష్యా ససేమిరా అంటోంది. ఐరోపా ఖండంలో రష్యా వ్యవహారశైలి, ఉద్దేశాలపై ఆయా దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉక్రెయిన్‌కు ఐరోపా దేశాలు ఆర్థిక సాయం చేయడంతో పాటు ఆయుధాలను సరఫరా చేస్తున్నాయని, శాంతి ఒప్పందం కుదరకుండా అడ్డుపడుతున్న సమస్యల్లో అవి కూడా భాగమేనని మాస్కో ఆరోపిస్తోంది. మరోవైపు, ఐరోపా భద్రతపై జరిగే చర్చల్లో రష్యాను చేర్చుకోవడం పుతిన్‌కు అనవసరపు రాయితీలు ఇవ్వడమేనని పలు ఐరోపా దేశాలు భావిస్తున్నాయి. పుతిన్‌తో సమావేశం ముగిసిన తర్వాత, తాను, విట్కాఫ్ కలిసి గురువారం సాయంత్రమే ఐర్లాండ్ రాజధాని డబ్లిన్‌కు వెళ్లనున్నట్లు కుష్నర్ తెలిపారు. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టేతో పాటు 40కి పైగా ఐరోపా దేశాల ప్రతినిధులు పాల్గొంటున్న సదస్సుకు హాజరవుతున్న జెలెన్‌స్కీతో అక్కడ వారు భేటీ అవుతారు.

చలికాలం సమీపిస్తున్నా ఆగని దాడులు

మరోవైపు, 1,200 కిలోమీటర్ల (సుమారు 750 మైళ్లు) పొడవైన యుద్ధక్షేత్రం వెంబడి పోరాటం తీవ్రంగా కొనసాగుతోంది. శాంతి స్థాపనకు ఇంకా సుదీర్ఘ సమయం పడుతుందని మధ్యవర్తులు హెచ్చరిస్తున్నారు. యుద్ధభూమిలో ఉక్రెయిన్ సేనల గట్టి ప్రతిఘటనతో రష్యా భారీ సైన్యం ముందుకు కదలలేకపోతోంది. దీంతో సామాన్య ప్రజలకు వేడి, విద్యుత్, తాగునీటి సరఫరాను నిలిపివేసి వారి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా రష్యా వ్యూహాత్మక బాంబు దాడులకు పాల్పడుతోంది. దీనిని 'చలికాలాన్ని ఆయుధంగా వాడుకోవడం' అని కీవ్ అభివర్ణిస్తోంది. ఇరుదేశాలు సుదూర శ్రేణి క్షిపణులు, డ్రోన్లతో పరస్పరం విరుచుకుపడుతున్నాయి. రాత్రిపూట 71 ఉక్రెయిన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.


సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో కారు బాంబు పేలుడు.. రష్యా కల్నల్ మృతి: రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో గురువారం జరిగిన కారు బాంబు పేలుడులో ఒక సైనికాధికారి మృతి చెందారు. ఈ ఘటనను రష్యా ప్రధాన నేర పరిశోధన సంస్థ 'ఇన్వెస్టిగేటివ్ కమిటీ' ధ్రువీకరించింది. అయితే మృతుడి పేరును కానీ, ఈ దాడి వెనుక ఎవరున్నారనే వివరాలను కానీ వెల్లడించలేదు.

రాజకీయ మార్పులే శాంతికి సువర్ణావకాశం : జెలెన్‌స్కీ

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల తర్వాత జనవరిలో డెమోక్రాట్లు యూఎస్ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టడం, వచ్చే యేడాది ఫ్రాన్స్‌లో జరగనున్న ఎన్నికలు వంటి రాజకీయ పరిణామాలు శాంతి ఒప్పందానికి ఒక 'సువర్ణావకాశాన్ని' కల్పిస్తాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అభిప్రాయపడ్డారు."2027లో ఐరోపా రాజకీయ ముఖచిత్రం మారవచ్చు... అమెరికాలోనూ ఇప్పటికే మార్పులు చోటుచేసుకోవడం మనం చూస్తున్నాం. 2027 కంటే ముందే ఒక ఫలితాన్ని సాధించాలని చర్చల ప్రక్రియలో ఉన్న వారంతా నిజంగా కోరుకుంటున్నారు. కాబట్టి నేడు నిజంగానే ఒక అనుకూల సమయం, సువర్ణావకాశం అందుబాటులో ఉంది" అని బుధవారం రాత్రి డబ్లిన్‌లో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఖైదీల మార్పిడి ప్రతిపాదన సానుకూల అడుగు అని ప్రశంసించిన ఆయన, శాంతి కోసం రష్యా ఆక్రమించిన తమ భూభాగాలను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

సంజయ్ మరణం.. రాజీవ్ ప్రధాని కావడం

సోనియాకు ముందే చెప్పింది ఎవరు?
ఆత్మకథలో ఓ ఆసక్తికర సంఘటన పంచుకున్న సోనియా



న్యూఢిల్లీ, నవంబరు 12: "సంజయ్ కాదు.. మీ భర్త రాజీవ్‌గాంధీ ఒకరోజు ప్రధానమంత్రి అవుతార్లు.. దశాబ్దాల క్రితం ఓ హస్త సాముద్రికుడు చెప్పిన మాటలివి. అప్పట్లో సరదాగా అనిపించిన ఈ సంఘటన.. ఆ తర్వాత చోటు చేసుకున్న వరుస విషాదాల నేపథ్యంలో తనను ఆలోచనలో పడేసిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ వెల్లడించారు. తన జ్ఞాపకాలతో రాసిన "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్హ్ పుస్తకంలో ఈ విషయాలను ఆమె గుర్తుచేసుకున్నారు. నవంబరు 10న ఈ పుస్తకం విడుదలైంది. 1970వ దశకం చివర్లో ఇందిరాగాంధీ కుటుంబం ఢిల్లీలోని విల్లింగ్‌డన్ క్రెసెంట్‌లో ఉన్న 12వ నంబర్ బంగ్లాలో నివసించేది. 1977లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత కుటుంబ స్నేహితుడు మహమ్మద్ యూనస్ ఖాళీ చేయించిన నాలుగు గదుల ఇంటికి ఇందిరాగాంధీ మారారు. ఆ సమయంలో రాజీవ్‌గాంధీ వాణిజ్య విమాన పైలట్‌గా పనిచేస్తుండగా, రాజకీయాలపై ఆసక్తి చూపేవారు కాదు. సంజయ్‌గాంధీ మాత్రం తల్లి రాజకీయ వారసుడిగా గుర్తింపు పొందారు.

ఆ ఇంట్లో జరిగిన ఓ విచిత్ర సంఘటనను సోనియా తన పుస్తకంలో వివరించారు. తెల్లటి దుస్తులు ధరించిన ఓ లావుపాటి వ్యక్తి అనుమతి లేకుండా తమ ఇంటి భాగంలోకి వచ్చి, తన అరచేతి ముద్ర ఉన్న కాగితం చూపిస్తూ భవిష్యత్తు చెబుతానని పట్టుబట్టాడని పేర్కొన్నారు. జ్యోతిష్యాన్ని నమ్మనని, తనకు భవిష్యత్తు తెలుసుకోవాల్సిన అవసరం లేదని చెప్పి వెళ్లిపోవాలని కోరినా అతడు వినలేదన్నారు. దీంతో కోపంతో అతడిని బయటకు పంపేందుకు ప్రయత్నించగా వెనక్కి తిరిగి వెళ్తూ "సంజయ్ కాదు.. మీ భర్త రాజీవ్‌గాంధీ ఒకరోజు ప్రధాని అవుతార్లు అని గట్టిగా చెప్పాడని సోనియా గుర్తుచేసుకున్నారు. అప్పటికే ఆ వ్యక్తి రాజీవ్ చేతిని చూసి భవిష్యత్తు చెప్పాడని, రాజీవ్ మాత్రం దాన్ని సరదాగా తీసుకున్నారని తెలిపారు. 1980 జూన్‌లో విమాన ప్రమాదంలో సంజయ్‌గాంధీ మరణించారు. 1984 అక్టోబరులో ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే రాజీవ్‌గాంధీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజకీయాల్లోకి రావద్దని సోనియా కన్నీళ్లతో వేడుకున్నప్పటికీ, బాధ్యతను స్వీకరించారని పుస్తకంలో పేర్కొన్నారు. వాళ్లు ఎలాగూ నన్ను చంపేస్తార్లు అని రాజీవ్ తనతో అన్నట్లు ఆమె రాశారు. రాజీవ్ 41వ పుట్టినరోజు సందర్భంగా 1985 ఆగస్టులో జరిగిన విందు సమయంలోనూ ఓ విషాద వార్త వచ్చిందని సోనియా గుర్తుచేసుకున్నారు. పంజాబ్‌లో అకాలీ నేత హర్చంద్ సింగ్ లాంగోవాల్ హత్యకు గురయ్యారన్న సమాచారం అందిందన్నారు. ఆ ఘటనను విషాదంతోపాటు అపశకునంగా భావించానని, రాజీవ్ పుట్టినరోజునే ఎందుకు ఇలా జరిగిందని ఆలోచించానని రాశారు. 1990 ఫిబ్రవరి 5న రాజీవ్, సోనియా దంపతులు 10 జనపథ్ నివాసానికి మారారు. ఆ ఇల్లు అచ్చిరాదని రాజీవ్ సహచరులు కొందరు హెచ్చరించినా, తామిద్దరం మూఢనమ్మకాలను విశ్వసించక ఆ మాటలను పట్టించుకోలేదని సోనియా తెలిపారు. ఆ ఇంటి వెనుక ఏనుగు సమాధిగా భావించే ఓ మట్టిదిబ్బ, ఎదురుగా ఓ సూఫీ పీర్ సమాధి ఉన్నాయని పుస్తకంలో ప్రస్తావించారు. ఆ ఇంటికి మారిన 15 నెలలకే.. 1991 మేలో రాజీవ్‌గాంధీ హత్యకు గురయ్యారు.

మదురైలో భారీగా బంగారం చోరీ

రూ.50 కోట్ల నగలను దోపిడీ చేసిన దుండగులు : 15 రోజుల క్రితమే ప్రారంభమైన తనిష్క్ షోరూమ్



చెన్నై, నవంబరు 12: తమిళనాడులోని మదురైలో భారీచోరీ కలకలం రేపింది. పళంగనాథం ప్రాంతంలోని ప్రముఖ జువెలరీ బ్రాండ్ తనిష్క్ షోరూంలో దుండగులు అత్యంత చాకచక్యంగా ప్రవేశించి సుమారు రూ.50 కోట్ల విలువైన బంగారం, వజ్రాభరణాలను దోచుకెళ్లారు. 15 నుంచి 20 కిలోల వరకు బంగారం చోరీకి గురైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ షోరూమ్ భవన నిర్మాణ పనులు సుమారు 70 శాతం మాత్రమే పూర్తయ్యాయి. 15 రోజుల క్రితమే ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. షోరూమ్ వెనుకవైపు తలుపులు, షట్టర్ తాళాలను పగలగొట్టడంతో పాటు షాపు గోడకు కన్నం వేసి దొంగతనానికి పాల్పడినట్లు నిర్వాహకులు గుర్తించారు. 11న ఉదయం సిబ్బంది షోరూమ్‌కు వచ్చినప్పుడు తలుపులు పగులగొట్టి ఉండటాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా, ఆభరణాలు మాయమైనట్లు తేలింది. వెంటనే షోరూమ్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు షోరూంలోని సిసిటివి ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో ఒక అనుమానితుడు భవనం పై అంతస్తులోని లిఫ్ట్ ద్వారా లోపలికి ప్రవేశించినట్లు రికార్డయింది. కొత్తగా ప్రారంభమైన షోరూంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీన్ని ఆసరా చేసుకుని దొంగలు ఈ చోరీకి పథకంవేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. చోరీకి గురైన బంగారం, వజ్రాల పరిమాణం, విలువపై స్పష్టత రావాల్సి ఉంది. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

బంగ్లాదేశ్‌లో మళ్లీ అరాచకం

హసీనా పార్టీనే కారణమని ప్రభుత్వ ఆరోపణలు

ఢాకా, నవంబరు 12: బంగ్లాదేశ్‌లో మరోసారి హింసాత్మక పరిస్థితులు ఏర్పడ్డాయి. వీధుల్లో నాటుబాంబుల పేలుళ్లు, బస్సులకు నిప్పటించడం, రహదారుల దిగ్బంధం, పోలీసులు నిరసనకారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. రాజధాని ఢాకాతో పాటు గోపాలగంజ్, షరియత్‌పూర్ సహా పలు జిల్లాల్లో కొన్ని వారాలుగా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. డిసెంబరు నెలలో సొంత దేశానికి వెళ్తానని షేక్ హసీనా ప్రకటించింది. దీనికి ముందే బంగ్లాదేశ్‌లో మరోసారి అరాచక పరిస్థితులు ఏర్పడ్డాయి. గురువారం తెల్లవారుజామున కుష్టియా నియోజకవర్గానికి చెందిన మహిళా రిజర్వ్ స్థానంలో ఎన్‌సిపి ఎంపీగా ఉన్న నుస్రత్ తబస్సుమ్ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి, నిప్పంటించారు. ఈ దాడికి అవామీ లీగ్ కార్యకర్తలు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనికి ముందు నవంబరు 11న ఢాకాలో రెండు బస్సులు, ఒక ట్రక్కుకు నిప్పంటించారు. నవంబరు 9, 10 తేదీల్లో దేశవ్యాప్తంగా కనీసం 22 అగ్నిప్రమాదాలు, నాటు బాంబు పేలుళ్ల ఘటనలు నమోదయ్యాయి. ఈ అల్లర్ల నేపథ్యంలో భద్రతా బలగాలు వందలాది మందిని అరెస్ట్ చేశాయి. అవామీ లీగ్ విద్యార్థి విభాగం బంగ్లాదేశ్ ఛాత్ర లీగ్ నవంబరు 10న దేశవ్యాప్త దిగ్బంధానికి పిలుపునిచ్చింది.

అధికార పక్షంపై విమర్శలు: ఓవైపు అధికార బీఎన్పీ ఈ అల్లర్లు హసీనా పార్టీ అవామీ లీగ్ కారణమని చెబుతుంటే, అల్లర్లకు అధికార బీఎన్పీ కారణమని జమాతే ఇస్లామీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. షేక్ హసీనా రాకను అడ్డుపెట్టుకుని బిఎన్పీనే హింసకు పాల్పడుతోందని విమర్శిస్తోంది. ఈ ఆందోళనలు, నిరసనలకు కూడా అవామీలీగ్ అనుబంధ కార్మిక సంఘాలు, పార్టీతో సంబంధం ఉన్న ఫ్యాక్టరీ యజమానులే కారణమని ఆ దేశ హోం మంత్రి సలాహుద్దీన్ అహ్మద్ ఆరోపించారు

సంక్షిప్త వార్తలు

సోనియా గాంధీ పుస్తకంపై వివాదం..ప్రతుల దగ్ధం

న్యూఢిల్లీ, నవంబరు 12: కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ రచించిన ఆత్మకథ "బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్హ్ పుస్తకం జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పుస్తకంలో ఆమె ప్రస్తావించిన పలు అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోనియా ప్రయత్నాన్ని ఆమె పేర్కొన్న విషయాలను గ్లోరిపై చేస్తుండగా బిజెపి మాత్రం అది 'వైట్ వాషింగ్' పుస్తకం అంటూ ఫైర్ అవుతోంది. ఈ క్రమంలో 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లపై ఈ పుస్తకంలో సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలపై సిక్కు సంఘాలు భగ్గుమంటున్నారు.

కేరళలో షెగెల్లా ఇన్ఫెక్షన్లు వ్యాప్తి.. 75 కేసులు నమోదు




తిరువనంతపురం, నవంబరు 12: కేరళలో షిగెల్లా ఇన్‌ఫెక్షన్లు వ్యాపిస్తున్నాయి. మలప్పురం జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఈ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయ్యింది. అరీకోడ్, పుల్పట్ట, ఎడవన్న ప్రాంతాల్లో తాజాగా షిగెల్లా ఇన్‌ఫెక్షన్లు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలో ఇప్పటి వరకు 75 షిగెల్లా కేసులు నమోదయ్యాయని కేరళ ఆరోగ్య శాఖ తెలిపింది. వీటిలో ఎనిమిది కేసులు వ్యాధి సోకిన వ్యక్తుల ద్వారా వ్యాపించినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధి నివారణ చర్యలను ముమ్మరం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేజ్రీవాల్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ బెదరింపులు

న్యూఢిల్లీ, నవంబరు 12: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు, ఆయన కుమార్తె హర్షిత కేజ్రీవాల్‌కు హత్య బెదిరింపులు రావడం దేశ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ప్రముఖ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడినని చెప్పుకున్న ఓ అగంతకుడు రూ.7 కోట్లు డిమాండ్ చేస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళితే.. ఢిల్లీలోని తిలక్ నగర్ ఆప్ ఎమ్మెల్యే జర్నైల్ సింగ్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, వాట్సాప్ మెసేజ్‌లు వచ్చాయి. తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడినని పరిచయం చేసుకున్న నిందితుడు, అడిగినట్లుగా రూ.7 కోట్లు చెల్లించకపోతే అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆయన కుమార్తె హర్షితను హత్య చేస్తామని హెచ్చరించాడు.

బిజెపిలోకి క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్



న్యూఢిల్లీ, నవంబరు 12: టీమిండియా మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బిజెపిలో చేరుతున్నారా?అనే ప్రశ్న ఊపందుకుంది. రాబోయే యుపి ఎన్నికల్లో సూర్యకుమార్ యాదవ్ బరిలోకి దిగుతారా? లేదా భార్య దేవిశా శెట్టి పోటీ చేస్తారా? అనే అంశంపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సూర్యకుమార్ యాదవ్ కుటుంబం వరుసగా భేటీ కావడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్నిచ్చింది. భారత టి 20 జట్టు మాజీ కెప్టెన్, 2026 టి 20 వరల్డ్ కప్ విజేత సూర్యకుమార్ యాదవ్ ఇటీవల న్యూఢిల్లీలో తన భార్య దేవిశా శెట్టి, కుటుంబసభ్యులతో కలిసి ప్రధాని మోడీని కలిశారు. ఆ వెంటనే అమిత్ షా తోనూ భేటీ అయ్యారు.

కాశ్మీర్‌లో ఇద్దరు పోలీసు అధికారుల హత్య

శ్రీనగర్, నవంబరు 12: జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలు మరోసారి కలకలం రేపాయి. కిష్ట్వార్ జిల్లాలో ఇద్దరు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం (నవంబరు 11) నుంచి అదృశ్యమైన ఇద్దరు పోలీసు సిబ్బంది మృతదేహాలు గురువారం ఉదయం దచన్ అటవీ ప్రాంతంలో లభ్యమయ్యాయి. మృతులను బాబీ చంద్ (57), రష్‌పాల్ కుమార్ (45)గా అధికారులు గుర్తించారు. వారి మృతదేహాలపై బుల్లెట్ గాయాలు ఉండటంతో కాల్పులు జరిపి హత్య చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

సింగరేణి అభయ హస్తానికి 31 మంది ఎంపిక

సివిల్స్ అభ్యర్థులకు రూ. లక్ష ప్రోత్సాహం

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: తెలంగాణ ప్రాంతం నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థ సహకారంతో ప్రారంభించిన సివిల్స్ అభయహస్తం పథకం మరోసారి మంచి ఫలితాలను సాధించింది. ఇటీవల విడుదలైన సివిల్స్ మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై 31 మంది అభ్యర్థులు తుది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. మెయిన్స్ కు ఎంపికైన 158 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున మొత్తం రూ.1.58 కోట్ల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించింది. ఈ మేరకు గురువారం సింగరేణి ఒక ప్రకటనలో ఈ ఆర్థిక సహకారంతో అభ్యర్థులు మెయిన్స్ పరీక్షలకు హాజరు కాగా, వారిలో 31 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక కావడం విశేషం. ఇంటర్వ్యూకు ఎంపికైన వారికి మరో రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకంతుది ఇంటర్వ్యూకు ఎంపికైన 31 మంది అభ్యర్థులకు కూడా సింగరేణి సంస్థ త్వరలో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించనుంది. అభయహస్తం పథకానికి సింగరేణి సంస్థ గత రెండేళ్లుగా తన కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల నుంచి ఆర్థిక సహకారం అందిస్తోంది. ఈ పథకం ద్వారా మొదటి ఏడాది ఏడుగురు, రెండో ఏడాది 20 మంది చొప్పున మొత్తం 27 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించడం విశేషం. ఈ ఏడాది కూడా అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు తుది ఇంటర్వ్యూలో విజయం సాధించి సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావాలని, ఈ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించబోతున్నారని, ఈ మాక్ ఇంటర్వ్యూల నిర్వహణకు కూడా తమ సంస్థ సహకారాన్ని అందిస్తుందని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి తెలిపారు.

ఆరె కుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు

విహెచ్‌కు కృతజ్ఞతలు తెలిపిన సంఘం నేతలు

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: అరే కుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసినం దుకు కుల సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు, మాజీ ఎంపి వి.హనుమంతరావుకు కృతజ్ఞతలు తెలిపారు. గురువారం డీడీ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి శాలువ కప్పి పుష్ప గుచ్ఛాలు అందించారు. తమ కుల ఆత్మగౌరభవన నిర్మాణానికి నిధులు విడుదల చేసిన సందర్భంగా వీహెచ్ ఆధ్వర్యంలో తమ కుల సంఘం ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకొని కృతజ్ఞతలు తెలియ జేస్తామని తెలంగాణ ఆరే కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టిపల్లి శివాజీ అన్నారు. సీఎం వద్దకు తమ కుల సంఘం ప్రతినిధి బృందాన్ని తీసుకువెళ్లాల్సిందిగా ఈ సందర్భంగా శివాజీ కోరడంతో అందుకు విహెచ్ హామీ ఇస్తూ..త్వరలో సిఎంను కలుసుకునేలా ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్య క్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఎం.మహేందర్, జెండా రాజేష్, బలేరావు మనోహార్‌రావు, కుడ్లె మనోహార్‌రావు, దుక్కిడి నాగేశ్వరరావు, కతాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సలహాదారు విహెచ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న తెలంగాణ ఆరె కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టిపల్లి శివాజీ తదితరులు

ఎపి లిక్కర్ కేసులో కీలక మలుపు

ఇద్దరి బెయిల్ రద్దుకు ఇడి పిటిషన్

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: ఎపి లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితు లుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిలకు మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెం ట్ డైరెక్టరేట్ (ఇడి) హైకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న నిందితులు కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశం ఉందని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రధానంగా సాక్షులను ప్రలోభపెట్టడం లేదా బెదిరించడం ద్వారా విచారణకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉందని ఈడీ తరపు న్యాయ వాదులు న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లారు. కీలక నిందితులు బయట ఉండటం వల్ల దర్యాప్తు సజావుగా సాగడానికి ఆటంకంగా మారుతుందని వారే పేర్కొన్నారు. ఎపి లిక్కర్ కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ ఇప్పటికే లోతైన విచారణ జరుపుతుండడం తెలిసిందే. ఈ క్రమంలో నిందితుల బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయ స్థానాన్ని ఆశ్రయించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇడి దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది.

ఆవేదనతో గిరిజన దంపతుల ఆత్మహత్య

మణుగూరు, ప్రభాతవార్త, నవంబరు 12: తమ చిన్నారి అనారోగ్యం తగ్గాలని పూజలు చేయించేందుకు పిలిచిన బంధువులు హత్యకు గురికావడాన్ని జీర్ణించుకోలేక, ఆవేదనతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ గిరిజన దంపతులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మణుగూరు మండలం లోని వలస ఆదివాసీ గ్రామం బుడుగులలో చోటుచేసుకుంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వలస ఆదివాసీ గ్రామం బుడుగులకు చెందిన పద్దం రాంబాబు(32) సునీత(25) దంపతులకు నాలుగు,ఏడాదిన్నర వయసున్న ఇద్దరు కుమార్తెలున్నారు.కొంతకాలంగా చిన్న కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. పాపకు నయం కావాలనే ఉద్దేశంతో రాంబాబు తండ్రి మాసయ్య, మరో బంధువు ఆళ్లపల్లి మండలం భూసరాయి గ్రామంకు చెందిన భీమయ్య గత నెల 7న వీరి ఇంటికి వచ్చి పూజలు నిర్వహించారు. అయితే, పూజలు ముగించుకుని తిరిగి తమ గ్రామాలకు వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మాసయ్య, భీమయ్యలపై దాడి చేసి కొట్టి చంపారు. ఈ ఘటనపై అప్పట్లోనే కేసు నమోదైంది.

హత్యకు గురైన వారి అంత్యక్రియలు ముగిసిన అనంతరం, బంధువులంతా ఇంట్లో ఉండగానే రాంబాబు, సునీతల మధ్య ఈ విషయంపై గొడవ జరిగింది. మన పిల్లలకు బాగు చేయడానికి అంత దూరం నుంచి మన వద్దకు వచ్చి, తిరిగి వెళ్తూ ప్రాణాలు కోల్పోయారు. ఇదంతా మన వల్లే జరిగింది కదా అంటూ సునీత తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. రాంబాబు ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా, సునీత మనస్తాపం తగ్గలేదు.

రాత్రి నిద్రించిన తర్వాత, బుధవారం తెల్లవారుజామున ఆవేశంలో సునీత ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. విషయం గమనించిన కుటుంబ సభ్యులు చింతపండు రసం, సర్ఫ్ నీళ్లు తాగించి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.ఉదయం 8 గంటల లోపే సునీత మృతి చెందింది.

కళ్లముందే భార్య విగతజీవిగా మారడాన్ని చూసి తట్టుకోలేకపోయిన రాంబాబు తీవ్ర కుంగుబాటుకు లోనయ్యాడు. బంధువులంతా చూస్తుండగానే, గతంలో వ్యవసాయ పనుల కోసం తెచ్చి ఇంటి చూరులో దాచిన పురుగుల మందు డబ్బాను తీసుకుని తాగేశాడు. అడ్డుకునే ప్రయత్నం చేసిన వారి నుంచి తప్పించుకుని అటవీ ప్రాంతంలోకి పరుగెత్తగా, బంధువులు వెంబడించి పట్టుకున్నారు. మంచంపై మోసుకుంటూ బుగ్గ గ్రామం వద్దకు తీసుకువచ్చి, అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో మణుగూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితివిషమించడంతో మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం రాంబాబు కూడా ప్రాణాలు విడిచాడు.

మృతుడి సోదరుడు పద్దం చుక్కయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు మణుగూరు సిఐ పాటి నాగబాబు తెలిపారు.

రాష్ట్ర ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా జిసిసిలు

టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
ఇతర పరిశ్రమలతో ఐటి రంగం అనుకూలతల అనుసంధానం
మార్స్ జిసిసి ప్రారంభోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను కీలక చోదక శక్తులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొత్త టెక్నాలజీ అభివృద్ధి, ఆర్ అండ్ డీ, డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ డిజైన్, ఇంజినీరింగ్, ఇన్నోవేషన్ తదితర విభాగాల్లోనూ కీలక పాత్ర పోషించేలా వాటికి మార్గనిర్దేశం చేస్తున్నామ న్నారు. స్నికర్స్, పెడిగ్రీ, రాయల్ కానిన్ తదితర ప్రముఖ బ్రాండ్లతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తిం పు పొందిన మార్స్ సంస్థ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన జిసిసిని ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... హైదరాబాద్‌ను సంప్రదాయ ఐటీ సేవల కేంద్రం నుంచి ప్రపంచస్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, నాలెడ్జ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. కొత్త రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు ఐటీ/ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను ఇతర పరిశ్రమలతో అనుసంధానించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగానే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లోనూ టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జెన్‌పాక్ట్ సహకారంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 400 మందికి పైగా ఉపాధి లభించనుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య వేయికి పెరుగుతుందన్నారు. మార్స్ గ్లోబల్ ఆపరేషన్స్‌కు అవసరమైన డిజిటల్, డేటా, ఏఐ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ క్లాస్ ఆగార్డ్, జెన్‌పాక్ట్ ప్రతినిధి తరుణ్ చోప్రా, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ ప్రతినిధి ఎమీలియా బి. స్మిత్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో అభివృద్ధి చేసిన జిసిసిని లాంఛనంగా ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

యాదాద్రి థర్మల్‌లో 6,088 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: యాదాద్రి థర్మల్ కేంద్రంలో 6088 మెగావాట్ల రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పతిన అయ్యిందని విద్యుత్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ తెలిపారు. యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. అక్కడ థర్మల్ కేంద్రం పనితీరు, నిర్వహణ ప్లాంట్, బొగ్గు లభ్యత, నాణ్యత తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6088 మెగావాట్ల ఆల్‌టైమ్ గరిష్ఠ థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని నమోదు చేసి, రాష్ట్ర విద్యుత్ రంగంలో ఒక మైలురాయిని సాధించిందన్నారు. సమర్థవంతమైన బొగ్గు నిర్వహణ, బలోపేతమైన ఇంధన సరఫరా వ్యవస్థ ఈ స్థాయి విద్యుత్ ఉత్పత్తికి గణనీయంగా దోహదపడ్డాయని తెలిపారు.

తెలంగాణలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చేందుకు నమ్మకమైన, నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ నిబద్ధతను చాటిచెబుతోందని వ్యాఖ్యానించారు. గత మూడు నెలల్లో చేపట్టిన ముఖ్యమైన మెరుగుదల విషయాలను గూర్చి వెల్లడిస్తూ ప్రధానంగా వైబ్రేటింగ్ గ్రిజ్లీ ఫీడర్లలో (విజిఎఫ్) మార్పులు చేయడం, బెల్టులు సర్దుబాటు, పుల్లీలను మార్చడం, అరిగిపోయిన వాటికి ల్యాగింగ్, స్కర్ట్ ప్యాడ్ల సర్దుబాటు చేయడం వంటి వాటితో థర్మల్ కేంద్రం పనితీరు గణనీయంగా మెరుగుపడిందని వివరించారు.

ప్రస్తుతం స్టేషన్ సగటున సుమారు 2000 నుండి 2100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పనిచేస్తోందని చెప్పారు. నాలుగు యూనిట్ల 3200 మెగావాట్ల స్థాపిత సామర్థ్యానికి గాను సుమారు 2700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించిందని వెల్లడించారు.

బొగ్గు నిర్వహణ సామర్థ్యం, విశ్వసనీయతను మెరుగుపరచేందుకు బొగ్గు నిర్వహణ ప్లాంట్‌లోని అవరోధాలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతులకు ఎఐ ఆధారిత సలహాలు

స్మార్ట్ గవర్నమెంట్‌తో వ్యవసాయ శాఖ ఒప్పందం
వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఏఐ ఆధారిత డిజిటల్ వేదిక భారత్ విస్తార్ సేవలను రాష్ట్రంలో వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నమెంట్ (ఎన్ఐఎస్‌జీ) మధ్య గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడం ద్వారా సాగు వ్యయాన్ని తగ్గించి, వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చవచ్చన్నారు. పంట సాగులో రైతులు ఎదుర్కొనే సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, శాస్త్రీయమైన సూచనలు అందిస్తే చీడపీడలు, తెగుళ్ల పంట మొత్తం విస్తరించకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, పంట రకం, సాగు సమయం, మార్కెట్ ధరలను విశ్లేషించి రైతులకు అవసరమైన సమయంలో కచ్చితమైన సలహాలు అందించడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. రైతులకు సాంకేతిక సలహాలు అందితే పెట్టుబడి వ్యయం తగ్గడంతో పాటు, దిగుబడులు, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని వివరించారు. తెలంగాణలోని ప్రాంతీయ వాతావరణ పరిస్థితులు, నేలల స్వభావం, పంటల వైవిధ్యం, స్థానిక సాగు పద్ధతులు, మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని భారత్ విస్తార్ వేదికను రాష్ట్ర రైతులకు మరింత ప్రయోజనకరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలకు అదనంగా తెలంగాణకు సంబంధించిన వ్యవసాయ పథకాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, పంటల సాగు విధానాలు, శాస్త్రీయ సలహాలు కూడా ఈ వేదికలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, డైరక్టర్ డాక్టర్ బి. గోపి, ఎన్ఐఎస్‌జీ సీనియర్ జనరల్ మేనేజర్ షేక్ రషీద్ భాష తదితరులు పాల్గొన్నారు.



గురువారం సచివాలయంలో గురువారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఎన్ఐఎస్‌జితో ఒప్పందం చేసుకుంటున్న దృశ్యం

రైతులపై కెటిఆర్ కపట ప్రేమ

ప్రతి నీటిచుక్కను ఒడిసిపట్టాం.. ఆంధ్రకు నీరు ఇవ్వలేదు
నీళ్లపై తప్పుడు ప్రచారంతో ప్రజలను రెచ్చగొట్టేందుకు కుట్ర : ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

హైదరాబాద్, నవంబరు 12,ప్రభాతవార్త: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తమ ఉనికి కోసం రోడ్లపైపడి రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నాడని, కెటిఆర్ పెట్టింది రైతు గర్జన కాదు అధికార దాహంతో ఏర్పాటు చేసిన సభ అని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్‌పిలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రజలను మరోసారి మోసం చేయడానికి డ్రామా రావు, అబద్ధాల రావు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. తుమ్మిడిహట్టి దగ్గర బ్యారేజీ నిర్మించాలన్న సోయి అప్పుడెందుకు లేకపోయిందని, మహా ఒప్పందం పేరుతో బేగంపేట ఎయిర్‌పోర్టులో గుర్రాలు, ఒంటెలతో ఊరేగిన కెసిఆర్ ఆ తర్వాత తుమ్మిడిహట్టిని మరిచిపోయాడని ఎద్దేవా చేశారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మించారని పారే నీళ్లను ఎత్తిపోసే అవకాశం ఉంటే లక్ష కోట్లు పెట్టి బ్యారేజీలు ఎందుకు కట్టారని ప్రశ్నించారు. కాళేశ్వరం బ్యారేజీల్లో నీళ్లు నిలిపితే కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఎన్‌డిఎస్ఎ తేల్చి చెప్పిం దని గుర్తుచేశారు. కాళేశ్వరం దిగువ దేవాదుల, సీతారామ సాగర్ వద్ద నీళ్లను ఎత్తిపోస్తున్నామని ఆంధ్రాకు పోనివ్వడం లేదని తెలిపారు. చుక్క నీరు కూడా ఆంధ్రాకు పోనివ్వడం లేదనీ, ప్రతి చుక్కను ఒడిసి పడుతున్నామని, నీళ్లపై తప్పుడు ప్రచారం చేసి తెలంగాణ రైతులను రెచ్చగొట్టాలని కెటిఆర్ ప్రయత్నం చేస్తున్నాడు. ఎల్‌నినోపై కూడా బిఆర్ఎస్ పార్టీ నీచపు రాజకీయాలు చేస్తోందనీ అన్నారు. ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు మా ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందని అన్నారు. రైతులు సంతోషంగా ఉన్నారని అన్నిచోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు సుఖసంతోషంగా ఉంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారనీ ఆవేదన చెందారు. రైతుకు మా ప్రభుత్వం 20 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా కింద 36 వేల కోట్ల రూపాయలను రైతులకు ఇచ్చాం.. వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇస్తున్నాం.. కాళేశ్వరం నుంచి చుక్కనీరు ఎత్తి పోయకున్నా రికార్డు స్థాయిలో పంటలు పండించామని ఆయన చెప్పుకొచ్చారు. హరీశ్‌రావు, కెటిఆర్ చెరోచోట మీటింగ్‌లు పెట్టి ఉనికి కోసం ప్రయత్నాలు చేస్తున్నారని, పదేళ్ల అధికారంలో ఉండి అనేక హామీలు అమలు చేయకుండా పోయారన్నారు.



అధికారులను విచారిస్తున్న జాతీయ మహిళా కమిషన్ నిజనిర్ధారణ కమిటీ

వితంతువుపై దాడి ఘటనపై జాతీయ మహిళా కమిషన్ నిజనిర్ధారణ కమిటీ

బాధితుల సంఘటనపై విచారించిన కమిటీ

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త : తెలంగాణలోని నల్గొండ జిల్లాలో 60 యేళ్ల వితంతువు, ప్రభుత్వ ఉపాధ్యాయురాలి నివాసంలోకి దుండగులు చొరబడి, ఆమె ఇంటిని ధ్వంసం చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సిడబ్ల్యు) ఇద్దరు సభ్యులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. 1990 జాతీయ మహిళా కమిషన్ చట్టంలోని సెక్షన్ 10(1) ను సెక్షన్ 10(4) ప్రకారం ఈ విచారణ జరుగుతోంది. జాతీయ కమిషన్ సభ్యురాలు నందితా సుబ్రమణియన్, సీనియర్ కోఆర్డినేటర్ కంచన్ ఖట్టర్‌లతో కూడిన కమిటీ ఢిల్లీ నుండి నల్గొండ జిల్లాలోని బాధితురాలి గ్రామాన్ని సందర్శించింది. సంఘటనా స్థలంలో విచారణ జరిపి, బాధితురాలు, సాక్షులతో మాట్లాడి వాటికి సంబంధించిన వివరాలను సేకరించింది. అంతేకాకుండా ఈ కమిటీ జిల్లా మేజిస్ట్రేట్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఇతర సంబంధిత అధికారులతో కూడా సమావేశమైంది. కాగా విచారణ అనంతరం ఈ సంఘటనపై అధికారులు తీసుకున్న చర్యలు, సరిదిద్దిన లోపాలు, సంబంధిత చట్టపరమైన నిబంధనల వివరాలను నిజనిర్ధారణ తన కమిటి నివేదికను జాతీయ మహిళా కమిషన్‌కు సమర్పించనుంది. అంతేకాకుండా ఈ సంఘటనకు కారణమైన వారు, అందుకు సహకరించిన వారిపై తదుపరి చర్యల కోసం కమిటీ తన సిఫార్సులను ఈ నివేదికలో పొందుపరచనుందని కమిషన్ తెలిపింది.

కోహెడ మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం

మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: కోహెడలో నిర్మిస్తున్న సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నాటికి మొదటి దశ నిర్మాణ పనులను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మిగిలిన పనులన్నింటినీ పూర్తి చేసి 2028 జూన్ 2 నాటికి పండ్ల మార్కెట్‌ను రైతులకు అంకితం చేసేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక సదుపాయాలతో కూడిన సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మించి రాష్ట్ర రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రైతులు పండించిన పండ్లను నాణ్యత కోల్పోకుండా నిల్వ చేసుకోవడానికి, విక్రయించడానికి, దేశీయంగా మరియు అంతర్జాతీయ మార్కెట్లకు తరలించడానికి అనువైన అన్ని సదుపాయాలు ఈ మార్కెట్‌లో అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిర్మాణ సంస్థ నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకునేలా ఒప్పంద నిబంధనల్లో అవసరమైన మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా, నిర్ణయించిన కాలపరిమితిలో ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొహెడ పండ్ల మార్కెట్ నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిగా రాహుల్ రాజ్‌ను నియమిస్తూ మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌కు మున్నూరు కాపు సంఘం ప్రతినిధుల కృతజ్ఞతలు

హైదరాబాద్,నవంబరు12ప్రభాతవార్త: మున్నూరు కాపు సంఘం ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయడంపై సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.మున్నూరు కాపు సామాజిక వర్గ ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ భవనం సామాజిక వర్గ అభ్యున్నతికి, సంఘటిత శక్తికి కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిసిసి బొబ్బిలి రామకృష్ణ, నిజామాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ధర్మపురి సంజయ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రాములు, రత్నాకర్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి కోసం ప్రపంచం వస్తుంటే కుట్ర ఎలా అవుతోంది

ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు

హైదరాబాద్,నవంబరు 12,ప్రభాతవార్త: రాష్ట్రం అభివృద్ధి దేశాభివృద్ధితో ముడిపడిఉంది ఇక్కడ పెట్టుబడి పెట్టడం కోసం ప్రపంచం వస్తుంటే ఇది కుట్ర ఎలా అవుతోంది అని ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు ప్రశ్నించారు. గురువారం గాంధీ భవన్ విలేఖరులతో మాట్లాడుతూ భారత్ సమ్మిట్ వెనుక రాజకీయ కుట్ర ఉంది అని రామచంద్ర రావు అనడం ఆయన రాజకీయ పరిణితిమాత్రమే తెలుపుతోందని ఎద్దేవా చేశారు. యావత్ దేశాలు నుండి ఇక్కడ పెట్టుబడులు కోసం వస్తుంటే అది కుట్ర ఎలా అవుతుంది విదేశాలు నుండి వచ్చే వాళ్ళు నాకు ఓట్లు వేస్తారా అని ఆయన ప్రశ్నించారు. దానిలో రాజకీయ దురుద్దేశం ఏం ఉంటుందని అడిగారు. ఐన బిజెపి ఉన్న ఓట్లే చోరీ చేస్తుంది ఇంకా విదేశాల నుండి వచ్చే వాళ్లకి ఓట్లు ఇస్తారా అని ఆయన అడిగారు.

భయపెడుతున్న ప్రత్యామ్నాయ సాగు

పంటల మార్పిడికి అడ్డంకిగా కోతుల బెడద
దిగుబడి తగ్గి పెరగనున్న ఆర్థిక భారం
యాసంగి సీజనులో రైతులకు కొత్త సమస్యలు

హైదరాబాద్, నవంబరు 12, ప్రభాతవార్త: తెలంగాణలో ఈ యాసంగి సీజన్ సాగుపై రైతుల్లో ఇప్పటినుంచే తీవ్ర ఆందోళన మొదలైంది. ల్ నినో ప్రభావంతో తెలంగాణలో ఈ యాసంగి సీజనులో అధిక నీటిని వినియోగించే వరి తదితర పంటలకు స్వస్తి పలకాలని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. వర్షాభావంతో సాగు నీటి కొరత, భూగర్భ జలాలు అడుగంటడం, విద్యుత్‌కు భారీ డిమాండ్ ఏర్పడి మరింత ఆర్థిక భారం పెరగడంతో పూర్తి స్థాయిలో సరఫరా చేయడం సాధ్యం కాని పరిస్థితుల్లో తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేయాలని మంత్రులు, ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు రైతాంగంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కోతుల బెడద రైతులను ఆరుతడి పంటలు వేయకుండా మరో అడ్డంకిగా మారుతోంది. పంటలు మార్చాలని ప్రభుత్వం చెబుతున్నా, వేసిన పంటను కోతుల నుంచి ఎలా కాపాడుకోవాలన్నది రైతులకు ప్రశ్నగా మారింది. అయితే గ్రామాల్లో కోతుల బెడద రైతులకు కొత్త తలనొప్పిగా మారింది. గతంలో ఈ కోతుల గుంపులను తరిమికొట్టేందుకు ఆయా ప్రాంతాల్లో ఎన్ని ప్రయత్నాలు చేసిన విఫలం అయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో కోతులను పట్టి అడవుల్లోకి తరలించేందుకు ప్రత్యేక సిబ్బందిని ఉపయోగించినా ఈ చర్యలు ఆశించిన స్థాయిలో సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వరికి ప్రత్యామ్నాయంగా వేసే పంటలను కోతులు దెబ్బతీస్తాయనే భయం రైతుల్లో ఉంది. కోతులను తరిమేందుకు చేసిన ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లోకి, పంట పొలాల్లోకి వస్తున్న కోతులు కూరగాయలు, పప్పుధాన్యాలు, ఇతర పంటలను దెబ్బతీస్తున్నాయని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టమోటా, వంకాయ, బెండకాయ, చిక్కుడు, సొరకాయ, పొట్లకాయ, దోసకాయ, కాకరకాయ, బీరకాయ వంటి కూరగాయలతోపాటు గుమ్మడికాయ, బంగాళాదుంప, బీట్‌రూట్, క్యారెట్ పంటలకు కోతుల వల్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. జొన్న, మొక్కజొన్న, సజ్జలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, చెరకు, కందులు, మినుములు, పెసర్లు, శనగలు, పుచ్చకాయ వంటి పంటలను కూడా కోతుల నుంచి కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. పంటను ఎన్ని రోజులు కాపాడుకున్నా, ఒక్కసారి కోతుల గుంపు పొలంపై దాడి చేస్తే పంట మొత్తం చేతికి అందకుండా పోతుందని వాపోతున్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటల సాగులో పెట్టుబడి పెట్టిన తర్వాత కోతుల వల్ల దిగుబడి తగ్గితే ఆర్థికంగా భారీగా నష్టపోతామనే భయం అన్నదాతలను పట్టి పీడిస్తోంది. కాగా ఈ యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా 70 లక్షల నుంచి 75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. గత యాసంగిలో సుమారు 92 లక్షల ఎకరాల్లో సాగు జరిగింది. అప్పటితో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం భారీగా తగ్గే అవకాశాలు ఉన్నట్లు చెబుతోంది. మరోవైపు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాల పరిస్థితిపై ఆందోళనల నేపథ్యంలో ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం 50 లక్షల ఎకరాల కంటే తక్కువకు పడిపోవచ్చని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు జాతీయ వంటనూనెల మిషన్ కింద వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు, కుసుమ వంటి నూనెగింజల సాగును రాష్ట్రంలోని 51,225 ఎకరాల్లో ప్రోత్సహించాలని సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం 28,680 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేసింది.

ఎంబి కాన్ఫరెన్స్ గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికలు ఏకగ్రీవం

960 సంఘాల సమష్టి మద్దతుతో నూతన నాయకత్వం ఎన్నిక

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: మెనోనైట్ బ్రదెన్ కాన్ఫరెన్స్ పరిధిలోని సుమారు 960 సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, వివిధ గ్రూపుల సమిష్టి సహకారంతో నూతన గవర్నింగ్ కౌన్సిల్ (జిసి) ఎన్నికలు ఎం.బి. మిషన్ కాంపౌండ్, మహబూబ్‌నగర్‌లో ఏకగ్రీవంగా జరిగాయి. వివిధ ఫీల్డుల నుంచి హాజరైన సుమారు 2,000 మంది స్త్రీ, పురుషుల సమక్షంలో, 53 మంది డెలిగేట్లు నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భారీ జనసమూహం మధ్య అత్యంత గంభీరంగా నిర్వహించిన ఈ ఎన్నికల ప్రక్రియలో నాయకత్వ ఎంపిక ఏకగ్రీవంగా జరగడం జీసీ కాన్ఫరెన్స్‌లో ఐక్యత, సమిష్టి బాధ్యత, సంస్థాగత పునరుద్ధరణ పట్ల సభ్యులకున్న ఆకాంక్షకు నిదర్శనంగా నిలిచింది. నూతనంగా ఎన్నికైన గవర్నింగ్ కౌన్సిల్:- ప్రెసిడెంట్: రెవ. డా. సిఎస్. జోయెల్, వైస్ ప్రెసిడెంట్: సహో. కెఈ రాజారత్నం, జనరల్ సెక్రటరీ: రెవ. ఎ. శ్యామ్ రావు, అసోసియేట్ సెక్రటరీ: రెవ.ఇ ప్రసాద్,. కోశాధికారి: రెవ. బండారి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు: సహో. వి. వందనం సహో. జి.జి. పాల్ ఎన్నికయ్యారు. సంస్థ పునర్నిర్మాణం, అభివృద్ధే నూతన నాయకత్వం లక్ష్యం సుమారు 960 సంఘాలతో విస్తరించి ఉన్న ఎంబి కాన్ఫరెన్స్‌ను తిరిగి అభివృద్ధి పథంలో నడిపించడం నూతన గవర్నింగ్ కౌన్సిల్ ముందున్న ప్రధాన కర్తవ్యమని నూతన అధ్యక్షులు రెవ. డా. సిఎస్. జోయెల్ పేర్కొన్నారు.

జేబులో రాజ్యాంగం వారి ఆస్తి అనుకోవాలా?

న్యూఢిల్లీ, నవంబరు 12: 'కిసాన్ తక్ష్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. కొందరు వ్యక్తులు రాజ్యాంగ ప్రతిని తమ జేబులోంచి తీసి, అది తమ సొంత ఆస్తి అన్నట్లుగా ప్రవర్తిస్తుంటారని ఆయన అన్నారు. 'కిసాన్ తక్ష్ సదస్సులో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రసంగిస్తూ, "ఈ రోజుల్లో కొందరు రాజ్యాంగాన్ని తమ జేబులోంచి తీస్తుంటారు. రాజ్యాంగం తమ జేబులోనే ఉందని వారు భావిస్తారు. అధికారం అనేది ఒక విచిత్రమైన మత్తు" అంటూ రాహుల్‌గాంధీని ఉద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. రాజ్యాంగ పరిరక్షకుల్లా నటిస్తున్న కాంగ్రెస్‌పై మోడీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఇరాన్- అమెరికా సంఘర్షణల నేపథ్యంలో, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం వినియోగదారులపై పడకుండా ఉండేందుకు ప్రభుత్వం నెలకు రూ. 14,000 కోట్ల భారాన్ని భరిస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభం దృష్ట్యా డీజిల్ ధరను లీటరుకు రూ. 50 మేర పెంచాల్సిన అవసరం ఏర్పడిందని, అయితే ప్రభుత్వం ఆ భారాన్ని తానే భరిస్తూ ధరను కేవలం రూ.7 మాత్రమే పెంచిందని ఆయన చెప్పారు. ఇరాన్ యుద్ధం వల్ల వ్యవసాయ ముడి ఉత్పత్తులు, ఎరువుల ధరలపై తీవ్ర ప్రభావం పడిందని, అయినప్పటికీ భారత్ తన రైతులకు అత్యంత తక్కువ ధరకే వీటిని అందుబాటులోకి తెచ్చిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. రైతులకు ఎరువులు అందుబాటు ధరలో లభించేలా చూసేందుకు గత 12 యేళ్లలో ప్రభుత్వం రూ.16 లక్షల కోట్లు ఖర్చు చేసిందని ప్రధాని తెలిపారు. ఇది చాలా పెద్ద మొత్తం. రూ. 16 లక్షల కోట్లు అనేక దేశాల వార్షిక బడ్జెట్ల కంటే ఎక్కువ అని పేర్కొన్నారు. ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లోని సంఘర్షణల వల్ల అంతర్జాతీయంగా ధరలు పెరిగినప్పటికీ, భారత్‌లో డిఎపి ఎరువుల బస్తా రూ. 5,000 విలువైనది కేవలం రూ. 1,300కే లభిస్తోందని, అలాగే రూ. 3,000 విలువైన యూరియా బస్తా రూ. 300 కంటే తక్కువ ధరకే అందుబాటులో ఉందని

> రాహుల్‌గాంధీపై ప్రధాని మోడీ వ్యాఖ్యలు
> డీజిల్ ధర రూ.50 పెంచాలి, కానీ రూ. 7 పెంచాం
> రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాం
> 12 యేళ్లలో రూ.16 లక్షల కోట్లు ఖర్చు చేశాం
> 'కిసాన్ తక్ష్ సదస్సులో ప్రధానమంత్రి వెల్లడి

ఆయన పేర్కొన్నారు.
ప్రపంచ బ్యాంక్ అధ్యయనాన్ని ఉటంకిస్తూ గత 12-13 యేళ్లలో 50 కోట్ల మంది భారతీయులు పేదరికం నుండి బయటపడ్డారని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం గణనీయంగా తగ్గిందని ప్రధాని మోడీ చెప్పారు. గత దశాబ్ద కాలంలో వ్యవసాయ రంగం సగటున 4 శాతానికి పైగా వార్షిక వృద్ధిని నమోదు చేసిందని, స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు. అయితే, మీడియా కథనాల్లో ఇటువంటి విజయాలు తరచుగా విస్మరణకు గురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం



చేశారు.

భూమాతను నాశనం చేస్తున్నాం

సహజ వ్యవసాయాన్ని చేపట్టాలి: రసాయనాలను విచక్షణారహితంగా వాడటం వల్ల పర్యావరణానికి హాని కలుగుతోందని హెచ్చరించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రైతులను అప్రమత్తం చేశారు. నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి, భూమాతను పరిరక్షించడానికి సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ఎంతో ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు.
భూమాతను కాపాడేందుకు రైతులు, సంబంధిత భాగస్వాములందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని ఆయన సూచించారు. గోధుమ, వరి, చెరకుకు మించి ఇతర పంటలు పండించాలన్నారు.

22-ఎ దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి

ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండరాదు : మంత్రి పొంగులేటి

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: యేళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న 22ఎ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ దిశగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వేగవంతంగా, క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేసి దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 22ఎ సమస్యల పరిష్కారానికి ఇటీవల కాలంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణ యాలు క్షేత్రస్థాయిలో అమ లు పరిష్కారంలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో మంత్రి సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ, 22ఎ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో 118, జీవో 76లకు సంబంధించి మెమోలు, 22 ఎ జాబితాలో ఉన్నప్పటికీ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతులు, యూఎల్సీ దరఖాస్తుల పరిష్కారం, నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యల పరిష్కారం, జీవో 59 అమలు తదితర అంశాలకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.



గురువారం సచివాలయంలోని హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

ఈ అంశాలకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని పేర్కొన్నారు. ప్రతి వారం జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్, ఇతర సంబంధిత అధికారులు సమావేశమై 22ఎ సమస్యల పరిష్కారంపై సమీక్షించుకోవాలని సూచించారు. జిల్లా స్థాయిలో పరిష్కరించడానికి వీలుకాని అంశాలను రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్‌కుమార్ నాయకత్వంలోని ఉన్నతస్థాయి కమిటీకి సిఫార్సు చేయాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, జారీ చేస్తున్న జీవోలు, మెమోలు కేవలం ప్రభుత్వ ఉత్తర్వులకే పరిమితం కాకూడదని, వాటి అసలు ఉద్దేశం క్షేత్రస్థాయిలో అమలైనప్పుడే ప్రజలకు నిజమైన మేలు జరుగుతుందని మంత్రి అన్నారు.
ముఖ్యంగా కలెక్టర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి ప్రకారం అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యుఎల్ సికి సంబంధించి వివిధ కోర్టులు వెలువరించిన తుది తీర్పులు, ప్రభుత్వం తరఫున స్పెషల్ లీవ్ పిటిషన్లు (ఎస్ఎల్‌పీలు) దాఖలు చేసే అంశాలు, ఎస్ఎల్‌పీలు దాఖలు చేయడానికి అవకాశం లేని ఇతర అంశాలన్నింటిపై వారం రోజుల్లోగా ఉన్నతస్థాయి కమిటీ సమగ్ర నివేదిక అందించాలని మంత్రి సూచించారు. ఈ నివేదికపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి రెగ్యులరైజేషన్‌పై తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 22ఎ జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను నిర్ధారించిన తర్వాతే తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిజమైన యజమానులు తమ భూములపై హక్కులు పొందేందుకు అనవసరమైన జాప్యం జరగకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అర్హులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన భూముల విషయంలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

దీపావళి తర్వాత కూడా తగ్గని కార్ల కొనుగోలు జోరు

ఎపి, తెలంగాణలో పెళ్లిళ్ల సీజన్‌తో మరింత పెరిగిన సందడి

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: దీపావళి పండుగ ముగిసినా, కొత్త కార్ల కొనుగోలు పట్ల ప్రజల ఆసక్తి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కొనసాగుతోంది. నవంబర్‌లోని మంచి రోజులు, కొనసాగుతున్న పెళ్లిళ్ల సీజన్, ఆకర్షణీయమైన ఆఫర్లతో రాష్ట్రాల్లోని షోరూమ్‌లలో కస్టమర్ల సందడి ఇంకా కొనసాగుతోంది. షోరూమ్‌లలో కొనసాగుతున్న రద్దీ:- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న షోరూమ్‌లలో దీపావళి తర్వాత కూడా కస్టమర్ల రాక, విచారణలు, బుకింగ్‌లు బలంగా కొనసాగుతున్నాయి. ఇది కార్ మార్కెట్‌లో కొనుగోలు జోరు ఇంకా తగ్గలేదని సూచిస్తోంది. నవంబర్‌లో శుభ ముహూర్తాలు:- నవంబర్ 21, 24, 25, 26 తేదీలను ముఖ్యమైన పెళ్లి ముహూర్తాలుగా పరిగణిస్తున్నారు. ఈ రోజులు కొత్త కారును కొనుగోలు చేయడానికి మంచి సమయంగా భావించి, అనేక కుటుంబాలు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కొనుగోళ్లకు ఊతం:- పెళ్లిళ్ల సీజన్ జోరుగా సాగుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కుటుంబాలు పెళ్లి వేడుకలు, ఇతర కుటుంబ వేడుకల కోసం కొత్త కార్లను బుక్ చేసుకుంటూ, డెలివరీలు తీసుకుంటూ ఉన్నాయి. దీంతో విచారణలు, బుకింగ్‌లు గణనీయంగా పెరిగాయి. ఆకర్షణీయమైన ఆఫర్లు ఇంకా కొనసాగుతున్నాయి:- ప్రత్యేక ఫెస్టివల్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ బెనిఫిట్లు, ఫైనాన్స్ సౌకర్యాలు, వాల్యూ యాడెడ్ ప్యాకేజీలు ఇంకా అందుబాటులో ఉన్నాయి. ఇవి కొత్త కారును కొనుగోలు చేయడానికి మంచి అవకాశంగా మారింది. నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు డిమాండ్:- పెద్ద నగరాలే కాకుండా పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వివిధ మోడళ్లపై కస్టమర్ల నుంచి గణనీయమైన ఆసక్తి నమోదవుతోంది.

నగరంలో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ విధానం

డిసెంబరు నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,నవంబరు12,ప్రభాతవార్త: కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) పరిధిలో ట్రాఫిక్ సమస్యలు, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణ వంటి ముఖ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని కీలక ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ విధానం అమలు చేయడానికి సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ (పిఆర్‌టిఎస్) విధానంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కేపిహెచ్‌బీ మెట్రోస్టేషన్ నుంచి దుర్గం చెరువు, రహేజా మైండ్‌స్పేస్, బయోడైవర్సిటీ మెట్రో స్టేషన్ వరకు అత్యంత రద్దీగా ఉండే మార్గంలో పీఆర్‌టీ లైన్‌ను వెంటనే ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రాజెక్టు సంబంధించి డిసెంబర్ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఏడాది కాలంలో ఆ మార్గంలో పీఆర్‌టీ వ్యవస్థ పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఈ మార్గంలో గచ్చిబౌలి ఐకియా సమీపంలో మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేసి అందులో పీఆర్‌టీ డిపోను నిర్మించాలని చెప్పారు. నగరంలో ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్‌బండ్ మీదుగా రాణిగంజ్ బస్టాండ్ వరకు మరో పీఆర్‌టీ లైన్ నిర్మించాలని సూచించారు. అసెంబ్లీ మెట్రోస్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమాక్స్ నుంచి బేగంపేట్ ను కలుపుతూ మరో పీఆర్‌టీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ మార్గంలో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేసి అందులో పీఆర్‌టీ డిపోను నిర్మించాలని ఆదేశించారు.

స్వీట్ తయారీ యూనిట్లపై టిజిపిసిబి కొరడా

నిబంధనలు ఉల్లంఘించిన 7 యూనిట్లపై తనిఖీలు

3 యూనిట్లపై చర్యలకు సిఫారసు

హైదరాబాద్ (సంజీవరెడ్డినగర్), నవంబరు 12, ప్రభాతవార్త : పర్యావరణ నిబంధనలను పాటించకుండా స్వీట్ల తయారీ కార్యకలాపాలు నిర్వహిస్తున్న యూనిట్లపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) చర్యలు చేపట్టింది. ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా రంగంలోకి దిగిన టీజీపీసీబీ రోలింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలు హైదరాబాద్‌తో పాటు రామచంద్రాపురం పరిధిలోని పలు స్వీట్ తయారీ యూనిట్లలో గురువారం తనిఖీలు నిర్వహించాయి.
మొత్తం ఏడు స్వీట్ తయారీ యూనిట్లను అధికారులు తనిఖీ చేసి పర్యావరణ నిబంధనల అమలుపై నివేదికలు సమర్పించారు. తప్పనిసరిగా పొందాల్సిన స్థాపన అనుమతి, నిర్వహణ అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహించడం, వ్యర్థజలాలను శుద్ధి చేయకుండా మురుగునీటి కాలువల్లోకి విడుదల చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ఉల్లంఘించడం వంటి అంశా లను అధికారులు గుర్తించారు.
ఈ నేపథ్యంలో నవంబర్ 5న హైదరాబాద్, రామచంద్రాపురం జోనల్ కార్యాలయాల పరిధిలోని టాస్క్‌ఫోర్స్ కమిటీలు సంబంధిత ఏడు యూనిట్ల ప్రతినిధులను విచారణకు పిలిపించి నిబంధనల అమలుపై సమీక్ష నిర్వహించాయి. ఇందులో నాలుగు యూనిట్లు బోర్డు నుంచి నిర్వహణ అనుమతి పొందినట్లు తేలగా, మిగిలిన మూడు యూనిట్లు అవసరమైన అనుమతులు లేకుండానే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు గుర్తించారు.



యూనిట్లను తనిఖీ చేస్తున్న అధికారులు

అనుమతులు లేని మూడు యూనిట్లలో వ్యర్థజలాల శుద్ధి కోసం ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయకపోవడంతోపాటు, వ్యర్థజలాలను నేరుగా మురుగునీటి కాలువల్లోకి విడుదల చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నట్లు నిర్ధారించారు.
నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న యూనిట్లు తక్షణమే బోర్డు నుంచి నిర్వహణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని, అందుకు సంబంధించిన హామీ పత్రాలను సమర్పించాలని కమిటీ సూచించింది. ప్రస్తుతం విడుదలవుతున్న వ్యర్థజలాలను శుద్ధి కోసం కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలని కూడా సిఫారసు చేసింది. అదేవిధంగా స్వీట్ బాక్సుల చుట్టూ ప్లాస్టిక్ ఫిల్మ్‌లు చుట్టడం, నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడం వంటి ఉల్లంఘనలకు ఒక్కో యూనిట్‌పై రూ.లక్ష చొప్పున జరిమానా విధించాలని సిఫారసు చేసింది.
ఈ సిఫారసుల మేరకు నవంబర్ 6న సంబంధిత స్వీట్ తయారీ యూనిట్లకు టీజీపీసీబీ ఆదేశాలు జారీ చేసింది. నిర్వహణ అనుమతి పొందేందుకు తక్షణమే దరఖాస్తు చేసుకోవడంతోపాటు, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహించినందుకు పర్యావరణ పరిహారం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2021 ఉల్లంఘనకు రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఆదేశించింది. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించే యూనిట్లపై ఇకముందు కూడా తనిఖీలు, చర్యలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

మాజీ మంత్రి శత్రుచర్ల ఇక లేరు

ఐదుసార్లు ఎమ్మెల్యే.. మూడుసార్లు ఎంపిగా రాజకీయ ప్రస్థానం

అసెంబ్లీ, పార్లమెంటులో ప్రత్యేక గుర్తింపు

విజయనగరం, నవంబరు 12 ప్రభాతవార్త : మన్యం రాజకీయ యవనికపై నాలుగు దశాబ్దాలకు పైగా తనదైన ముద్ర వేసిన రాజకీయ దిగ్గజం అస్తమించారు. చిన్నమేరంగి సంస్థాన వారసత్వాన్ని రాజకీయ ప్రస్థానానికి పునాదిగా చేసుకుని, నాగూరు నుంచి పార్వతీపురం వరకు, శాసనసభ నుంచి పార్లమెంటు వరకు ప్రజాప్రతినిధిగా తనదైన స్థానాన్ని సంపాదించుకున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు (78) గురువారం కన్నుమూశారు. అనారోగ్యంతో విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు ఉత్తరాంధ్ర రాజకీయ వర్గాల్లో విషాదం అలముకుంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా పలు కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన జీవన ప్రస్థానం ముగియడంతో మన్యం రాజకీయ చరిత్రలో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది.



శత్రుచర్ల విజయరామరాజు

సంస్థాన వారసత్వం.. ప్రజా రాజకీయాల వైపు అడుగులు

1948 ఆగస్టు 4న జన్మించిన శత్రుచర్ల విజయరామరాజు చిన్నమేరంగి సంస్థాన రాజవంశానికి చెందిన కుటుంబ నేపథ్యం నుంచి వచ్చారు. సంస్థాన వారసత్వం ఆయనకు సామాజిక గుర్తింపునిస్తే, రాజకీయ ప్రస్థానం ప్రజాప్రతినిధిగా ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. 1978లో జనతా పార్టీ తరఫున నాగూరు నియోజకవర్గం నుంచి తొలిసారి శాసనసభకు ఎన్నికై రాజకీయ రంగప్రవేశం చేశారు. ఆ విజయంతో ప్రారంభమైన ఆయన ప్రజా జీవిత ప్రయాణం అనేక రాజకీయ మలుపులు, పదవులు, బాధ్యతలతో నాలుగు దశాబ్దాలకు పైగా కొనసాగింది. అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరి ఉత్తరాంధ్ర రాజకీయాల్లో తన ప్రాబల్యాన్ని విస్తరించుకున్నారు.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా ప్రజాక్షేత్రంలో సుదీర్ఘ ప్రస్థానం

నియోజకవర్గాల పునర్విభజనలు, రాజకీయ సమీకరణాలు, పార్టీల మార్పులు వంటి అనేక పరిణామాల మధ్య తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించిన విజయరామరాజు ఐదుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. నాగూరు, పార్వతీపురం, పాతపట్నం నియోజకవర్గాల నుంచి ప్రజా ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. 2004 నుంచి 2009 వరకు పార్వతీపురం ఎమ్మెల్యేగా, 2009 నుంచి 2014 వరకు పాతపట్నం ఎమ్మెల్యేగా పనిచేశారు. ప్రాంతీయ రాజకీయాలపై అవగాహన, సుదీర్ఘ అనుభవం, ప్రజాప్రతినిధిగా వివిధ స్థాయుల్లో నిర్వహించిన బాధ్యతలు ఆయన రాజకీయ జీవితానికి ప్రత్యేకతను చేకూర్చాయి.

పార్లమెంటులోనూ మన్యం గళం

శాసనసభ రాజకీయాలకే పరిమితం కాకుండా జాతీయ రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేశారు. పార్వతీపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి మూడుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యారు. 1989, 1991, 1998 ఎన్నికల్లో విజయం సాధించి పార్లమెంటులో అడుగుపెట్టారు. అసెంబ్లీ, పార్లమెంటు రెండింటిలోనూ ప్రజాప్రతినిధిగా పనిచేసిన అరుదైన రాజకీయ అనుభవం ఆయన సొంతం. గ్రామీణ, గిరిజన ప్రాంతాల సమస్యలు, ఉత్తరాంధ్ర అభివృద్ధి అంశాలతో ముడిపడిన రాజకీయ ప్రస్థానం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

మంత్రిగా కీలక శాఖల నిర్వహణ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న విజయరామరాజు రాష్ట్ర మంత్రిగా పలు కీలక శాఖలకు సేవలందించారు. అటవీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు రవాణా శాఖ బాధ్యతలను నిర్వహించారు. ప్రాంతీయ రాజకీయాల నుంచి రాష్ట్రస్థాయి పాలనా వ్యవహారాల వరకు తన అనుభవాన్ని వినియోగించారు. వివిధ శాఖల నిర్వహణలో భాగస్వామిగా వ్యవహరించిన ఆయనకు రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు లభించింది.

కీలక ఖనిజాల వేటలో భారత్ నం.2

ఇండియాకు 15 అంతర్జాతీయ ఒప్పందాలు

41 ఒప్పందాలతో అగ్రస్థానంలో అమెరికా-చైనా

న్యూఢిల్లీ, నవంబరు 12: ప్రపంచవ్యాప్తంగా క్లీన్ ఎనర్జీ రంగం శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్ అవసరాలకు కీలకమైన ఖనిజాల సేకరణలో భారత్ అత్యంత చురుగ్గా వ్యవహరిస్తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు భారత్ మొత్తం 15 క్రిటికల్ మినరల్స్ ఒప్పందాలపై సంతకాలు చేసి గ్లోబల్ రేసులో అగ్రగామిగా నిలిచింది. క్లైమేట్ యాక్షన్ లైవ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, అంతర్జాతీయంగా కీలక ఖనిజ వనరులను చేజిక్కించుకోవడంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ జాబితాలో 41 ఒప్పందాలతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత స్థానాన్ని భారత్ కైవసం చేసుకుంది. 11 ఒప్పందాలు మాత్రమే చేసుకున్న చైనా, కెనడా, సౌదీ అరేబియా, యూరోపియన్ యూనియన్ వంటి ప్రధాన దేశాలను భారత్ వెనక్కి నెట్టింది. ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక బ్యాటరీలు, విండ్ టర్బైన్లు, విద్యుత్ గ్రిడ్లు, సెమీకండక్టర్ల తయారీకి లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్, రాగి, అరుదైన భూ ఖనిజాలు (రేర్ ఎర్త్ ఎలిమెంట్స్) చాలా కీలకం. దేశీయంగా వీటి లభ్యత తక్కువగా ఉండటంతో, తన స్వచ్ఛ ఇంధన లక్ష్యాలను చేరుకోవడానికి విదేశీ వనరులను సురక్షి తం చేసుకోవడమే ఏకైక మార్గమని భారత్ భావిస్తోంది. ఈ లక్ష్యాల కోసం జనవరి 2025లో కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ఆమోదించింది. 2024-25 నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు కొనసాగే ఈ కార్యక్రమం కింద ప్రభుత్వం రూ.16,300 కోట్లు కేటాయించనుంది. దీనికి అదనంగా ప్రభుత్వ రంగ సంస్థలు మరో రూ.18,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. దేశీయంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) ఆధ్వర్యంలో 1,200 అన్వేషణ ప్రాజెక్టులను చేపట్టనున్నారు. వీటితో పాటు విదేశాల్లో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా 26, ప్రైవేట్ సంస్థల ద్వారా మరో 24 మైనింగ్ ఆస్తులను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ వ్యూహంలో భాగంగా అంతర్జాతీయ భాగస్వామ్యాలను భారత్ విస్తరిస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కబిల్) అర్జెంటీనాకు చెందిన కామ్యేన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. కటమార్కా ప్రావిన్స్‌లోని 15,703 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఐదు లిథియం బ్లాకులను అన్వేషించేందుకు పనులు ప్రారంభించింది. అటు ఆస్ట్రేలియాతో కలిసి లిథియం, కోబాల్ట్ ఆస్తులలో ఉమ్మడి పెట్టుబడులపై భారత్ దృష్టి పెట్టింది.

> నగల కోసం దారుణానికి ఒడిగట్టిన స్థానికుడు
> 24 గంటల్లోనే నిందితుడి అరెస్టు.. సొత్తు స్వాధీనం
> మీర్‌పేట్ పిఎస్ పరిధిలో విషాదం

పట్టపగలే ఇంట్లో వివాహిత దారుణహత్య

హైదరాబాద్ (సరూర్‌నగర్), నవంబరు 12, ప్రభాతవార్త: హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఓ వివాహిత పట్టపగలే దారుణ హత్యకు గురైంది. ఇంట్లో ఉన్న ఆమెపై దాడి చేసి నోటికి టేప్ అతికించిన నిందితుడు బంగారు ఆభరణాలను చోరీ చేసి వెళ్లే క్రమంలో ఆమె అరవడంతో ఇస్త్రీ పెట్టెతో మోది కిరాతకంగా హత్య చేశాడు. చోరీకి వచ్చి ఏకంగా హత్యకు పాల్పడిన నిందితుడు హతురాలు నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లోనే ఉంటుండం సంచలనమైంది. నేరానికి పాల్పడే సమయంలో గుర్తు పట్టకుండా ఉండేందుకు హెల్మెట్ ధరించి వచ్చిన నిందితుడు ఎట్టకేలకు పోలీసులకు అదే అపార్ట్‌మెంట్‌లో చిక్కడం గమనార్హం. విద్యాధికుడైన నిందితుడు ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడేందుకు ఈ ఘాతుకానికి పాల్పడగా పోలీసులు కేవలం 24 గంటల్లోనే ఈ హత్య కేసు మిస్టరీని ఛేదించి నిందితుడిని అరెస్టు చేయడంతో పాటు చోరీకి గురైన ఆభరణాలన్నింటినీ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. సంచలనం సృష్టించిన హత్యోదంతం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డు సమీపంలోని ధాతునగర్‌లోనున్న శ్రీలక్ష్మీ అపార్ట్‌మెంట్ లో అనిత (34), అరుణ్ దంపతులు తమ పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. అదే అపార్ట్‌మెంట్‌లోనే మరో ఫ్లాట్‌లో గడ్డ రాజ్‌కుమార్ (41) అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అయితే షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి రాజ్‌కుమార్ దాదాపు 4 కోట్ల వరకు నష్ట పోయాడు. ఈ క్రమంలో చాలా మంది వద్ద అప్పులు చేసి చెల్లని చెక్కులు ఇచ్చిన కారణంగా రెండు కేసులు కూడా నమోదయ్యాయి. అయితే ఆర్థిక సమస్యల నుండి బయట పడేందుకు అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న అనితపై అతని దృష్టి పడింది. ఈ నేపథ్యంలో దొంగతనం చేయాలని నిర్ణయించుకొని బుధవారం మధ్యాహ్నం ఎవరూ గుర్తు పట్టకుండా ఉండేందుకు హెల్మెట్ ధరించి లేని అనిత ఫ్లాట్ వద్దకు వచ్చి డోర్ తెరవగానే ఆమెను నెట్టివేసి ఒంటిపైనున్న బంగారు మంగళసూత్రం, ఆభరణాలను, గాజులను లాకున్నాడు. బాధితురాలు గట్టిగా అరవగా నిందితుడు ఆమెను ఇస్త్రీ పెట్టెతో మోదాడు. దీంతో రక్తసిక్తమైన అనిత రక్తపు మడుగులో కుప్పకూలింది. సాయంత్రం ఇంటికి వచ్చిన పిల్లలు గమనించి తండ్రికి సమాచారం అందించగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలో దిగిన పోలీసులు పంచనామా నిర్వహించి విచారణ ప్రారంభించారు. సంఘటనా స్థలాన్ని ఆదిభట్ల ఏసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ శోభన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పట్టపగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వివాహిత హత్యకు గురవడాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు అన్ని కోణాల నుండి కేసును దర్యాప్తు చేశారు. అయితే హత్య చేసి తాపీగా ఇంట్లోనే ఉన్న నిందితుడు గడ్డ రాజ్‌కుమార్‌ను పోలీసులు సిసి పుటేజీలను పరిశీలించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడి వద్ద నుండి హతురాలి బంగారు మంగళసూత్రం, గాజులతో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. కేసును 24 గంటల్లోనే ఛేదించిన ఇన్స్‌పెక్టర్ శోభన్, డిఐ మట్టం రాజుతో పాటు సిబ్బందిని ఏసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి అభినందించారు. నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



అనిత (ఫైల్)

ఇంటర్ విలీనానికి ఎఐవైఎఫ్ వ్యతిరేకం

♦ సమాఖ్య సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర

వాదరాబాద్.నవంబరు 12, ప్రభాతవార్త : తెలంగాణలో ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి 10+2 విధానాన్ని అమలు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్ణయాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) వ్యతిరేకిస్తోందని ఏఐవైఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే రేవంత్ సర్కార్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణలను మేము వ్యతిరేకించడం లేదని, కానీ దశాబ్దాలుగా లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యకు పునాదిగా నిలుస్తున్న ఇంటర్మీడియట్ వ్యవస్థను కేవలం పరిపాలనా మార్పుల పేరుతో రద్దు చేయడం సరైన విధానం కాదన్నారు. కాంట్రాక్ట్, గెస్ట్ అధ్యాపకులతో పాటు ప్రైవేట్ కళాశాలల సిబ్బంది ఉద్యోగ భద్రతను కూడా ప్రభుత్వం విస్మరించకూడదన్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల విలీనం పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను కేంద్రీకరిస్తే పేద విద్యార్థులు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థపై తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి, విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి,యువజన సంఘాలతో విస్తృత చర్చ నిర్వహించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలని కల్లూరి ధర్మేంద్ర డిమాండ్ చేశారు.

కదం తొక్కిన విద్యార్థులు

♦ నల్ల బ్యాడ్జీలతో తిరుగుబాటు ప్రదర్శన

♦ ఎల్బీనగర్‌లో ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో భారీ నిరసన

ఎల్.బి.నగర్, నవంబర్ 12 ప్రభాతవార్త: అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన రూ.8 వేల కోట్లు విడుదల చేయడానికి ఎందుకు వెనుకాడుతోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. సర్కార్ తీరుతో లక్షలాది మంది విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కదం తొక్కారు. నల్ల బ్యాడ్జీలు ధరించి వేలాది మంది విద్యార్థులు గురువారం ఎల్బీనగర్‌లో భారీ తిరుగుబాటు ప్రదర్శన నిర్వహించారు. 14 లక్షల మంది



విద్యార్థులతో కలిసి ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్.కృష్ణయ్య

విద్యార్థులకు సంబంధించిన రూ.8వేల కోట్ల ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రబుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థుల సంఘం కన్వీనర్ కడారి శివకుమార్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నీల వెంకటేష్ నాయకత్వంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రబుత్వం బడ్జెట్‌లో నిధులు ప్రకటించినా ఇప్పటివరకు ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ప్రైవేటు కళాశాలలతో పాటు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు కూడా ఫీజులు చెల్లించే వరకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని విమర్శించారు. ఫీజుల కోసం విద్యార్థుల

రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిల విడుదలకు డిమాండ్

ద్రువపత్రాలు నిలిపివేయరాదని న్యాయస్థానాలు ఆదేశించినా అమలు కావడం లేదన్నారు.

స్కాలర్‌షిప్‌లు పెంచాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ అనేది పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే గొప్ప పథకమన్నారు. ఫీజులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి కళాశాలలు ఫీజులు వసూలు చేయకుండా చూడాలని, స్కాలర్‌షిప్‌లను రూ.5వేల నుంచి రూ.20 వేల వరకు పెంచాలని కోరారు. సర్టిఫికెట్లు నిలిపివేసిన కళాశాలలపై చర్యలు తీసుకుని విద్యార్థులకు వెంటనే అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లాపల్లి అంజి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్, బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షుడు అనంతయ్య, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, అంజిగౌడ్, సిద్ధప్పయాదవ్ పాల్గొన్నారు.



అమెరికా దెబ్బకు వణికిపోతున్న కిమ్

♦ 54యేళ్ల తర్వాత రాజ్యాంగం మార్చి సంచలన నిర్ణయం!

ప్యాంగ్‌యాంగ్, నవంబరు 12: ఎప్పుడూ అణుబాంబుల పేరుతో ప్రపంచ దేశాలను భయపెట్టే ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ఇప్పుడు అమెరికా దెబ్బకు వణికిపోతున్నారు. ఏ క్షణమైనా అగ్రరాజ్యం తనపై విరుచుకుపడొచ్చన్న ఆందోళనతో 54 యేళ్ల తర్వాత దేశ రాజ్యాంగాన్ని మార్చేసి సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఒకవేళ అమెరికా దాడిలో తన ప్రాణాలకు ఏమైనా జరిగినా, శత్రువులపై అణుదాడి ఆగకూడదన్న వ్యూహంతో కిమ్ కొత్త చట్టాలను తెరపైకి తెచ్చారు. ఇటీవలి కాలంలో అమెరికా దూకుడు చూస్తుంటే కిమ్‌కు కంటిమీద కునుకు కరువైనట్లు స్పష్టమవుతోంది. ఈ యేడాది ఫిబ్రవరిలో టెహ్రాన్‌పై అమెరికా జరిపిన మెరుపు దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం, ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా ఆ దేశ అణు స్థావరాలను నేలమట్టం చేయడం కిమ్‌ను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒకవైపు తనతో భేటీ అవుతానని చెబుతూనే, ఉత్తర కొరియా అణు ఆయుధాలను పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూస్తున్నారు. ఈ క్రమంలోనే అమెరికా ఎప్పుడైనా తమపై యుద్ధం ప్రకటించవచ్చన్న అనుమానంతో కిమ్ ముందుజాగ్రత్త చర్యలకు దిగారు.

తాను లేకపోయినా అణు క్షిపణులు పేల్చాల్సిందే..

ఈ నెల 11న విడుదలైన కొత్త రాజ్యాంగంలో కిమ్ తన అణు ఆయుధాల కమాండ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఇప్పటివరకు అణుబాంబు ప్రయోగించే అధికారం కేవలం కిమ్ చేతిలో మాత్రమే ఉండేది. కానీ కొత్త రాజ్యాంగం ప్రకారం.. అణు దళాల బాధ్యతను 'స్టేట్ అఫైర్స్ కమిషన్'కు అప్పగించారు. దీనికి కిమ్ చైర్మన్‌గా ఉన్నప్పటికీ, తన తర్వాత అణు ఆయుధాలను ఎవరు నియంత్రించాలో నిర్ణయించే అధికారాన్ని ఆయన తన వద్దే ఉంచుకున్నారు. అమెరికా దాడిలో తనకు ఏమైనా జరిగినా, ఉత్తర కొరియా అణు క్షిపణులు ఆగకుండా ప్రతీకారం తీర్చుకోవాలన్నదే ఈ మార్పు వెనుక ఉన్న అసలు ఉద్దేశం. ప్రస్తుతం 50 అణు ఆయుధాలు కలగిన ఉత్తర కొరియా, 2030 నాటికి ఆ సంఖ్యను 90కి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది.

కార్మికుల ఆందోళన

వేతనాలు పెంచాలని డిమాండ్



జిల్లా ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సైఫాబాద్, నవంబరు 12 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆస్పత్రులు, ఇంటిగ్రేటెడ్ హాస్పటల్ ఫెసిలిటి మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (ఐహెచ్ఎఫ్ఎంఎస్) విధానం కింద పనిచేస్తున్న బెడ్ సైడు కాంట్రాక్టు శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది కార్మికులు కింగ్‌కోఠిలోని జిల్లా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం కార్మికులు ఆసుపత్రి ఎదుట ధర్నాలో పాల్గొని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.పార్వతి మాట్లాడుతూ రోజురోకు నిత్యావసర వస్తువుల ధరలు విపరితంగా పెరిగిపోతున్నాయని, ఈ ధరలకు అనుగుణం కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. తక్షణమే కనీస వేతనం 26వేలకు పెంచాలని, 23 సెలవు దినాలు ఇవ్వాలని, బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షురాలుఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ నిర్మలా రాజారామ్

లాలాగూడ రైల్వే ఆస్పత్రికి

ఆధునిక సదుపాయాలు

రూ.1.30 కోట్లతో ప్రధాన ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

తార్నాక, నవంబర్ 12 ప్రభాతవార్త : లాలాగూడ రైల్వే ఆస్పత్రిలో వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరిచారు. ఇందులో భాగంగా రూ.1.30 కోట్ల వ్యయంతో ఆధునికరించిన ప్రధాన ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఐదో వార్డును గురువారం ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ ఈ సదుపాయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మలా రాజారామ్ మాట్లాడుతూ, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య మౌలిక సదుపాయాల ఆధునికీకరణ ఎంతో అవసరమన్నారు. రైల్వే లబ్ధిదారుల సంక్షేమం పట్ల దక్షిణ మధ్య రైల్వే నిబద్ధతకు ఈ కార్యక్రమం నిదర్శనమని పేర్కొన్నారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మ మాట్లాడుతూ, మారుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా ఆసుపత్రుల్లో సదుపాయాలను నిరంతరం ఆధునికీకరించడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందించవచ్చని తెలిపారు. లాలాగూడ కేంద్ర ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పద్మ స్వాగతోపన్యాసం చేశారు.

గిగ్ కార్మికులతో మంత్రి వివేక్ భేటీ

హైదరాబాద్, నవంబరు12, ప్రభాతవార్త: రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గురువారం గిగ్ వర్కర్లతో సమావేశమయ్యారు. కొండాపూర్‌లోని యుపిజెడ్ వైలో గిగ్ వర్కర్లతో కలిసి భోజనం చేసిన మంత్రి.. వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. సమావేశంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫారం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు

తక్షణమే ఏర్పాటు చేయాలి : బిపిటిఎంఎం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న భారతీయ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ (బిపిటిఎంఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి

చిక్కడపల్లి నవంబర్ 12 (ప్రభాతవార్త): ప్రైవేటు రవాణా రంగంలో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ (బీపీటీఎంఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేసారు. గురువారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ బి ఎం ఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. కిరణ్‌రెడ్డి, ఆలిండియా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. పెంటయ్య గౌడ్‌తో కలిసి మాట్లాడారు. ఈ మేరకు కార్మికుల సమస్యల పరిష్కారానికి 18 ప్రధాన డిమాండ్లను ప్రతిపాదించింది. ప్రైవేటు రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డుతోపాటు అన్ని రకాల లైసెన్సుల ప్రక్రియను సరళతరం చేయాలని సంఘం విజ్ఞప్తి చేసింది. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట డ్రైవర్ల కోసం విశ్రాంతి గృహాలు, రాయితీ భోజనశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరింది. జాతీయ రహదారులపై ప్రైవేటు రవాణా వాహనాలకు టోల్ రాయితీలు కల్పించాలని, ఒక దేశం.. ఒక పన్ను విధానాన్ని అమలు చేయాలని పేర్కొంది. టాటా, ఉబర్, ర్యాపిడో వంటి సంస్థల ద్వారా నిర్వహిస్తున్న రవాణా సేవల్లో ప్రైవేటు వాహనాల వినియోగాన్ని నియంత్రించాలని, డ్రైవర్లకు ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేసింది. డ్రైవర్లకు ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించడంతోపాటు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షలు, సహజ మరణం సంభవిస్తే రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరింది. ప్రతి డ్రైవర్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల వరకు వైద్య బీమా సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఆర్టీఓ, పోలీసు శాఖల ద్వారా డ్రైవర్లపై జరుగుతున్న వేధింపులు, అధిక జరిమానాల విధింపును అరికట్టాలని కోరారు. డిమాండ్ల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా బీపీటీఎంఎం ఉద్యమాన్ని కొనసాగిస్తుందని సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తమ ప్రతినిధులను చర్చలకు ఆహ్వానించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు రవాణా కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు.

విసికి వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు

అత్తాపూర్ నవంబరు 12.ప్రభాతవార్త : అగ్రికల్చర్ యూనివర్సిటీ విసిపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధిత ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ ధర్నా చౌక్‌లో గురువారం ప్రొఫెసర్లు, విద్యార్థులు రిలే దీక్ష చేపట్టారు. బాధిత మహిళా ప్రొఫెసర్‌కు మద్దతుగా విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ ఎస్టీ సంఘం సెక్రటరీ జనరల్ మేడి రమేష్ పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పారదర్శకంగా ముందుకు తీసుకు వెళ్తున్న ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చే విధంగా ఎవ్వరూ వ్యవహరించిన మంచిది కాదన్నారు. విచారణ పారదర్శకంగా సాగాలంటే వీసీకి యూనివర్సిటీ పోలీసులపై ఉన్న అజమాయిషీ అధికారాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

శిబిరం వద్ద వాగ్వాదం

అంతకముందు మరోవైపు దీక్షా శిబిరం వద్ద బాధిత ప్రొఫెసర్లకు మద్దతుగా వచ్చిన వారికి, వీసీ మద్దతుదారులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఉద్రిక్తత నెలకొనగా పోలీసులు వీసీ మద్దతుదారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్య చేతికి స్వల్ప గాయమైంది.అనంతరం ప్రొఫెసర్లను పోలీసులు అరెస్టు చేసి కంచన్‌బాగ్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.



నిరసనలో బీజేపీ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి,అంజిరెడ్డి

వీసీని కాపాడేందుకు ప్రభుత్వం యత్నం

వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీని కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీజేపీ ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, అంజిరెడ్డి ఆరోపించారు. ప్రొఫసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి వచ్చి బాధితురాలకి ఆమె మద్దతు తెలుపుతున్నా ప్రొఫెసర్, విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతు బాధితులకు న్యాయం జరుగాలంటే జూడిషల్ ఎంక్వయిరీ జరుపుకోవాలని అన్నారు. వీసీకి అసిస్టెంట్ ప్రొఫెసర్ మధ్య చాల మంది అధికారులు ఉంటారని తెలిపారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ తాము పోరాడుతామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టాసా అధ్యక్షుడు పవన్ చంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి సౌజన్య, ఉపాధ్యక్షుడు కమలాకర్, సహాయ కార్యదర్శి పరమేష్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.జయరాం, గౌరవ అధ్యక్షుడు రాజు, విద్యార్థి నాయకుడు రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంబైలో దారుణం

రైలు నుంచి యువతి గెంటివేత

ముంబై, నవంబరు 12: ముంబై లోకల్ ట్రైన్‌లో దారుణం జరిగింది. అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని ప్రతిఘటించిన మహిళను ఓ వ్యక్తి కదులుతున్న రైలు నుంచి కిందకు తోసేశాడు. ఈ ఘటనలో ఆమె ఎడమ చేతిని కోల్పోవడమే కాకుండా, తలకు తీవ్ర గాయాలయ్యాయి.దీంతో మహిళల భద్రతపై మరోసారి తీవ్ర ఆందోళనను రేకెత్తించింది.నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బోరివలీ నుంచి విరార్ వైపు వెళ్తున్న మహిళపై యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె దాడి చేసింది. దీంతో నిందితుడు ఆమెను ప్లాట్‌ఫాం వైపు బలంగా తోసేశాడు. దీంతో ఆమె ప్లాట్‌ఫాం, రైలు మధ్య ఉన్న ఖాళీలో పడిపోయింది. ఆమె పైకి ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగానే రైలు కదలడంతో, ఆమె ఎడమ చేయి చక్రాల కింద నలిగి మోచేతి కింది నుంచి తెగిపోయింది.

హెల్మెట్ లేకుంటే బీమా ఇవ్వరా?

బాధితులకు రూ.3.20 కోట్ల పరిహారం

ఇండోర్ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తీర్పు

ఇండోర్, నవంబరు 12: రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోయిన ఓ కుటుంబానికి భారీ ఊరట లభించింది. ఇండోర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శక్తి సింగ్ చౌహాన్ కుటుంబానికి రూ.3.20 కోట్ల పరిహారం చెల్లించాలని కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఈ మొత్తానికి ఏడాదికి 6 శాతం వడ్డీ కూడా చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశించింది. ప్రమాద సమయంలో మృతుడు హెల్మెట్ ధరించలేదని, బైక్‌పై ముగ్గురు ప్రయాణిస్తున్నారని బీమా సంస్థ వాదించినప్పటికీ కోర్టు వాటిని అంగీకరించలేదు. 2024 డిసెంబర్ 29న శక్తి సింగ్ చౌహాన్ తన మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ఇండోర్‌లోని రౌ ప్రాంతంలో ఎస్‌రాక్ స్కూల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బస్సు అతని బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శక్తి సింగ్ చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో కుటుంబ సభ్యులు తగిన పరిహారం కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే పరిహారం చెల్లించకుండా ఉండేందుకు బీమా కంపెనీ పలు అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ప్రమాద సమయంలో మృతుడు హెల్మెట్ ధరించలేదని, బైక్‌పై ముగ్గురు ఉన్నారని, ప్రమాదాన్ని నివేదించడంలో ఏడు రోజుల ఆలస్యం జరిగిందని వాదించింది. దీంతో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి అవాన్ మహమ్మద్ బీమా సంస్థ వాదనలను తోసిపుచ్చారు. మృతుడి నిర్లక్ష్యాన్ని నిరూపించడంలో బీమా కంపెనీ విఫలమైందని స్పష్టంచేశారు. మొత్తం రూ.3,20,60,582 పరిహారాన్ని 6శాతం వార్షిక వడ్డీతో చెల్లించాలని ఆదేశించారు.

దాడికి పాల్పడిన ముగ్గురి అరెస్టు

పుణె, నవంబరు 12: మహారాష్ట్ర పుణె జిల్లాలో చిన్న వివాదం ఓ యువకుడి జీవితాన్ని ఛిద్రం చేసింది. ముగ్గురు మైనర్లు మారణ ఆయుధాలతో దాడి చేయడంతో 26 యేళ్ల యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఖేడ్ తాలూకాలోని టిన్హవాడి గ్రామానికి చెందిన శివం బాలాసాహెబ్ కర్మారే (26) ఇటీవల తన బైక్‌పై రాజ్గురునగర్‌లో ప్రయాణిస్తున్నాడు. వాహనం ఓవర్‌టేక్ విషయంలో వాగ్వివాదం జరిగింది. ముగ్గురు మైనర్లు మార్గమధ్యంలో శివంను అడ్డగించి మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారు. దీంతో శివం తల, వీపు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. అతని మూడు వేళ్లు తెగిపోగా, ఒక చేయి పూర్తిగా చచ్చుబడిపోయింది. అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించగా, వైద్యులు సుమారు 700 కుట్లు వేశారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది.బాధితుడి సోదరుడు ఆదిత్య కలురాం కర్మారే ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. రాక్షేవాడి ప్రాంతంలో దాక్కున్న ముగ్గురు మైనర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ సంతోష్ గిరిగోసవి తెలిపారు.

1001 కలశాలతో కోదండ రాముడికి అభిషేకం

శంషాబాద్ నవంబరు12,ప్రభాతవార్త : శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి 70వ తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా శంషాబాద్ ముచ్చింతల్ చేపట్టిన ఐదు రోజుల యతీంద్ర సప్తతి వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు ముచ్చింతల్‌లోని శ్రీరామనగరంలో కొలువుదీరిన కోదండ రామస్వామికి ఏకోత్తర సహస్ర (1001) కలశాలతో అభిషేకాన్ని వైభవంగా చేశారు. వేలాది మంది భక్తులు ఈ అపురూప ఘట్టాన్ని వీక్షించి భక్తిపారవశ్యంలో మునిగి పోయారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేలాది గ్రామాలు, ఆలయాలు, భక్తుల గృహాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలు, విదేశాల్లోని ప్రధాన నగరాలకు ఈ కలశాలను తీసుకెళ్లారు.

అభిషేకం విశిష్టతను వివరించిన చినజీయర్ స్వామి

పూజా మందిరాల్లో అభిషేకాన్ని బహిరంగంగా నిర్వహించడం వెనుక ఉన్న చారిత్రక నేపథ్యాన్ని చిన్న జీయర్ స్వామి ఈ సందర్భంగా వివరించారు. 1993లో దీపావళి మరుసటి రోజు సీతానగరం ఆశ్రమంలో పెద్ద జీయర్ స్వామి దశాబ్దాలుగా ఆరాధించిన, చిన్న జీయర్ స్వామికి వారసత్వంగా వచ్చిన విగ్రహాలు చోరీకి గుర య్యాయి. తన ఆరాధ్య దైవాలు దూరం కావడం తో తీవ్ర మనోవేదనకు గురైన స్వామి, భగవం తుడు తిరిగి ఆశ్రమానికి చేరుకునే వరకు అన్నపానీయాలు స్వీకరించకూడదని సంకల్పించారు. మూడో రోజు పోలీసు అధికారి కోటేశ్వరరావు విగ్రహాలను గుర్తించి తిరిగి తీసుకువచ్చారు. ఈ ఘటనకు గుర్తుగా అప్పటి నుంచి అభిషేకాన్ని బహిరంగంగా నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోందని స్వామి వివరించారు.



రామునికి అభిషేకం చేస్తున్న చిన్న జీయర్ స్వామి



కలశాలతో వేద పండితులు

ఆగమ పద్ధతిలో అభిషేకం

తొలినాళ్లలో 108 కలశాలతో నిర్వహించిన ఈ అభిషేకాన్ని 1995 నుంచి 1001 కలశాలతో నిర్వహిస్తున్నారు. పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానాన్ని అనుసరించి అత్యంత నియమ నిష్ఠలతో ఈ కార్యక్రమం జరుగుతోంది. ఆగమ శాస్త్రం నిర్దేశించిన విధంగా కలశాలను మనుష్యపదం, దేవపదం, బ్రహ్మపదం అనే మూడు ఆకృతుల్లో అమర్చారు. పవిత్ర నదులు, సముద్రాల నుంచి సేకరించిన జలాలతో పాటు నిర్దిష్ట పవిత్ర ద్రవ్యాలను కలిపి స్వామివారికి అభిషేకం నిర్వహించారు.

వైభవంగా చిన్న జీయర్ స్వామి యతీంద్ర సప్తతి ఉత్సవాలు

కోటేశ్వరరావుకు సత్కారం

1993లో విగ్రహాల పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారి కోటేశ్వరరావును చిన్న జీయర్ స్వామి ప్రత్యేకంగా సత్కరించారు. అభిషేకానికి వినియోగించే ముందు ప్రతి కలశాన్ని కోటేశ్వరరావు స్పృశించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేకతగా నిలుస్తోంది.ప్రముఖ పారిశ్రామికవేత్త జూపల్లి రామేశ్వరరావు తన కుటుంబ సభ్యులతో కలిసి యతీంద్ర సప్తతి ఉత్సవాలకు సహకారం అందించారు. ఐదు రోజులపాటు ఆధ్యాత్మిక వైభవంతో సాగిన ఉత్సవాలు 1001 కలశాభిషేకంతో భక్తులకు మధురానుభూతిని మిగులుస్తూ ముగిశాయి.

నాగుల చవితి



నాగుల చవితి ఆచా రించడానికి ఒక శుభ దినం. కార్తీక మాసంలో దీపావళి అమావాస్య తర్వాత నాల్గవ రోజు (చతుర్థి) నాగుల చవితి జరుపుకుంటారు. నాగ చతుర్థి తర్వాత నాగ పంచమి, నాగశ్మి జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాలలో శ్రావణ మాసంలో కూడా జరుపుకుంటారు. నాగుల చవితి, నాగదేవతలను (సర్పదేవతలు) ఆరాధించే పండుగ, ప్రాధానంగా మహిళల పండుగ,నాగుల చవితిని వివాహితద స్త్రీలు తమ పిల్లల క్షేమం కోసం జరుపు కుంటారు. చవితి పండుగ సందర్భంగా మహిళలు ఉపవాసం ఉండి నాగపూజను ఆచారిస్తారు. భక్తులు వల్మీకం లేదా పట్టు (పాముల గుంటలు) వద్ద సర్ప దేవతకు పాలు మరియు డై ఫూట్స్ సమర్పిసారు. నాగచతుర్థి రోజున అష్టనాగ్ (ఎనిమిది హుడ్డ్ కోబ్రా) పూజి స్తారు. కొంతమంది ఇంట్లో నాగదేవత విగ్రహం పెట్టి పూజలు చేస్తారు. కానీ కొన్ని ప్రదేశాలలో భక్తులు పుట్ట వద్దకు వెళ్లి నైవేద్యమం సమర్పించి ఇతర పూజలు చేస్తారు. పాలు, కుంకుమ, పసుపు, విభూతి, బెల్లం మరియు నల్లనువ్వుల మిశ్రమంతో చేసిన తీపి పదార్థాలతో బెల్లం, తెల్ల నువ్వులు, ఉడకబెట్టిని మిశ్రమంతో తయారు చేసిన పుట్టలను లేదా చీమల కొండలకు ప్రజలు పూజ చేస్తారు. బియ్యం, నల్ల నువ్వులు చివరకు గుడ్లు ప్రజలు ఈ వస్తువులను చీమల కొండలో వేస్తారు. నైవేద్యాలు ముగించిన తరవాత, ప్రజలు పుట్ట నుంచి కొంచెం మట్టిన తీసుకొని చెవుల వెనుక పెట్టు కుంటారు. నాగులు చవితి జరుపుకోవడం వల్ల వారి ఇంటి కుటుంబ జీవితంఒలో అన్ని ఒత్తిడులు తొలగి పోతాయని ప్రజలు నమ్ముతారు. ప్రజలు సాధారణంగా దేవాలయాలలో ఉన్న పుట్టకు లేదా వారి ప్రాంతంలో ఉన్న పుట్టుకు మరే ఇతర ప్రదేశంలోనైనా ఈ ఆచారాలను చేస్తారు. ◻

జ్ఞాపకాల్ని రాస్తారా?

ఎప్పుడైనా ఫొటో ఏదైనా ఎక్కడిదైనా ఎవరిదైనా ఒక్కోటీ ఎన్నెన్ని మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తుందో అన్నట్టూ దానిలో మనల్ని ఎక్కువ ఆకర్షించేదంటే 'క్యాండిడ్ పిక్'లనే చెబుతాం కదూ. మిగతా ఫొటోలంటే ఆ సందర్భానికి గుర్తుగా తీసుకుంటాం. వాటిలోనూ ఆనందం కనిపించొచ్చు కానీ.. ఎంతైనా తెలిసి దిగేవవి. క్యాండిడ్ పిక్స్ అలా కాదు. ఎదుటి వ్యక్తి క్లిక్‌మనిపిస్తున్నారని తెలియదు. దీంతో అసలైన భావోద్వేగం కనిపిస్తుంది. చూడగానే ఆ క్షణాలన్నీ మెదడులో రీల్‌లా తిరుగుతాయి. ఇవంటే కెమెరాలో బంధించాం కాబట్టి కళముందుంటాయి. కానీ కొన్ని ఆనందక్షణాలు, అనుభూతులు కెమెరా కంటికి చిక్కవు. అయితేనేం మనసులో బలమైన ముద్ర వేస్తాయి. స్నేహితుల్నో, బంధువుల్నో కలిసినప్పుడు చూడండి.



ఎన్నెన్ని జ్ఞాపకాలను నెమరు వేసుకుంటామో. అవన్నీ ఆల్బమ్‌లో కనిపించవు. మెదడు పొరల్లో మాత్రం తిష్ఠ వేసుకుని కూర్చుంటాయి. వాటి గురించి మాట్లాడుతోంటే సమయమూ తెలియదు. మనసూ నిండుతుంది. ఆ వేళ.. ఒత్తిడి, ఆందోళన ఎటు పారిపోయాయో కూడా తెలియదు. అందుకే మనసు బాలేనప్పుడు అయినవాళ్లు దగ్గరుంటే బాగుంటుంది అనిపిస్తుంది. కానీ ఈ బిజీ జీవితంలో అన్నిసార్లూ వాళ్లని కలవడం సాధ్యమేనా? కెరియర్ పెళ్లి పేరుతో ఎక్కడెక్కడో స్థిరపడతాం. అందుకే వాటిని కాగితం మీద పెట్టండి. వాటన్నింటినీ తలుచుకుంటూ, ఆ క్షణాల్ని తిరిగి అనుభవిస్తూ రాస్తాం కదా! అదే ఆనందాన్ని అనుభూతి చెందుతాం. దాన్ని మాటల్లో చెప్పడం అంత సులువేం కాదు.. దీంతో ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తాం.

ఇది సృజనాత్మ కతను పెంచే మార్గం కూడా. మనసూ కుదుటపడుతుంది. ముఖ్యంగా వ్యక్తుల విలువ తెలుస్తుంది. మరి రాస్తారా ఆ జ్ఞాపకాలని? వెళ్లొస్తారా మళ్లోసారి ఆ ఆనంద క్షణాల్లోకి. ◻

సైనస్‌కు శొంఠి !

సైనస్ మహా ఇబ్బంది కరమైంది. తరచూ జలుబు, తలనొప్పితో అవస్థపెడుతుంది. చల్లదనం సోకినా, సరిపడని పదార్థాలు తిన్నా క్షణాల్లో శ్వాస ఇబ్బంది, ముక్కు దిబ్బళ్లు వచ్చే స్తాయి. ఈ చలి కాలం దాన్నుంచి బయట పడాలంటే ఇలా చేసి చూడండి.

వేడివేడిగా... సైనస్‌తో బాధపడే వారు ఫ్రిజ్‌లోవి తినొద్దు, తాగొద్దు. అన్నం, ఫలహారాలూ ఏవైనా వేడిగా తీసుకోవాలి. సూప్, పాలు, టీ.. ఇలా ఏదైనా వెచ్చగా తాగుతుంటే.. శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల నుంచి ఉపశమనం కలుగుతుంది. శొంఠి, ధనియాలతో కషాయం చేసి తాగితే ఇంకా మంచిది.



ఇట్రస్ ఫ్రూట్స్.. ఆయా కాలాల్లో దొరికే పండ్లు తింటుండాలి. ముఖ్యంగా విటమిన్ సి ఎక్కువగా ఉన్న నారింజ, నిమ్మ, ద్రాక్ష, కివి లాంటివి రోగనిరోధకశక్తిని పెంచు తాయి. ఈ ఆమ్లఫలాల్లో యాంటీ ఇన్‌ఫమేటరీ, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్నందున జలుబు నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

తేనె రోజూ ఉదయాన్నే గ్లాసుడు గోరువెచ్చటి నీళ్లలో చెంచా తేనె, పావు చెంచా నిమ్మరసం వేసుకుని తాగుతుంటే సైనస్ బాధ నుంచి బయటపడొచ్చు. నీళ్లు ఎంత ఎక్కువ నీళ్లు తాగితే శరీరంలో ఉన్న కల్మషాలు అంత తగ్గిపో తాయి. రోజుకు 2లీటర్ల చొప్పున నీళ్లు తాగుతుంటే సైనస్ తగ్గే అవకాశం ఉంది.

అల్లం, వెల్లుల్లి.... వీటిలోని యాంటీ ఫంగల్, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు నొప్పి, వాపు, అలర్జీలను తగ్గిస్తాయి. కనుక అల్లం, వెల్లుల్లి ఏదో రూపంలో తింటుంటే సైనస్ నుంచి ఉపశమనం కలుగుతుంది. ◻

కెరీర్‌ను ఆస్వాదిస్తూ..



సమాజంలో ఉద్యోగం మనకు ఒక హోదా తెచ్చి పెడుతుంది. ఆర్థిక భరోసా ఇస్తుంది. వృత్తి జీవితాన్ని ఎంతగా ఆస్వాదిస్తే.. కెరీర్‌లో అంతగా ఎదగగలుగుతాం. అయితే కొందరు మాత్రం తాము చేసే ఉద్యోగం విషయంలో అసంతృప్తికి లోనవు తారు.భారంగా కెరీర్‌ను లాక్కొస్తుంటారు. నిజానికి దీనివల్ల కెరీర్‌లో ఉన్నతి సాధించకపోగా.. అప్పటి వరకు గడించిన ఉద్యోగానుభవం పైనా రిమార్క్ పడే అవకాశాలు కనిపిస్తు న్నాయి. అందుకే ఈ అసంతృప్తికి కారణమేంటో తెలుసుకొనివాటిని దూరం చేసుకోమంటున్నారు. పని ఎంత చేసినా కొంతమందికి తగ్గ ప్రతిఫలం దక్కదు. ఫలితంగా ఎంత చేసిన వృథానే అన్న భావన వారి మనసులో మొదలవుతుంది. ఇదీ ఉద్యోగంపై ఆసక్తి తగ్గడానికి, కెరీర్ అసంతృప్తితో ముందుకు సాగడానికి కారణం. తక్కువ సంఖ్యలో ఉద్యోగుల సంస్థల్లో అధిక పని భారం పడుతుంటుంది. దీనివల్ల ఒత్తిడి ఎదురవుతుంది. ఇదీ ఉద్యోగంలో అసంతృప్తికి ఓ కారణం తెలుసుకొని వాటిన దైరం చేసుకోవాలి. తక్కువ సంఖ్యలో ఉద్యోగులన్న సంస్థల్లో అధిక పని భారం పడు తుంటుంది. దీనివల్ల ఒత్తిడి ఎదురవుతుంది. ఇదీ ఉద్యోగంలో అసంతృప్తికి ఓ కారణమే అంటున్నారు నిపుణులు. కృత్రిమ మేధ వంటి కొత్త టెక్నాలజీ వల్ల తమ ఉద్యోగానికి ఎక్కడ ముప్పు వాటి నన్న భయం కారణం అవుతుంది. కొంతమంది ఉద్యోగుల విష యంలో తమ పై అధికారుల నుంచి పూర్తి మద్దతు, ఆశించిన ప్రోత్సాహం లభించదు. ఇది కూడా ఉద్యోగంలో అసంతృప్తికి కారణమవుతుందట. ఉద్యోగం చేసే మహిళలకు వర్క్‌లైఫ్ బ్యాలన్స్ ముఖ్యం. ఈ రెండింటినీ సరిగ్గా చేసుకున్న ప్పుడే అటు వ్యక్తిగత జీవితాన్ని, ఇటు కెరీర్‌ను ఆస్వాదిం చగలం. కానీ కొంతమంది మహిళలు పలు కారణాల రీత్యా దీన్ని బ్యాలన్స్ చేసుకోలేకపోతు న్నారు. ఇది వారి వ్యక్తిగత వృత్తిపరమైన జీవితాల్లో సంతృప్తి లేకుండా చేస్తుంది. కారణమేదైనా ఉద్యోగంలో అసంతృప్తి దరి చేరితే అది కెరీర్‌కే ప్రమాదం. అందుకే ఈ అసంతృప్తిని వీలైనంత త్వరగా దూరం చేసుకోవడం మంచిది. ఉద్యోగంలో అసంతృప్తిని దూరం చేసుకోవాలంటే పని వాతావర ణాన్ని ఆహ్లాదకరంగా మార్చుకోవడం ముఖ్యం. ఈ క్రమంలో మీ మనసుకు ప్రశాంతత నిచ్చే మొక్కల్ని, వస్తువుల్ని ఏర్పాటుచేసు కోవడం.. పనికి తగినట్లుగా అనువైన ప్రణాళిక వేసుకోవడం మిమ్మల్ని ప్రోత్సహించే సహోద్యోగులతో స్నేహం చేయడం మేలు చేస్తాయి. కెరీర్‌లో ఎలాంటి లక్ష్యాలు లేకుండా ముందుకు సాగడం వల్ల కూడా ఒక దశలో అసంతృప్తికి లోనవుతుంటాం. అందుకే ఉత్సా హంగా పనిచేయాలంటే కెరీర్‌కి సంబంధించి నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరచుకోవడం ముఖ్యం. విరామం లేకుండా పనిచేయడం వల్ల ఒత్తిడి పెరుగుతుంది. చేసే పనిపై ఆసక్తి తగ్గు తుంది. కాబట్టి మధ్యమధ్యలో విరామం తీసుకోవడం చిన్న చిన్న డెస్క్ వర్కవుట్లు చేయడం వల్ల తిరిగి పునరుత్తేజితం కావచ్చు. అలాగే అప్పుడ ప్పుడూ పని నుంచి స్వల్ప విరామం తీసుకొని కుటుంబంతో కలిసి వెకేషన్లకూ ప్లాన్ చేసుకోవాలి. తిరిగొచ్చాక పనిపై దృష్టి పెట్టచ్చు. ఉద్యోగం భద్రతకు సంబంధించిన భయాల్ని, అసంతృప్తుల్ని దూరం చేసుకోవాలంటే. మారుతోన్న సాంకేతికతల్ని బట్టి కొత్త నైపుణ్యాల్ని నేర్చు కోవడం అత్యుత్తమమైన మార్గం అంటున్నారు. ఇది కొత్త అవకాశాల్నీ అందించడంతో పాటు కెరీర్ అభివృద్ధికీ దోహదం చేస్తుందం టున్నారు. ఇంటిని పనిని సమన్వయం చేసుకోవడం కష్టమే! కానీ ఇటు ఇంట్లో కొన్ని పనుల్లో కుటుంబ సభ్యుల సహాయం తీసుకోవడం, అటు ఆఫీస్‌లో కొలీగ్స్ మద్దతు కోరడం వల్ల ఇది సులువతుందంటున్నారు నిపుణులు. ఎంత పనిచేసినా ఫలితం శూన్యం అనుకునే బదులు.. మీ పనితీరు, సంస్థ అభివృద్ధిలో మీరు పోషించిన పాత్ర గురించి పై అధికారులకు తెలియజేయండి. వాటికి సంబంధించి మీరు రూపొం దించిన నివేదికల్ని వారికి చూపించండి. మీ కష్టాన్నీ వారు తప్ప కుండా పరిగణనలోకి తీసుకుంటారు. తద్వారా మీ కెరీర్‌లో అసంతృప్తి దూరమవుతుంది. అయితే ఇన్ని చేసినా ఫలితం లేకపోతే మీలో అసంతృప్తి అలాగే ఉంటే ఓ సారి నిపుణుల్ని సంప్రదించడం మంచిది. తద్వారా మీకున్న సమస్యల్ని బట్టి మీరు ఉద్యోగం మారాలా? లేదంటే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలేవైనా అనుసరించాలా అనేది తెలుసుకోవచ్చు. ◻

చిట్కా: ✦ఆవాలను నూరి ప్రతిరాత్రి పట్టు వేయవలయును. అరుచి హరించును ✦ బలహీన ముగా వున్నవారు రాత్రిపూట వేడి అన్నములో వేడిపాలు పోసి తెల్ల ఉల్లిపాయలు ముక్కలుగాచేసి వేసి తోడుపోసి ఉదయాన్నే తినవలెను. ✦ మజ్జిగలో కలకండ మిరియాల చూర్ణము కలపి పుచ్చుకొనిని ఉదర రోగములు తగ్గును. ◻

మర్దనతో... !

రోజూ అందం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టే సమయం ఉండక పోవచ్చు. కానీ వారానికి ఒక్కసారైనా ఈ విషయాలపై కొంత సమయం కేటాయించా లంటున్నారు నిపుణులు.

వారానికి ఒక్కసారైనా హెర్బల్ నూనెలతో శరీరానికి మర్దన చేసుకుంటే ఒత్తిడి తగ్గుతుంది.చర్మం కాంతిమంతంగా మారుతుంది.



తీరిక దొరికినప్పుడల్లా ముఖంలో పేరుకున్న మృత కణాలను తొలగించు కునేందుకు స్క్రబ్ చేసుకుంటాం. అలానే వారానికోసారైనా శరీరం మొత్తానికి అంటే.. వీపు, మెడ, కాళ్లకు కూడా స్క్రబ్ అవసరం.డీప్ క్లెన్సింగ్ మిల్క్‌ని అందుకోసం ఉపయోగించచ్చు. పాలు, పంచ దార వంటి.. సహజసిద్ధమైన పదార్థాలనూ వాడచ్చు. చర్మంపై మృతకణాలు పోయి నిగారింపు రావాలంటే కనీసం అప్పుడప్పుడు ముఖానికి ఫేసియల్ అవసరం. అలాగని పార్లర్‌కే వెళ్లాలని లేదు. ఇంట్లో పండ్ల గుజ్జులో కూడా ప్యాక్‌లు వేసుకోవచ్చు. తద్వారా ట్యాన్ పోయి ముఖం తాజాగా కనిపిస్తుంది. ◻

'ఇడుపు కాయితం' టీజర్ లాంచ్



డిసెంబర్ 11న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా 'ఇడుపు కాయితం'. ఈ సినిమాలో ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరో యిన్‌గా నటిస్తోంది. నటుడు విద్యాసాగర్ మాట్లాడుతూ మంచి కుటుంబ కథా చిత్రమిది. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలి. ఈ చిత్రంలో ఇంపార్టెంట్ క్యారెక్టర్ లో నటించే అవకాశం కలగడం సంతోషంగా ఉంది. అన్నారు.నటి విజయ మాట్లాడుతూ ఈ సినిమాలో సర్పంచ్ నవ్య పాత్రలో నటించాను. మహిళ సర్పంచ్ అయితే అధికారం భర్త చెలాయిస్తాడు అంటారు కానీ కాలం మారింది. నటుడు మైమ్ మధు మాట్లాడుతూ మా సినిమా టైటిల్ పై ఆదరణ చూపించారు. శ్రీలత, గడప సాంగ్స్ హిట్ చేశారు. రీసెంట్‌గా బారాత్ సాంగ్ ను ఎంజాయ్ చేశారు. నటుడు వినోద్ బాల మాట్లాడుతూ మా సినిమా ప్రారంభమైనప్పటి నుంచి ఒక పాజిటివ్ వైబ్ మా అందరిలో ఉంది. సినిమా వంద రోజుల వేడుక చేసుకునే దాకా ఈ వైబ్ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నా. నటి చంద్రవ్వ మాట్లాడుతూ ఈ సినిమాలో హీరోయిన్ నాగజ్యోతి తల్లి పాత్రలో నటించాను. ఈ క్యారెక్టర్ గయ్యాలి అనుకుంటారు కానీ చాలా మంచిది. ◻



'డాన్ బాస్కో' టీజర్ లాంచ్

హ్యాండిల్ చేశారు. శ్రీచరణ్ బీజీఎం బాగుంది. మిర్నా ప్రతీ పాత్రకు ప్రాణం పోస్తుంటారు. హీరో రుష్య దత్తా మాట్లా డుతూ.. .. 'మ్యాడ్' డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ వల్లే నాకు మా దర్శకుడు గౌరీ శంకర్ పరిచయం అయ్యారు. నిర్మాత వెంకట్ మమ్మల్ని ఎంతో సపోర్ట్ చేశారు. నిర్మాత వెంకట్ ఉప్పుటూరి మాట్లా డుతూ.. 'డాన్ బాస్కో' ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా టీజర్ అందరికీ నచ్చిందని భావిస్తున్నాం. త్వరలోనే మరిన్ని ప్రమోషనల్ కంటెంట్‌తో ఆడియెన్స్‌ని ఆకట్టుకుంటాం అని అన్నారు. హీరోయిన్ మిర్నా మాట్లాడుతూ.. 'డాన్ బాస్కో'లో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మూడేళ్లుగా నాకు దర్శకుడు శంకర్ తెలుసు. ఆయన ఎంతో అద్భుతంగా నెరేషన్ ఇచ్చారు. ఈ మూవీ కోసం ఆయనెంతో కష్టపడ్డారు. ..డైరెక్టర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ.. 'డాన్ బాస్కో' టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. ట్రైలర్ ఇంత కంటే ఎమోషనల్‌గా ఉంటుంది. ◻

లహరి

'ఇట్లు అర్జున' ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది: అనీష్

ఇట్లు అర్జున్ కథ విన్నప్పుడు మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు ఏమిటి? ఈ కథతోనే మీ తొలి సినిమా చేయడానికి కారణమేంటి?

ఈ కథ విన్నప్పుడు నాకు బాగా నచ్చిన అంశం ఒక మూగవాడి ప్రేమకథ. తన భావాలను మాటల్లో వ్యక్త పరచలేని వ్యక్తి ప్రేమను ఎలా చూపిస్తాడనేది)నాకు చాలా నచ్చింది.

ఈ పాత్ర కోసం ఎలాంటి హోమ్ వర్క్ చేశారు ?

ఈ సినిమా కోసం దాదాపు ఆరు నెలల పాటు వర్క్‌షాప్ చేశాం. బాడీ లాంగ్వేజ్, రియాక్షన్స్, ఎక్స్‌ప్రెషన్స్ .. విషయాలపై డైరెక్టర్ గారికి చాలా క్లారిటీ ఉంది. కొంత సైన్ లాంగ్వేజ్ కూడా ఉపయోగించాం.

ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి పెద్ద స్టార్స్ మీకు సపోర్ట్ చేశారు. ఈ విషయంలో మీపై ఎంత బాధ్యత ఉందని భావిస్తున్నారు?అంత పెద్ద స్టార్స్ వచ్చి మా సినిమా గురించి మాట్లాడటం ఇప్పటికీ నాకు ఒక కలలాగే అనిపిస్తోంది. అంత మంచి సపోర్ట్ లభించడం చాలా ఆనందంగా ఉంది.

సినిమాలో యాక్షన్ ఎలా ఉండబోతోంది?

యాక్షన్‌ను ఇందులో చాలా కొత్తగా డీల్ చేశాం. ఇది ఒక అండర్‌డాగ్ క్యారెక్టర్‌కు తగ్గట్టుగానే యాక్షన్ సన్నివేశాలు ఉంటాయి.

మూగవాడి పాత్ర చేయడంలో మీకు ఎదురైన సవాళ్లు ఏమిటి?



కొన్ని సన్నివేశాల్లో రియాక్ట్ అవ్వడం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. సాధా రణంగా ఒక వ్యక్తి మాట్లాడుతున్న ప్పుడు మనం డైలాగ్‌తో సమాధా నం చెబుతాం. కానీ ఈ పాత్రలో మాట్లాడటానికి అవకాశం ఉండదు.

మీ తొలి సినిమాకే రిలీజ్ డేట్ వాయిదా పడింది. ఆ సమయంలో ఒత్తిడికి గురయ్యారా?చిన్నప్పటి నుంచి నటుడు కావాలనేది నా కల. తొలి సినిమా రిలీజ్ డేట్ ప్రకటించిన తర్వాత అనుకున్న సమయానికి సినిమా విడుదల కాకపోవడంతో కొంత నిరాశ అనిపించింది.

.మీకు వెంకీ కుడుములతో పరిచయం ఎలా ఏర్పడింది?వెంకీకి మా నాన్నతో పరిచయం ఉంది. భీష్మా తర్వాత ఆయనను కొన్ని సజెషన్స్ అడిగేవాడిని. అలా ఒకసారి ఆయన ఈ కథ గురించి చెప్పారు. అప్పటి నుంచి ఈ సినిమా జర్నీ ప్రారంభమైంది. ◻

'మాయలేడి' ఇష్టపడతారని నమ్ముతున్నాం: రాకేష్ వర్రే.



యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా "మాయలేడి". ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. మాయలేడి టైటిల్ కథకు యాప్ట్ గా ఉంటుంది. హీరోయిన్ కు కథలో ఎడ్జ్ ఉంటుంది. అయితే ఇది ఫీమేల్ సెంట్రిక్ మూవీ కాదు. కథకు బాగుంది కాబట్టే మాయలేడి టైటిల్ పెట్టాం. నా క్యారెక్టర్ బేస్ చేసుకుని కూడా టైటిల్ పెట్టుకోవచ్చు. సినిమా చూశాక మీరు కూడా ఈ టైటిల్ కరెక్ట్ అని అనుకుంటారు. నాకు రొమాంటిక్, లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ ఇష్టం. నేను నా ఫ్యామిలీ మెంబర్స్ తో థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేసిన జానర్ కూడా అదే. ప్రేమించుకుందాం రా, బొమ్మరిల్లు, నిన్నే పెళ్లాడతా వంటి సినిమాలను మా కుటుంబ సభ్యులతో కలిసి చూస్తూ ఆనందించాం. నేను కూడా అలాంటి మూవీస్ నే ప్రేక్షకులకు అందించాలని ప్రయత్నిస్తు న్నాను. ప్రస్తుతం బ్లడ్ బాత్ సినిమాలు యాక్షన్ మూవీస్ బాగా వస్తున్నాయి. నా ముందు హీరోగా రెండు ఆప్షన్స్ ఉన్నాయి. నాకు నచ్చిన ఇలాంటి సినిమాలు చేయడం లేదా ట్రెండ్ కు తగినట్లు ఇంటెన్స్ యాక్షన్ మూవీస్ చేయడం. హీరోగా కమర్షియల్ సక్సెస్ వస్తే అప్పుడప్పుడు అలాంటి సినిమాలు చేసినా తప్పులేదు. . ◻

'ఆల్కహాల్' డిసెంబర్ 18న రిలీజ్



విభిన్నమైన కథా చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరో అల్లరి నరేష్ మరో ఆసక్తికం గొలిపే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతు న్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయు క్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆల్కహాల్ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. తాజాగా ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మెహర్ తేజ్ రచించి, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మానవ ప్రవర్తనలోని విభిన్న కోణాలు, నేర ప్రవృత్తి, మనిషి తీసుకునే నిర్ణయాలు వాటి పర్యవసానాల నేపథ్యంలో ఆసక్తికరమైన కథాంశంతో తెరకెక్కుతోంది. ఇప్పటికే విడుద లైన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా అల్లరి నరేష్ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా స్టైలిష్, సరికొత్త లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచుతున్నారు. ఈ చిత్రంలో అల్లరి నరేష్ సరసన రుహానీ శర్మ నటిస్తుం డగా, నిహారిక ఎన్ఎం, సత్య, గిరీష్ కులకర్ణి, హర్షవర్ధన్, చైతన్య కృష్ణ, రవీంద్ర విజయ్, రఘుబాబు, వెంకటేష్ కాకుమాను, కిరీటి దమరాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.◻


'చంద్రయాన్' ప్రి రిలీజ్

ఈ నెల 13న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న హిలేరియస్ అడ్వెంచర్ మూవీరాజు వెడ్స్ రాంబాయి సూపర్ హిట్ తర్వాత నిర్మాత వేణు ఊడుగుల తన సమర్పణలో 'చంద్రయాన్' టైటిల్ తో మరో ఇంట్రె స్టింగ్ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. యాక్టర్ రవి శివతేజ మాట్లాడుతూ ఈ ఏడాది వరుసగా సినిమాలు చేసే అవకాశం నాకు దక్కడం సంతోషంగా ఉంది. మా పేరెంట్స్ కూడా ఇదే కోరుకున్నారు. గోదావరి యాసలో సినిమాల్లో నటించాను. మ్యూజిక్ డైరెక్టర్ హర్ష ప్రవీణ్ మాట్లాడుతూ సిచ్యువేషనల్ కామెడీతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది. నాన్ సెన్స్ గా అనిపించినా ఫన్ ఫీలవుతారు. దర్శకుడు కథ చెప్పినప్పుడే బాగా ఎంటర్ టైనింగ్ గా అనిపించింది. యాక్టర్ బలగం సత్యనారాయణ మాట్లాడుతూ మన యువత తలుచుకుంటే ఏదైనా సాధించగలరు అనే మంచి పాయింట్ ను ఈ సినిమాలో చూపించారు. కొరియోగ్రాఫర్ ఈశ్వర్ పెంటి మాట్లాడుతూ మా సినిమాకు అంతా కొత్త టీమ్ పనిచేశారు. మాలాంటి టీమ్ కు ఒక సపోర్ట్ ఎవరైనా ఉంటే బాగుండును అనుకున్నప్పుడు వేణు ఊడుగుల ముందుకు వచ్చారు. ప్రొడ్యూసర్ పూజారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మీ టెన్షన్ అన్నీ మర్చిపోయేలా చేసే చిత్రమిది. వేణు గారు ఎప్పుడైతే ప్రెజెంట్ చేస్తున్నారో అప్పుడే ఈ సినిమా సక్సెస్ అయినట్లు భావించాలి. ఈ నెల 13న చంద్రయాన్ రిలీజ్ కు వస్తోంది. ప్రొడ్యూసర్ బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ వేణు మంచి సినిమాలు రూపొందించి దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకమైన ముద్రవేసుకున్నాడు. ◻



'హల్కా డాన్'లో ప్రమోద్ ఫస్ట్ కట్

రీసెంట్ బ్లాక్ బస్టర్ 'లెనిన్'చిత్రంలో అద్భుతమైన నటనతో కన్నడ నటుడు ప్రమోద్ తెలుగు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. కన్నడలో హీరోగా ప్రమోద్‌కి మంచి క్రేజ్ ఉంది. తెలుగు ప్రేక్షకులకు మాత్రం లెనిన్ చిత్రంతో దగ్గరయ్యారు. అలాంటి ప్రమోద్ ఇప్పుడు హీరోగా 'హల్కా డాన్' అంటూ రాబోతోన్నారు. కన్నడ, తుళు, తెలుగు భాషల్లో ఈ చిత్రం రానుంది. ఈ క్రమంలో సినిమాకి సంబంధించిన ఫస్ట్ కట్ టీజర్‌ను విడుదల చేశారు.ఈ టీజర్ పూర్తిగా



మాస్, యాక్షన్ లవర్స్‌కి ట్రీట్‌లా ఉంది. మాస్ ఆడియెన్స్‌కి నచ్చే, వారు మెచ్చే ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలతో టీజర్‌ను కట్ చేశారు. ప్రమోద్ రఫ్ లుక్, బాడీ లాంగ్వేజ్, హావభావాలు అన్నీ కూడా సరికొత్తగా ఉన్నాయి. సరికొత్త మాస్ అవతార్‌లో ప్రమోద్ కనిపించబోతోన్నారు. ఈ చిత్రాన్ని కన్నడ, తుళు, తెలుగు భాషల్లో ఏకకాలంలో విడుదల చేయడానికి సిద్ధమవుతున్నారు. వీనస్ ఎంటర్‌టైనర్స్ బ్యానర్‌పై శ్రీకాంత్ కేపీ, మాధవ్ సిరాన్, మానిస్ ప్రొడక్షన్స్ భాగస్వామ్యంతో నిర్మించిన ఈ చిత్రానికి చాల రచన, దర్శకత్వం వహించారు. ◻



మహిళల, పురుషుల బాక్సింగ్: ఫైనల్స్‌కు గుంజన్, మీటెయ్

డాకర్ (సెనెగల్): డాకర్‌లో జరుగుతున్న 2026 సమ్మర్ యూత్ ఒలింపిక్స్‌లో, మహిళల, పురుషుల బాక్సింగ్‌లో భారత బాక్సర్లు గుంజన్, అంబేకర్ మిటెయ్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. గుంజన్ సెమీఫైనల్స్‌లో గ్రేట్ బ్రిటన్‌కు చెందిన లిల్లీ బాసెట్‌ను 4-1 తేడాతో ఓడించి మహిళల 48 కేజీల ఫైనల్‌కు దూసుకెళ్లింది. దీంతో ఈ క్రీడల్లో స్వర్ణ పతకం సాధించేందుకు భారత్‌కు మరో అవకాశం లభించింది. ఐదుగురు న్యాయనిర్ణేతలలో నలుగురు గుంజన్‌కు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో, ఆమె పాయింట్ల ఆధారంగా గెలుపొందింది. ఈ పోరులో 30-27, 29-28, 28-29, 29-28, 30-27 స్కోర్లు నమోదయ్యాయి. ఆమె స్వర్ణం కోసం జరిగే పోరులో అల్జీరియాకు చెందిన బౌతైనా బెన్సలాతో తలపడనుంది. అంతకుముందు క్వార్టర్ ఫైనల్స్‌లో మెక్సికోకు చెందిన అటెనా సోఫియా జువారెజ్ కాలెరోపై 5-0 తేడాతో ఆధిపత్యం చెలాయించి చివరి నాలుగు స్థానాలకు చేరుకున్న గుంజన్, భారత్‌కు పతకాన్ని ఖాయం చేసింది. అలాగే కొలంబియాకు చెందిన ఇజోన్ జెఫ్రీ గాలియా అరెవాలోపై 5-0 తేడాతో సంపూర్ణ విజయం సాధించి భారత బాక్సర్ మీటెయ్ పురుషుల 50 కేజీల ఫైనల్‌లోకి దూసుకెళ్లాడు. ఐదుగురు న్యాయనిర్ణేతలు అతనికి అనుకూలంగానే స్కోర్ చేశారు. దీంతో స్కోర్‌కార్డులు 28-27, 28-27, 28-27, 29-26, 28-27గా నమోదయ్యాయి. స్వర్ణ పతకం కోసం మీటే ఐర్లాండ్‌కు చెందిన క్రిస్టియన్ జుబానీతో తలపడనున్నాడు.



ఆసియా కప్: అఫ్ఘాన్‌ను 8 వికెట్లతో

చిత్తు చేసిన భారత్

14న ఫైనల్స్‌లో పాకిస్థాన్‌తో ఢీ

మస్కట్: అండర్ 19 ఆసియా కప్ 2026 టోర్నీలో భారత్ ఫైనల్ చేరింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన భారత్ 8 వికెట్ల తేడాతో అఫ్గానిస్థాన్‌ను చిత్తు చేసింది. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందాని(93) అద్భుతమైన బ్యాటింగ్‌తో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 227 పరుగులు చేసింది. నోమన్ సలార్జాయ్(51), షా ఫైజల్ రహిమి(51) హాఫ్ సెంచరీలతో రాణించగా, సోహైల్ ఖాన్(36 నాటౌట్) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్(3/43) మూడు వికెట్లు, ఆర్యన్ సవ్సాని(2/29) రెండు వికెట్లు పడగొట్టారు. కావ్య పరేష్ పటేల్, యశ్‌బర్ధన్ చౌహన్, అర్జున్ రాజ్‌పుత్ తలో వికెట్ తీసారు. అనంతరం భారత్ 36.5 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 230 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ లక్ష్య తృటిలో శతకం చేజార్చుకోగా ఆర్యవీర్ సెహ్వాగ్(51), వీకే వినీత్(57 నాటౌట్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అఫ్గాన్ బౌలర్లలో నూర్ అలీ నైజాయ్(1/47), సోహైల్ ఖాన్(1/56) చెరో వికెట్ తీసారు. 228 పరుగుల స్వల్ప లక్ష్యఛేదనలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు లక్ష్య, ఆర్యవీర్ సెహ్వాగ్ దూకుడుగా ఆడారు. దాంతో తొలి పవర్ ప్లేలోనే భారత్ వికెట్ నష్టపోకుండా 63 పరుగులు చేసింది. లక్ష్య, ఆర్యవీర్ సెహ్వాగ్ హాఫ్ సెంచరీలతో అందుకున్నారు. దూకుడుగా ఆడిన సెహ్వాగ్‌ను నూర్ అలీ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 117 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన వీకే వినీత్‌తో కలిసి లక్ష్య సెంచరీ దిశగా సాగాడు. కానీ అతన్ని సోహైల్ ఖాన్ క్యాచ్ ఔట్ చేయగా, యశ్‌బర్ధన్ చౌహన్(16 నాటౌట్) సాయంతో వినీత్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.





ఆట

నేడు కివీస్‌తో కీలక పోరు

టీమిండియా కెప్టెన్‌గా శ్రేయస్.. గిల్, కేఎల్ ఔట్.. ఇషాన్, రుతురాజ్‌కు ఛాన్స్

మోంట్ మోంగనుయ్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో టీమిండియా ఇప్పటికే రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి 2-0 ఆధిక్యంలో నిలిచింది. మూడో వన్డే వర్షం కారణంగా రద్దు కావడంతో, సిరీస్‌ను కైవసం చేసుకోవడానికి భారత్‌కు మిగిలిన రెండు మ్యాచ్‌లలో ఒక్కటి గెలిచినా సరిపోతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 13న జరగనున్న నాలుగో వన్డే కోసం భారత జట్టులో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడు. న్యూజిలాండ్‌తో రాబోయే టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం అతడు ముందుగానే వెల్లింగ్టన్‌కు బయలుదేరాడు. దీంతో టీమిండియా పగ్గాలను స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ చేపట్టనున్నాడు. ఇక రోహిత్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే బాధ్యత రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించే అవకాశం ఉంది. పవర్‌ప్లేలో దూకుడుగా ఆడి శుభారంభం అందించాలనే కసితో రుతురాజ్ బరిలోకి దిగనున్నాడు. ఇది అతడికి తనను తాను నిరూపించుకునే అరుదైన అవకాశం. మూడో స్థానంలో ఆధార స్తంభం విరాట్ కోహ్లీ దిగడం ఖాయం. ఈ పర్యటనలో కింగ్ కోహ్లీ నిలకడైన ఫామ్‌లో ఉన్నాడు. నాలుగో స్థానంలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ స్వయంగా బ్యాటింగ్‌కు రానున్నాడు. ఐదో స్థానంలో యువ సంచలనం తిలక్ వర్మ కొనసాగనున్నాడు. అసలు కీలక మార్పు వికెట్ కీపర్ స్థానంలోనే. చివరి రెండు వన్డేలకు అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్ జట్టులో ఉండడు. దీంతో ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు విధ్వంసక వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు మేనేజ్‌మెంట్ జై కొట్టినట్టు తెలుస్తోంది. మిడిలార్డర్‌లో ఎడమకుడి కాంబినేషన్ కోసం, వేగంగా పరుగులు రాబట్టేందుకు ఇషాన్ ఎంపిక వ్యూహాత్మక నిర్ణయంగా కనిపిస్తోంది.

ఇక ఆల్‌రౌండర్ కోటాలో అక్షర్ పటేల్‌కు చోటు దాదాపు ఖరారైనట్టే. అతడు స్పిన్‌తో పాటు లోయర్ ఆర్డర్‌లో కీలక పరుగులు అందించగలడు. పేస్ దళానికి మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు యువ పేసర్ ఆకిబ్ నబీ నాయకత్వం వహించనున్నారు. స్పిన్ బాధ్యతలను కుల్దీప్ యాదవ్ మోయనుండగా, అతడికి అక్షర్ పటేల్ అండగా నిలవనున్నాడు. మొత్తంగా చూస్తే సిరీస్ గెలిచే క్రమంలో బెంచ్ బలాన్ని పరీక్షించాలన్నది మేనేజ్‌మెంట్ ఆలోచనగా కనిపిస్తోంది.

అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ క్లీన్‌స్వీప్

5-0తో న్యూజిలాండ్ విజయం

ఆక్లాండ్: గురువారం ఆక్లాండ్‌లో జరిగిన తమ తొలి అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో, జెస్సీ రాండాల్ రెండు గోల్స్ చేయగా, కెప్టెన్ వుడ్ ఒక గోల్ చేశాడు. దీంతో న్యూజిలాండ్ భారత్‌పై ఐదు గోల్స్‌తో క్లీన్‌స్వీప్ చేసింది. ఐదవ నిమిషంలో జరిగిన ఎదురుదాడిలో, ప్రమ్‌వీర్ బంతిని క్లియర్ చేయగా బిజోయ్ వర్గీస్ దాన్ని డిఫ్లెక్ట్ చేసి ఇండియా నెట్‌లోకి పంపడంతో ఆల్ వైట్స్ జట్టు స్కోరింగ్‌ను ప్రారంభించింది. ఆట మొదలైన అరగంట తర్వాత, రాండల్ భారత రక్షణ శ్రేణిని ఇబ్బంది పెడుతూనే ఉండి, 10 నిమిషాల వ్యవధిలో రెండు గోల్స్ చేశాడు. విరామం తర్వాత, న్యూజిలాండ్ కెప్టెన్ వుడ్ గోల్ చేశాడు. 57వ నిమిషంలో, కాలన్ ఇలియట్ ఇచ్చిన క్రాస్‌ను అతను పైకి లేచి నెట్‌లోకి పంపాడు. లియామ్ గిలియన్ అందించిన క్రాస్‌ను లాచ్లాన్ బేలిస్ అందుకుని, అద్భుతమైన హాఫ్‌వాలీ షాట్‌తో గోల్ చేసి స్కోరును 5-0కి చేర్చడంతో, అతిథి జట్టు పరిస్థితి మరింత దిగజారింది. 17 నెలల తర్వాత తుది జట్టులోకి తిరిగి వచ్చిన విశాల్ కైత్, బిల్ టుయిలోమా కొట్టిన బంతిని అద్భుతంగా ఆపి, ఆరో గోల్‌ను అడ్డుకున్నా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాగా భారత్ ఆల్ వైట్స్‌తో మరో స్నేహపూర్వక మ్యాచ్ ఆడనుంది.

చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్:

ప్రజ్ఞానంద, అర్జున్ డ్రా

బుడాపెస్ట్: టోటల్ చెస్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ టూర్ ఫైలట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు ఆర్. ప్రజ్ఞానంద, ఎరిగైసి అర్జున్ చెరొక రెండు డ్రాలతో తమ క్లాసికల్ ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రూప్ బి లో ప్రజ్ఞానంద జర్మనీకి చెందిన విన్సెంట్ కీమర్‌తో రెండుసార్లు డ్రా చేసుకోగా, గ్రూప్ డిలో అర్జున్ అమెరికన్ హన్స్ నీమాన్‌తో రెండు డ్రాలు నమోదు చేశాడు. ఇద్దరు భారతీయులు రోజును రెండు పాయింట్లతో ముగించారు. బరిలో ఉన్న మూడవ భారతీయ క్రీడాకారిణి ఆర్. వైశాలికి ఆరంభం కష్టంగా సాగింది. చివరి నిమిషంలో చేసిన పొరపాటు కారణంగా ఫ్రెంచ్ గ్రాండ్‌మాస్టర్ మాక్సిమ్ వాచియర్‌లాగ్రావ్‌తో జరిగిన తొలి గేమ్‌లో ఓడిపోయి, రిటర్న్ గేమ్‌లో డ్రాతో సరిపెట్టుకుంది. వచ్చే ఏడాది మహిళల ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం జూ వెన్‌జున్‌కు సవాలు విసరనున్న 25 ఏళ్ల వైశాలి, రెండు గేమ్‌లలో ఒక పాయింట్‌తో, వాచియర్‌లగ్రావ్ నాయకత్వం వహించిన గ్రూప్ డి లో చివరి స్థానంలో నిలిచింది. నీమాన్, వెస్లీ సో, బిబిసారా అసౌబాయేవాలతో కలిసి రెండవ స్థానాన్ని పంచుకున్న నలుగురు ఆటగాళ్లలో ఎరిగైసి ఒకరు. గ్రూప్ బి లో, ఫాబియానో కరువానా, లియమ్ లే చెరో నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, ప్రజ్ఞానంద, కీమర్ రెండో స్థానాన్ని పంచుకున్నారు.



తగ్గిన బంగారం ధరలు

పండుగల వేళ పెరిగిన పసిడి కొనుగోళ్లు



హైదరాబాద్, నవంబరు 12: బంగారం కొనుగోలుదారులకు ఇది నిజంగా శుభవార్త. పసిడి ధరలు గురువారం భారీగా క్షీణించాయి. బుధవారంనాటి ధరలతో పోలిస్తే 10గ్రాముల 24క్యారెట్ల బంగారంపై రూ. 2,180, 22 క్యారెట్ల బంగారంపై రూ. 2,000 మేర ధరతగ్గింది. ఈ భారీ తగ్గుదలతో కొనుగోలుదారులకు గొప్ప ఊరట లభించినట్లయింది. తాజా ధరల వివరాల ప్రకారం.. గురువారం ఉదయం హైదరాబాద్, విజయవాడల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,39,800 వద్ద నమోదైంది. అదేవిధంగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,28,150 వద్ద, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 1,04,850 వద్ద కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఇతర ప్రధాన నగరాలైన విశాఖపట్నం, వరంగల్, తిరుపతి, కాకినాడ, నిజామాబాద్‌లలో కూడా దాదాపు ఇవే ధరలు అమలవుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో పసిడి ధరలు స్వల్పంగా ఎక్కువగా ఉన్నాయి. అక్కడ 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,39,950గా నమోదైంది. అయితే, అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల ప్రభావంతో బంగారంధరల్లో రోజూ పలు మార్పులు చోటుచేసుకుంటాయి. కాబట్టి, కొనుగోలుచేసే ముందు తాజాధరలను స్థానిక జువెలరీ షోరూమ్‌లలో మరోసారి నిర్ధారించుకోవడం ఉత్తమం.

పెరిగిన పసిడి కొనుగోళ్లు:

ధంతేరాస్, దీపావళి పండగల సీజన్‌లో భారతీయులు బంగారం, వెండి కొనుగోళ్లపై భారీగా ఆసక్తి చూపించారు. ఇటీవల రికార్డు స్థాయిలకు చేరిన పసిడి ధరలు కాస్త తగ్గడంతో వినియోగదారులు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. గత యేడాది ఇదే సమయంతో పోలిస్తే ఈసారి బంగారం అమ్మకాలు ఏకంగా 30శాతం పెరిగాయని ఇండియా బులియన్ అండ్ జువెలర్స్ అసోసియేషన్ (ఐబిజెఎ) వెల్లడించింది. ఐబిజెఎ నివేదిక ప్రకారం.. ఈ పండగ సీజన్‌లో దేశవ్యాప్తంగా సుమారు 52 టన్నుల బంగారం అమ్ముడైంది. దీని విలువ దాదాపు రూ.72,000 కోట్లుగా అంచనా వేశారు. అదే సమయంలో వెండి అమ్మకాలు కూడా 10 శాతం పెరిగి 300 టన్నులకు చేరాయి. దీని విలువ సుమారు రూ.5,400 కోట్లు.

ఈ అమ్మకాల పెరుగుదలపై ఐబిజెఎ జాతీయ కార్యదర్శి సురేంద్ర మెహతా మాట్లాడుతూ.. "ఈ యేడాది ధంతేరాస్, దీపావళికి జువెలరీ వ్యాపారం చాలా బాగా జరిగింది" అని తెలిపారు. ధరలు తగ్గుముఖం పట్టడంతో గతంలోకొనుగోళ్ల వాయిదా వేసుకున్న వినియోగదారులు ఇప్పుడు మళ్లీ మార్కెట్లకు వచ్చారని ఆయన వివరించారు.

ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు వరకు చూస్తే, అధిక ధరలు, దిగుమతి సుంకాల పెరుగుదల, బంగారం కొనుగోళ్లను తగ్గించుకోవాలన్న ప్రధాని మోడీ విజ్ఞప్తి వంటి కారణాలతో పసిడి అమ్మకాలు దాదాపు 50శాతం పడిపోయాయి. అయితే, తాజా పండగ సీజన్‌లో కనిపించిన ఉత్సాహం, వినియోగదారులలో సెంటిమెంట్ మెరుగుపడిందని సూచిస్తోంది.

పెరిగిన రిటైల్ ద్రవ్యోల్బణం



న్యూఢిల్లీ, నవంబరు 12: దేశంలో ఆహార పదార్థాల ధరలు మండిపోతుండటంతో అక్టోబరు నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.09 శాతానికి ఎగబాకింది. సెప్టెంబరులో 5.54 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, ఆహార వస్తువుల ధరలు, సరఫరాలో ఏర్పడిన అంతరాయాల కారణంగా భారీగా పెరిగినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన డేటాలో వెల్లడించింది. దేశంలో వినియోగదారుల ధరలు వరుసగా పెరగడం ఇది 12వ నెల కావడం గమనార్హం. ఈ యేడాది ఫిబ్రవరి 12న రిటైల్ ద్రవ్యోల్బణ ఆధార సంవత్సరాన్ని 2012 నుండి 2024కు మారుస్తూ కేంద్రం ఆధునికీకరించింది. తాజా గణాంకాల ప్రకారం ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ నిర్దేశించుకున్న 2 నుండి 6 శాతం లక్ష్య పరిధిని దాటిపోయింది. రాయిటర్స్ నిర్వహించిన సర్వేలో దాదాపు సగం మంది ఆర్థికవేత్తలు ద్రవ్యోల్బణం 6 శాతం మార్కును తాకుతుందని లేదా దాటుతుందని ముందే అంచనా వేశారు. సామాన్యుల వంటింటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతూ.. ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబరులో ఉన్న 7.74 శాతం నుండి అక్టోబరులో 8.94 శాతానికి చేరుకుంది. అసమాన, లోటు వర్షపాతం కారణంగా నిత్యావసర సరుకుల సరఫరా దెబ్బతి నడం దీనికి ప్రధాన కారణమైంది. వినియోగ దారుల ధరల సూచీలో దాదాపు 40 శాతం వాటా కలిగిన ఆహార ధరలు రిటైల్ ద్రవ్యోల్బణ పెరుగు దలకు ప్రధాన చోదకంగా నిలిచాయి. యేడాది ప్రారంభంతో పోలిస్తే ఉల్లి ధరలు దాదాపు రెట్టింపు కాగా, ప్రొటీన్ అధికంగా ఉండే మాంసం, పాలు, గుడ్ల ధరలు కూడా భారంగా మారాయి. అంతర్జాతీయ మార్కెట్లో వంటనూనెలు, ఇతర సరుకుల ధరలు పెరగడం దేశీయ మార్కెట్‌పై మరింత ఒత్తిడిని పెంచింది. అక్టోబరులో ఆహార ద్రవ్యో ల్బణం 8.20శాతానికి, మొత్తం రిటైల్ ద్రవ్యో ల్బణం 5.93శాతానికి చేరవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేయగా, అంతకంటే ఎక్కువగానే నమోదయింది.

ఇంధన, ముడిసరుకుల ధరల పెరుగుదల ప్రభావం కోర్ ద్రవ్యోల్బణంపై స్పష్టంగా కనిపిస్తోందని 360 వన్ అసెట్ సీనియర్ ఎకనామిస్ట్ విక్రమ్ ఛాబ్రా పేర్కొన్నారు. రిజర్వాయర్లలో నీటి మట్టాలు తక్కువగా ఉండటం రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, రాబోయే కొద్ది నెలల పాటు ద్రవ్యోల్బణం ఆర్‌బిఐ గరిష్ట పరిమితి అయిన 6 శాతానికి పైనే కొనసాగే అవకాశం ఉందని ఆయన విశ్లేషించారు. అయితే ముడిచమురు ధరల తగ్గుదల, రూపాయి విలువ బలపడటం ఆర్‌బిఐకి కొంత ఊరటనిచ్చే అంశాలైనప్పటికీ, మరో 25 బేసిస్ పాయింట్ల మేర వడ్డీరేట్ల పెంపు ఉండవచ్చని అంచనా వేశారు. మాంసం, చేపలు, నూనెలు, పండ్లు, కూరగాయలు, చక్కెర వంటి పలు ఆహార విభాగాల్లో ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి చేరే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.



నోయెల్ టాటా రాజీనామా

టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి గుడ్‌బై

పలు కంపెనీల నుంచి పదవీ విరమణ



భోపాల్, నవంబరు 12: టాటా గ్రూప్‌లో కీలకమైన నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. సుప్రసిద్ధ పారిశ్రామికవేత్త, టాటా కుటుంబ సభ్యుడు నోయెల్ టాటా, గ్రూపులోని పలు కంపెనీల నుంచి పదవీ విరమణ చేశారు. టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ (టిఐసి) చైర్మన్, డైరెక్టర్ పదవుల నుంచి ఆయన వైదొలగడంతో 16 యేళ్లకు పైగా సాగిన ఆయన సారథ్య శకం ముగిసింది. ఆయన సేవలకు గుర్తింపుగా కంపెనీ బోర్డు ఆయన్ను చైర్మన్ ఎమెరిటస్‌గా గౌరవప్రదంగా నియమించింది. టాటా గ్రూప్ పాలనా మార్గదర్శకాల ప్రకారం నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్‌ఇండిపెండెంట్ డైరెక్టర్లకు 70యేళ్ల పదవీ విరమణ వయసుగా నిర్దేశించారు. ఈ నెలలో నోయెల్ టాటా 70వ పడిలోకి అడుగు పెట్టడంతో ఈ నిర్ణయం అమల్లోకివచ్చింది. బుధవారంతో ఆయన పదవీకాలం ముగియగా, ఆయన స్థానంలో ప్రముఖ కార్పొరేట్ న్యాయవాది, ఎజడ్‌బి పార్ట్‌నర్స్ సహ వ్యవస్థాపకుడు బ్రహ్మ్ వాకిల్ నేటి నుంచి కొత్తచైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. నోయెల్ టాటా నాయకత్వంలో కంపెనీ గణనీయమైన వృద్ధిని సాధించిందని, వాటాదారులకు సుస్థిరమైన విలువను అందించిందని కంపెనీ ఒక ప్రకటనలో కొనియాడింది.

స్టాక్ మార్కెట్.. స్వల్ప లాభాలే

4 శాతం పెరిగిన రియాల్టీ సూచీ



ముంబై, నవంబరు 12: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ముగిశాయి. రియల్టీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాలషేర్లలో కొనుగోళ్ల సూచీలకు అండగా నిలిచాయి. ఆటో షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేసింది. సెన్సెక్స్ 31.61 పాయింట్లు పెరిగి 81,911.01 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 44.30 పాయింట్లు లాభపడి 25,299.35 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు ప్రధాన సూచీల కంటే మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్100 సూచీ 0.85 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్100 సూచీ 1.12 శాతం చొప్పున పెరిగాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ రియల్టీసూచీ ఏకంగా 4శాతం ఎగబాకి అగ్రస్థానంలో నిలిచింది. పిఎస్‌యు బ్యాంక్, మీడియా, బ్యాంక్ సూచీలు కూడా లాభపడ్డాయి. మరోవైపు నిఫ్టీ ఆటో సూచీ అత్యధికంగా నష్టపోయింది. నిఫ్టీ షేర్లలో మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లే ఇండియా, పవర్‌గ్రిడ్ నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ గత రెండు మూడు ట్రేడింగ్ సెషన్లుగా పరిమిత శ్రేణిలో కదులుతున్నప్పటికీ, మొత్తం మీద సానుకూల ధోరణి కొనసాగుతోందని మార్కెట్ నిపుణులు తెలిపారు. సూచీ ఓవర్‌బాట్ స్థాయిలో ఉండటంతో స్వల్ప దిద్దుబాటుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. 25,000 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు, 24,800 వద్ద కీలక మద్దతు ఉన్నాయని అంచనా వేశారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.